
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 337

సోమవారం 19-8-2024



కమల కంటే అందంగా కనిపిస్తా

ప్రత్యర్థిపై వ్యక్తిగత దాడులకు దిగిన అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ - 6లో



రియల్టీలో 'సిప్' చేద్దామా!

రూ.140 ఉన్నా పెట్టుబడికి వీలు.. స్థిరమైన ఆదాయానికి మార్గం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

దారుణంగా అవమానించారు



ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలే తనను దారుణంగా అవమానించారని, దాంతో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వచ్చిందని జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్ అన్నారు. బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం నేపథ్యంలో చంపయ్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు.

వివరాలు 6లో ▸

విశాఖ శిశు విక్రయ కేసులో ట్విస్ట్



విశాఖ శిశు విక్రయ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అంతర్రాష్ట్ర ముఠా హస్తం ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ఒడిశా, కడప, అనకాపల్లికి ప్రత్యేక బృందాలను పంపించినట్లు సమాచారం.

వివరాలు 14లో ▸

కుప్పంలో జల్లికట్టు.. 10 మందికి పైగా గాయాలు



చిత్తూరు జిల్లా కుప్పం మండలం చెక్కునత్తంలో టీడీపీ నేతలు భారీగా ఎంట్రీ ఫీజులు వసూలు చేసి.. ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా జల్లికట్టు నిర్వహించారు. దీంతో పది మందికి పైగా యువకులు గాయపడ్డారు.

వివరాలు 10లో ▸

దీప్తి సిక్సర్... లండన్ విన్నర్

మహిళల 'హండ్రెడ్' టోర్నీ ఫైనల్లో మెరిసిన భారత ఆల్‌రౌండర్

12లో



పెంఛన్లపై పిడుగు

పేదల పింఛన్లు భారీగా తొలగించేందుకు చంద్రబాబు కొత్త ఎత్తు

ఎన్నో ఏళ్లుగా లబ్ధిదారులుగా ఉన్న వారికి నోటీసులు

గ్రామాల్లో మళ్లీ 2014-19 నాటి తరహా జన్మభూమి కమిటీల పెత్తనం

- ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరుల పేర్లు తొలగించాలని కూటమి నేతల ఒత్తిళ్లు
- పింఛన్ల తగ్గింపే లక్ష్యం.. తప్పుడు ఫిర్యాదులు మొదలు.. అధికారుల నోటీసులు
- పేర్లు తొలగింపునకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు వెసులుబాటు
- ఇందులో భాగంగా సాధ్యం కాని అడ్డగోలు నిబంధనలతో నోటీసుల జారీ
- దివ్యాంగ లబ్ధిదారులు 15 రోజుల్లోనే కొత్త సదరం సర్టిఫికెట్ ఇవ్వాలట
- మూడు నెలలకొకసారి సదరం స్లాట్లు విడుదలైతే ఇదెలా సాధ్యం?
- వృద్ధులు మూడు రోజుల్లో ఆధార్ అప్‌డేట్ హిస్టరీ ధ్రువీకరణ ఇవ్వాలట
- ఇంత తక్కువ వ్యవధిలో అధికారులతో సర్టిఫికెట్ ఎలా తెచ్చుకుంటారు?
- పక్కా కుట్ర, కుతంత్రాలతో పింఛన్ ఎగ్గొట్టేందుకే అలవిగాని నిబంధనలు
- కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమే లేదు

2లో

సూపర్ సిక్స్ హామీలిచ్చారు.. ఇంకా వాటిని ఎందుకు అమలు చేయడంలేదన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇప్పటికే అమలవుతున్న పథకాలలో కోతలకు మాత్రం కత్తులు నూరుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులన్న కనికరం లేకుండా పింఛన్లు ఎగ్గొట్టడానికి దారులు వెతుకుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాబితాలు సిద్ధం చేశారు. ఇప్పటికే పలువురు లబ్ధిదారులకు నోటీసులు అందాయి. ఇంకా అందుతున్నాయి. ఎన్టీఆర్ భరోసా పోర్టల్‌లో పెన్షన్ లబ్ధిదారులకు నోటీసులిచ్చేందుకు, వెరిఫై చేసేందుకు, పెన్షన్ తొలగించడానికి ఎంపీడీవోలకు ఆప్షన్ ఇచ్చేశారు. కొత్త పెన్షన్ చేర్చడానికి మాత్రం ఎలాంటి ఆప్షన్ ఇవ్వలేదు. దీనిని బట్టి అర్థమవుతున్నదేమిటంటే పెన్షన్‌లను పెద్ద ఎత్తున తొలగించబోతున్నారు. కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వబోవడం లేదు..



పింఛను లబ్ధిదారునికి పల్నాడు జిల్లా శావల్యాపురం ఎంపీడీవో జారీ చేసిన నోటీసు

బాలికపై బస్సులో

సామూహిక అత్యాచారం

ఉత్తరాఖండ్‌లో దారుణం



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా ఆందోళనలు కొనసాగుతుండగానే ఉత్తరాఖండ్‌లో మరో ఘాతుకం జరిగింది. డెహ్రాడూన్‌లో ఉత్తరాఖండ్ రోడ్‌వేస్‌కు చెందిన బస్సులో 15 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈనెల 12న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. ఇద్దరు డ్రైవర్లు సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. 6లో

సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు



- కోల్‌కతా డాక్టర్ హత్యోదంతంపై రేపు విచారణ
- విచారణ చేపట్టనున్న జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం

6లో

ఇక ఊదండి బాకా..

- శ్రీసిటీలో నేడు 16 పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మళ్లీ ప్రారంభోత్సవం
- ఎనిమిది పరిశ్రమలకు మళ్లీ భూమి పూజ
- వీటన్నింటిలో గత వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఉత్పత్తి ప్రారంభం
- పరిశ్రమలు క్యూ కట్టాయని చెప్పుకునేందుకు పాట్లు
- నేడు శ్రీసిటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

3లో



భూమి పూజ జాబితాలో ఉన్న శ్రీసిటీలోని బ్లూ స్టార్ పరిశ్రమ

ఉల్లి రేటు.. మహా ఘాటు



బహిరంగ మార్కెట్‌లో రూ.60

- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
- ఐదేళ్ల తరువాత భారీగా పెరిగిన ఉల్లి ధరలు
- 2022-23లో కర్నూలు జిల్లాలో 26,970 హెక్టార్లలో సాగు.. ఈ ఏడాది 8,153 హెక్టార్లతో సరి
- వర్షాభావంతో గణనీయంగా పడిపోయిన విస్తీర్ణం



5లో

కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులలో ఉల్లి సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోవడం.. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధిక వర్షాలకు పంట దెబ్బతినడం.. ఇతర దేశాలకు ఎగుమతులు పెరగడం వంటి పరిస్థితుల్లో ఉల్లి ధరలు ఈ ఏడాది గణనీయంగా పెరిగాయి. రిటైల్ మార్కెట్లో రూ. 60కి పైగా ధర పలుకుతుండటంతో ఉల్లి కొనాలంటే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఎగుమతులు నిషేధించి ధరలు తగ్గేలా కేంద్రం చర్యలు తీసుకోవడంతో పాటు నాఫెడ్ ఆధ్వర్యంలోని నిల్వలను కూడా మార్కెట్‌లోకి పంపితేనే ధరలు తగ్గు ముఖం పడతాయంటున్నారు.

పత్తికొండ హత్య కేసులో

టీడీపీ నేతే హంతకుడు

- రాజకీయ ఆధిపత్యంలో భాగంగానే ఆ పార్టీ నేత శ్రీనివాసులు హత్య
- కేసులో ప్రధాన నిందితుడు నరసింహులు హోసూర్‌లోనే అదే పార్టీ నేత
- ఆధిపత్యం కోసం సహచర నేతను హత్యచేసిన మరో నేత
- వైఎస్సార్‌సీపీనే హత్యచేసిందని ఉద్దేశ పూర్వకంగా మంత్రి లోకేశ్ ట్వీట్
- మంత్రులు అనిత, బీసీ జనార్థన్‌రెడ్డి ఆయనకు తానాతందానా
- టీడీపీ నేతే హంతకుడు అని తేలడంతో బట్టబయలైన లోకేశ్ అసత్య ప్రచారం
- హత్య కేసును ఛేదించి వివరాలు వెల్లడించిన పోలీసులు

10లో

ఇంటూజిగేట్





70 రోజులుగా కార్యకలాపాలు నిలిచిపోయిన టెక్కలి మండలం జీడిపేట సమీపంలో గల డిజైనర్ రాక్స్ క్వారీ

ఉపాధికి గడ్డుకాలం

- శ్రీకాకుళం జిల్లాలో మూతబడ్డ గ్రానైట్ పరిశ్రమలు
- నూతన పాలసీ ముసుగులో మూసివేసిన సర్కార్
- ఆర్థిక కష్టాల్లో యజమానులు.. పనుల్లేక కార్మికుల పస్తులు
- జిల్లాలో ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా 45 వేల మంది ఉపాధికి దెబ్బ

14లో

ఖాకీ వనంలో 'కలుపు' వృక్షం

- టీడీపీ సేవలో పేట్రేగిపోతున్న కుప్పం అర్బన్ సీఐ
- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు
- టీడీపీలో చేరకపోతే అక్రమ కేసులతో జైలుపాల్జేస్తున్న వివాదాస్పద అధికారి
- తాజాగా.. కుప్పం మండల కన్వీనర్, కుమారుడిపై అక్రమ కేసులు.. జైలుపాలు
- రెండునెలల్లో మరో ఐదుగురిపై అక్రమ కేసులతో వేధింపులు
- కూటమి ప్రభుత్వం రాగానే కుప్పం పగ్గాలు
- అప్పటినుంచి దందాలు, దౌర్జన్యాలతో రెచ్చిపోతున్న 'పచ్చ' పోలీసు.. గతంలో ఓ హత్య కేసులో నిందితులకు సహకరించడంతో వీఆర్‌కి..

5లో

■ కక్ష గట్టి.. తాగునీటినీ అడ్డుకుని




టీడీపీ నేతల అరాచకానికి అడ్డుకట్ట పడటం లేదు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కాంట్రాక్టును తమకు కట్టబెట్టలేదన్న కారణంతో గ్రామంలో తాగునీటి సరఫరాను నిలుపుదల చేయించారు. దీంతో గ్రామస్తులు ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం గొబ్బూరులో మంచినీటి కొరత తీర్చేందుకు సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తున్నారు. అయితే ఈ నీటి సరఫరా కాంట్రాక్టును టీడీపీ నేతలకు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేయించలేదన్న కారణంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరాను నిలుపుదల చేయించారు. శనివారం నుంచి ట్యాంకర్లు రాకపోవడంతో తాగునీరందక జనం నానా అగచాట్లు పడ్డారు. టీడీపీ నేతల తీరుపై ఆగ్రహోదగ్రులయ్యారు. జనానికి మంచినీరు కూడా అందనివ్వరా.. అంటూ ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై దాదాపు గంటపాటు బైఠాయించారు.

- పెద్దారవీడు

పింఛన్లపై పిడుగు

కుడి చేత్తో ఇచ్చి.. ఎడమ చేత్తో లాక్కోవడం అంటే ఇదే మరి. ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పింది ఒకటి.. ఇప్పుడు చేస్తున్నది మరొకటి. ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, అమలవుతున్న పథకంలో లబ్ధిదారుల్లో కోతలు పెడుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులన్న కనికరం లేకుండా పింఛన్లు ఎగ్గొట్టడానికి కంకణం కట్టుకున్నారు. లబ్ధిదారులందరికీ పింఛన్లు ఇవ్వలేనని చెప్పలేక ఇలా దొడ్డిదారిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పేర్లు తొలగించడానికి 'పచ్చ' జెండా ఊపారు. మాకు కావాల్సింది ఇదేనంటూ ఊరూరా 'తమ్ముళ్లు' తమకు నచ్చని వారి పేర్లతో జాబితాలు సిద్ధం చేసి అధికారుల ద్వారా నోటీసులిప్పిస్తున్నారు.



పేదల పింఛన్లు భారీగా తొలగించేందుకు చంద్రబాబు కొత్త ఎత్తు

- నెల నుంచి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న టీడీపీ నేతలు
- ఎన్నో ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న వారికి నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- గ్రామాల్లో మళ్లీ 2014-19 నాటి తరహా జన్మభూమి కమిటీల పెత్తనం
- ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరుల పేర్లు తొలగించాలని అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు
- పక్కా కుట్ర, కుతంత్రాలతో పింఛన్ ఎగ్గొట్టేందుకే అలవిగాని నిబంధనలు


సాక్షి, అమరావతి: సామాజిక పింఛన్లకు కోతలు పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏళ్ల తరబడి ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులకు 'మీ పింఛను తాత్కాలికంగా నిలుపుదల చేయడమైంది' అంటూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల గ్రామాల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు తమకు నచ్చని పింఛను లబ్ధిదారులను టార్గెట్ చేసి.. స్థానిక అధికారులకు లేనిపోని ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో అలాంటి వారి పింఛన్ తొలగింపునకు అధికారులు నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అనర్హులుగా గుర్తించిన వారి పేర్లను ప్రభుత్వ అధికారిక సామాజిక పింఛన్ల ఆన్‌లైన్ పోర్టల్ నుంచి తొలగించే వెసులుబాటును ఆయా మండల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఉన్నతాధికారులు రాష్ట్ర వ్యాప్తంగా సంబంధిత అధికారులకు మొబైల్ మేసేజ్ రూపంలో సమాచారం ఇచ్చారు.

చెప్పినట్లు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి

గత ఐదేళ్లలో ఏ పైరవీలు, రాజకీయ పక్షపాతాలకు తావు లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ డబ్బులు తీసుకున్న పేద లబ్ధిదారులకు మళ్లీ రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయి. అప్పట్లో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో గ్రామాల్లో జన్మభూమి కమిటీల ఆగడాల తరహాలోనే ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలోనూ అధికార పార్టీ నాయకులు తమకు నచ్చని పింఛను లబ్ధిదారులను టార్గెట్ చేస్తున్నారు. స్థానిక అధికారులకు లేనిపోని ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదు చేయిస్తున్నారు. ఆపై పింఛన్ తొలగింపు నోటీసులు ఇప్పిస్తున్నారు. తాము చెప్పినట్లు చేయాలని కొన్ని చోట్ల బలవంతంగా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

అర్హతను నిరూపించుకోవడానికి గడువివ్వరా?

పేద లబ్ధిదారులు తాము పింఛను పొందేందుకు అర్హులమని నిరూపించుకోవడానికి వీలులేకుండా నోటీసులో అసాధ్యమైన గడువు విధిస్తున్నారు. దివ్యాంగులు తమ శరీర వైకల్యాలను ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు చేయించుకుని, తాను దివ్యాంగుడిగా నిరూపించుకునే సర్టిఫికెట్లు పొందడానికి 'సదరం'లో పేర్లు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రతి మూడు నెలలకొకసారి స్లాట్లు విడుదల చేస్తూ అవకాశం ఇస్తుంది. స్లాట్లు విడుదలైన మూడు రోజుల్లోనే 90 రోజులకు సరిపడా పేర్ల నమోదు పూర్తయిపోతోంది. మిగిలిన వారు మళ్లీ మూడు నెలల దాకా ఆగాల్సిన పరిస్థితి. అలాంటిది ఓ దివ్యాంగుడు ఎన్నో ఏళ్ల క్రితం వైద్య పరీక్షల అనంతరం తన శరీర వైకల్య సర్టిఫికెట్ పొంది, ప్రతి నెలా పింఛను డబ్బులు తీసుకుంటున్న నేపథ్యంలో.. 'ప్రస్తుతం నువ్వు అర్హత లేకుండా పింఛను పొందుతున్నావు. నీ శరీర వైకల్యాలకు సంబంధించి 15 రోజుల్లో కొత్తగా మళ్లీ వైద్యుల ద్వారా పరీక్షలు నిర్వహించుకుని, ఆ సర్టిఫికెట్ అధికారులకు అందజేయాలి' అని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అంటే ఈ లెక్కన ఉద్దేశ పూర్వకంగా అతని పింఛను శాశ్వతంగా తొలగించేందుకు రంగం సిద్ధమైందని ఇట్టే అర్థమవుతోంది. వృద్ధాప్య పింఛను పొందే లబ్ధిదారులకు ఇచ్చే నోటీసుల్లో కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఇచ్చి, ఆయా లబ్ధిదారుల ఆధార్‌లో మొదటి నుంచీ జరిగిన మార్పులు, చేర్పుల వివరాలతో కూడిన (అప్‌డేట్ హిస్టరీ ఫామ్) ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని నోటీసులు ఇస్తున్నారు. లేదంటే శాశ్వతంగా పింఛన్ రద్దు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.



సామాజిక పింఛన్లను రద్దు చేసేందుకు ఎంపీడీవోలకు అధికారం కల్పిస్తూ పోర్టల్‌లో చేసిన మార్పులు



పింఛను లబ్ధిదారునికి శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి ఎంపీడీవో జారీ చేసిన నోటీసు

ఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో..

- పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం శావల్యాపురం మండలం పరిధిలో అక్కడి స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదుల కారణంగా ఆ మండల పరిధిలోని కేవలం 8 గ్రామాల్లో 209 మంది లబ్ధిదారులకు ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేసే ప్రక్రియ చేపట్టారు.
- విజయనగరం జిల్లా గుర్ల మండలం చింతలపేట గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు 60 మంది లబ్ధిదారులకు ఎంపీడీవో నోటీసులు జారీ చేశారు.
- అన్నమయ్య జిల్లా రామాపురం మండలం హసనాపురం పంచాయతీలో 13 మంది దివ్యాంగ లబ్ధిదారులపై స్థానిక టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మండలాధికారులు నోటీసు జారీ చేశారు.
- శ్రీకాకుళం జిల్లా పరిధిలోని స్థానిక అధికార పార్టీ నాయకుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు నందిగాం మండలం నౌగాం పంచాయతీలో ఎనిమిది మంది దివ్యాంగులతో పాటు ఇద్దరు వృద్ధులు, కవిటి మండలంలో 9 మందికి నోటీసులు జారీ చేశారు. ఆమదాలవలసలో 8 మందికి, సరుబుజ్జిలి మండలం వ్యాసలిపేటలో 9 మంది లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చారు.
- శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించాలన్న టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు 730 మంది లబ్ధిదారులకు అధికారులు నోటీసులు అందజేశారు. ఒక్కో గ్రామంలో 10 నుంచి 50 మంది దాకా నోటీసులు ఇచ్చారు. కనగానపల్లి మండలం వేపకుంటలో 52 మందికి, భానుకోటలో 40 మందికి, నరసంపల్లిలో 25 మందికి, కోనాపురంలో 26 మందికి నోటీసులు ఇచ్చారు.

పార్టీ నేతల కనుసన్నల్లో 'పింఛన్లు'

జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత కొత్తగా ఏర్పడిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూలైలో తొలిసారి పింఛన్ల పంపిణీ చేసింది. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలోనే ఆ కార్యక్రమం కొనసాగినా, ప్రతి చోటా పంపిణీ మొత్తం అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. గతంలోనూ 2014-19 మధ్య వృద్ధులు, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్ల పంపిణీలో ప్రతి అంశంలోనూ అప్పటి అధికార టీడీపీకి సంబంధించిన జన్మభూమి కమిటీ సభ్యుల జోక్యం విపరీతంగా కొనసాగిన విషయం తెలిసిందే. 2019 తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ల మంజూరు మొదలు, పంపిణీలో ఎక్కడా ఏ రాజకీయ పార్టీ నాయకుడి జోక్యం లేకుండా, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పథకం అమలు కొనసాగిన విషయం తెలిసిందే. గత ఐదేళ్ల పరిస్థితికి పూర్తి భిన్నంగా జూలై, ఆగస్టు నెలలో జరిగిన పింఛన్ల పంపిణీలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల వెంట ఆ ప్రాంతంలోని స్థానిక అధికార పార్టీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తూ ఫొటోలు కూడా దిగారు. కొన్ని ప్రాంతాల్లో తమకు ఓటు వేయలేదన్న కారణంతో పింఛను డబ్బులు ఇవ్వకుండా ఆపేయించారు. పింఛన్ల పంపిణీలో ఆధిపత్యం కోసం పలు ప్రాంతాల్లో కూటమి పార్టీ నాయకులు పరస్పరం గొడవలు కూడా పడ్డారు.

2014-19లో సవాలక్ష నిబంధనలు

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛన్లు పొందేందుకు అర్హత ప్రమాణాలపై అప్పటి జన్మభూమి కమిటీల పేరుతో తనిఖీలు చేపట్టి లక్షల మంది పింఛన్లకు కోత పెట్టారు. రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రంలో 43.11 లక్షల మంది పింఛనుదారులు ఉన్న పరిస్థితిలో 2014 జూన్ 8వ తేదీన చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పట్లో సర్పంచి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు.. తదితర పదవులకు టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన నేతలతో జన్మభూమి కమిటీలు వేశారు. వారి ద్వారా పింఛన్లపై తనిఖీలు చేయించారు. దీంతో సెప్టెంబర్ నాటికి పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 39 లక్షలకు తగ్గిపోయింది. అంటే ఏకంగా నాలుగు లక్షల మందికి పైగా పింఛన్లను తొలగించారు. అప్పట్లో పింఛన్ల పంపిణీ సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో జన్మభూమి కమిటీ సభ్యులకే ఎక్కువగా భాగస్వామ్యం కల్పించారు. జన్మభూమి కమిటీ సభ్యులు ప్రతి పథకం మంజూరులోనూ లబ్ధిదారులు తమ పార్టీ వారా, కాదా అని నిర్ధారించుకుని.. పక్షపాతం చూపేవారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో పింఛన్ రద్దు అయిన లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించి తిరిగి పింఛన్ పొందిన విషయం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా...

అక్కచెల్లెమ్మలకు వైఎస్ జగన్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అక్కచెల్లెమ్మలంతా తమ జీవితాల్లో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

10మంది ప్రభుత్వ న్యాయవాదుల నియామకం



సాక్షి, అమరావతి: హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు 10 మంది ప్రభుత్వ న్యాయవాదులను (జీపీ) నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) వి.సునీత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జీపీలుగా నియమితులైన వారిలో రామారావు కొచిరి, పుల్లకూర నాగరాజు, బి.రామకృష్ణ నాయక్, పతివాడ రామకృష్ణ, యలమంజుల బాలాజీ, యగంటి సుష్మ, ఏ.జయంతి, జి.రామచంద్రరావు, బి.రాజేశ్వర రెడ్డి, తోట శ్రీనివాస రాయలు ఉన్నారు. ఈ 10 మందితో కలిసి ప్రభుత్వ న్యాయవాదుల సంఖ్య 16కి చేరింది.

ఏపీ జుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చక్రపాణి


చక్రపాణి అధ్యక్షుడు


లీలావతి ఉపాధ్యక్షురాలు

సాక్షి, అమరావతి/నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జి.చక్రపాణి ఎన్నికయ్యారు. చక్రపాణి గుంటూరు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఏపీ స్టేట్ జుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం విజయవాడ ల్యాండ్ అక్విజేషన్ కోర్టులో జరిగాయి. ఉపాధ్యక్షులుగా టి.లీలావతి, కె.శైలజ, జె.శ్రీనివాసరావు గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా నంబళ్ల రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ప్రదీప్ కుమార్, ఏ.కృష్ణ ప్రసాద్, జి.కార్తీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి.లీలా వెంకట శేషాద్రి, ఎస్‌పీడీ వెన్నెల, బి.రాధారాణి, డాక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీ న్యాయాధికారుల సంఘానికి తొలిసారి ఈ ఎన్నికలు జరిగాయి.

ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి


సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీలకు విద్యుత్ సంస్థల (ఏపీఎస్ఈబీ) పాత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. సచివాలయాల్లో 18 కేటగిరీలకు చెందిన ఉద్యోగులు వారికి కేటాయించిన విధులను మాత్రమే నిర్వర్తిస్తున్నారని, కానీ ఎనర్జీ అసిస్టెంట్లు మాత్రం సచివాలయాలు దాటి 15 కిలోమీటర్ల అవతల సీనియర్ విద్యుత్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్లకు కొత్త సర్వీస్ రూల్స్ ఇచ్చి వారి జీవితాలను అంధకారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పాత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, బయోమెట్రిక్ మినహాయింపు ఇవ్వాలని, ప్రొబేషన్ పిరియడ్ 2022 జూలైతోనే పూర్తయినట్లు ప్రకటించాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, కార్యదర్శి ఎం.బాలకాశి, ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సి.వి.మంజునాథ్ పాల్గొన్నారు.

హోదా, విభజన హామీలు అమలు చేయాలి

ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపకుడు దశరథరామిరెడ్డి


దీక్ష చేస్తున్న అఖిల పక్ష పార్టీల నాయకులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని ఆల్ ఇండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపకుడు ఎస్.దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా కోరుతూ ఆదివారం దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో పాల్గొన్న దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం మరో ఢాకా కాకముందే హోదా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమాల ద్వారానే రాష్ట్రానికి హోదా సాధ్యమన్నారు. పలు పార్టీల నేతలు దీక్షకు మద్దతు తెలిపారు.

ఆధునిక సదుపాయాలతో వైద్య రంగం ఎంత పురోగమిస్తున్నా జూనియర్ వైద్యుల (జూడా) వెట్టి చాకిరీకి మాత్రం తెర పడటం లేదు. ప్రాణం పోసే వైద్యులు ఒత్తిడితో ప్రాణాపాయ పరిస్థితిల్లో కూరుకుపోతున్నారు. తమతో యంత్రాలకన్నా ఘోరంగా పని చేయిస్తున్నారని జూడాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన రెసిడెంట్ వైద్యురాలు 36 గంటలుగా నిరంతరాయంగా విధుల్లో ఉన్నట్టు వెల్లడైంది. - సాక్షి, అమరావతి



విధిలేక విధులు..!

సుదీర్ఘ పని గంటలతో జూడాలు సతమతం

- నిరంతరాయంగా రెండు మూడు రోజులు విధులు
- జూడాలకు వారంలో 74 గంటల కంటే ఎక్కువ వద్దని ఎన్ఎంసీ సూచన
- కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్యురాలు 36 గంటలు విధుల్లోనే

ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతో ఏకదాటిగా రెండు, మూడు రోజులు పనిచేయించడంతో పనిభారం, మానసిక ఒత్తిడికి దారితీస్తోంది. ప్రతి నలుగురు ఎంబీబీఎస్, ఇతర యూజీ కోర్సుల విద్యార్థుల్లో ఒకరు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సర్వేలో వెల్లడైంది. ప్రతి ముగ్గురు పీజీ విద్యార్థుల్లో ఒకరు ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నట్లు వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ఎంసీ (జాతీయ మెడికల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో నేషనల్ టాస్క్ ఫోర్స్ ఫర్ మెంటల్ హెల్త్, వెల్ బీయింగ్ దేశ వ్యాప్తంగా 25,590 మంది ఎంబీబీఎస్, 5,337 మంది పీజీ వైద్య విద్యార్థులు, 7,035 మంది ఫ్యాకల్టీని ఆన్‌లైన్ సర్వే చేయడం ద్వారా ఈ నివేదికను రూపొందించింది. 28 శాతం మంది ఎంబీబీఎస్, 15 శాతం మంది పీజీ విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. గత ఏడాది కాలంలో 16.2 శాతం మంది యూజీ, 31.2 శాతం మంది పీజీ విద్యార్థులు తమకు ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్టు తెలిపారు. 237 మంది పీజీ విద్యార్థులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొనడం నివ్వెరపరుస్తోంది. సర్వేలో పాల్గొన్న పీజీ విద్యార్థుల్లో 45 శాతం మంది తాము వారానికి 60 గంటలకు పైగానే పనిచేస్తున్నట్టు వెల్లడించారు. 56 శాతం మంది వారాంతపు సెలవు లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. 9.7 శాతం మంది యూజీ, 18 శాతం పీజీ విద్యార్థులు ర్యాగింగ్ గురవుతున్నామన్నారు.

ఎంఎన్‌సీ సూచనలివీ..

- రెసిడెంట్ డాక్టర్లకు వారానికి 74 గంటల కంటే ఎక్కువ పని గంటలు వద్దు. వారాంతపు సెలవు ఇవ్వాలి.
- వైద్య విద్యార్థులు మానసిక ఒత్తిడి, సమస్యలను అధిగమించేలా యోగా, క్రీడలు, ఇతర కార్యక్రమాలను కళాశాలలు నిర్వహించాలి.

సంస్కరణలు చేపట్టాలి..



ఎంబీబీఎస్‌తో సమానంగా పీజీ సీట్లు పెరుగుతున్నందున పీజీ వైద్యుల పని వేళలను కుదించాలి. 24 గంటల పాటు విధులు నిర్వహించిన జూడాలకు తప్పనిసరిగా సెలవు ఇవ్వాలి. ఆస్పత్రుల్లో వసతులు పెంచాలి.

– డాక్టర్ జయధీర్, అదనపు కార్యదర్శి, భారత ప్రభుత్వ వైద్యుల సంఘం

వసతులు పెంచాలి



ఆర్‌జీకార్ ఘటన అభద్రతా భావాన్ని కలిగిస్తోంది. ఆస్పత్రుల సిబ్బందిలో 60 నుంచి 70% మహిళలే ఉన్నా తగిన మౌలిక సదుపాయాలు లేవు. సీసీ కెమెరాలు పెంచాలి. సిబ్బందిపై చిన్న ఘటన జరిగినా వెంటనే గుర్తించే వ్యవస్థ ఉండాలి.

– డాక్టర్ జాగృతి, జూనియర్ డాక్టర్, సిద్ధార్థ వైద్య కళాశాల

దేశానికే దిశా నిర్దేశం

హైదరాబాద్‌లోని 'దిశ' ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి అసెంబ్లీలో 'దిశ' బిల్లు ప్రవేశపెట్టి దేశానికే దిశా నిర్దేశం చేసింది. నాడు సీఎంగా ఉన్న వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయానికి దేశమంతా ప్రశంసలు లభించాయి. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, వేధింపుల ఘటనల్లో కేసు దర్యాప్తు, విచారణ 21 రోజుల్లోపే పూర్తి చేసి దోషికి మరణ దండన విధించేలా బిల్లు రూపొందించారు. సత్వర విచారణ, శిక్షలు విధించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రత్యేక కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దిశ యాప్ ప్రత్యేకంగా తెచ్చి బాధితులు సమాచారం ఇచ్చిన పది నిముషాల్లోనే పోలీసులు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టారు.

ఇక ఊదండి బాకా..

- శ్రీసిటీలో నేడు 16 పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మళ్లీ ప్రారంభోత్సవం
- ఎనిమిది పరిశ్రమలకు మళ్లీ భూమి పూజ
- వీటన్నింటిలో గత వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఉత్పత్తి ప్రారంభం
- పారిశ్రామికవేత్తలపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఏర్పాట్లు
- పరిశ్రమలు క్యూ కట్టాయని చెప్పుకునేందుకు పాట్లు
- నేడు శ్రీసిటీలో సీఎం చంద్రబాబు పర్యటన

శ్రీసిటీ (వరదయ్యపాళెం): డప్పు కొట్టుకోవడంలో సీఎం చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని మరోమారు స్పష్టమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలకే రాష్ట్రంలో పరిశ్రమలు క్యూ కడుతున్నాయని ఎల్లో మీడియా ద్వారా గ్లోబల్ ప్రచారం చేసుకునేందుకు వ్యూహం రూపొందించారు. శ్రీసిటీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి.. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలు చేసిన పరిశ్రమలకే మళ్లీ ప్రారంభోత్సవాలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. అంతా సిద్ధమైపోయాక సీఎం పర్యటనను ఖరారు చేశారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు, ఎంఓయూలు మరోమారు చంద్రబాబు చేతుల మీదుగా చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 16 పరిశ్రమలకు నేడు ప్రారంభోత్సవాలు చేసేందుకు సీఎం చంద్రబాబు శ్రీసిటీ వస్తున్నారు. ఎల్జీ పాలిమార్స్, నైడెక్, ఈప్యాక్ డ్యురబుల్స్, న్యుయోలింక్ టెలి కమ్యూనికేషన్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్‌లెనిన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్, జేజీఎల్ మెటల్ కన్వర్టర్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ షైన్ మౌల్డర్స్, ఆటో డేటా, ఈఎస్ఎస్ కీ కాంపొనెంట్స్, అడ్వైర్ కేబుల్స్, బాంబై కోటెడ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమలు గత ప్రభుత్వంలో ఏర్పాటై ఉత్పత్తి కూడా ప్రారంభించాయి. ఇప్పుడు వీటినే సీఎం మరోమారు ప్రారంభించనున్నారు. రూ.1,570 కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని ప్రచారం చేసుకోనున్నారు. మరో రూ.900 కోట్లతో ఇంకో 8 పరిశ్రమలకు భూమి పూజ, ఐదు పరిశ్రమలతో ఎంవోయూ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత బియ్యపు మధుసూదన్‌రెడ్డి, బియ్యపు శ్రీవాణిరెడ్డిల కుమార్తె పవిత్రరెడ్డి వివాహం.. కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ప్రసూన రెడ్డిల కుమారుడు డాక్టర్ కౌశిక్‌రెడ్డితో ఆదివారం రాత్రి బెంగళూరులోని జేడబ్ల్యూ మ్యారియట్ హోటల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సతీమణి వైఎస్ భారతీరెడ్డి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. వివాహ రిసెప్షన్ ఈ నెల 21న నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. - సాక్షి, బెంగళూరు

నేటి నుంచి ఈవీఎంల పరిశీలన

ఈవీఎంల్లో అవకతవకలపై ఈసీకి ఫిర్యాదు చేసిన బాలినేని



ఒంగోలు అర్బన్: ఈవీఎంల్లో అవకతవకలపై ఈసీకి ఫిర్యాదు అందిన క్రమంలో 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు పరిశీలించాలని ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల్లో అవకతవకలపై ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం నుంచి ఆరురోజుల పాటు రోజుకు రెండు పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను పరిశీలించనున్నారు. డమ్మీ బ్యాలెట్‌ను ఏర్పాటు చేసి ఫిర్యాదుదారుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఈవీఎంలకు సంబంధించిన బెల్ కంపెనీ ఇంజనీర్ల సమక్షంలో ఈవీఎంల పరిశీలన జరగనుంది. ఈ ప్రక్రియను సీసీ కెమెరా నిఘాలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలోని 6, 26, 42, 59, 75, 76, 123, 184, 192, 199, 245, 256 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను పరిశీలించనున్నారు.

'ఉపాధి' పనుల గుర్తింపునకు 23న గ్రామసభలు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా గ్రామాల్లో కొత్త పనులను గుర్తించేందుకు ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించాలంటూ కలెక్టర్లు, డ్వామా పీడీలు, జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం .. ఏటా ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికి ఆరు నెలల ముందు(అక్టోబర్) నుంచి ఫిబ్రవరి వరకు గ్రామ పంచాయతీల పరిధిలోని పనుల గుర్తింపు, పనిదినాల నిర్ణయానికి సంబంధించి గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయి లేబర్ బడ్జెట్ ప్రక్రియ కొనసాగిస్తుంటారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి కూడా గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయి లేబర్ బడ్జెట్ రూపకల్పనతో గ్రామాల వారీగా పనుల గుర్తింపు, ఆ పనులకు గ్రామ సభల్లో ఆమోదం కూడా ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు కల్లా పూర్తయ్యింది. ఆ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు తెలియజేసి.. వాటికి అవసరమైన అన్ని అనుమతులను రాష్ట్ర అధికారులు తీసుకున్నారు. కానీ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం కొత్తగా మరికొన్ని పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పుడు మరోసారి కొత్త పనుల గుర్తింపు, వాటి ఆమోదం కోసం 23వ తేదీన గ్రామసభల నిర్వహణకు సిద్ధమైంది. దీనిపై సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సచివాలయం నుంచి కలెక్టర్లు, జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

కౌలుకార్డుల జారీలో సవాలక్ష కొర్రీలు

సాక్షి, అమరావతి: పంట సాగు హక్కుదారుల పత్రాలు (సీసీఆర్సీ) పూర్తి స్థాయిలో అందక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య ఆదివారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత పంటల బీమా వంటి సంక్షేమ ఫలాలు పొందాలంటే కౌలుకార్డులే ప్రామాణికమని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయశాఖలు సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించి అర్హులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. కార్డుల జారీలో గతం కంటే నేడు అనేక ఆటంకాలు కలిగిస్తున్నారని చెప్పారు. కార్డులు ఉన్నా లేకపోయినా కౌలు రైతుల పంటలను ఈ–పంటలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఓఎండీసీ గనులు

- పబ్లిక్ హియరింగ్‌లో అనుమతి త్వరలో ఇనుప ఖనిజం లభించే అవకాశం

ఉక్కునగరం: ఇనుప ఖనిజం కొరతతో సతమతమవుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎట్టకేలకు ఒడిశాలోని ఒడిశా మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఓఎండీసి) గనులకు సంబంధించి పబ్లిక్ హియరింగ్‌లో ఆమోదం లభించింది. ఒడిశాలోని కియోంజర్ జిల్లాలోని బెల్కుండిలో ఇనుము, బార్బిల్‌లో మాంగనీస్ గనులు ఓఎండీసీ ఆధ్వర్యంలో ఉన్నాయి. 1,276 హెక్టార్లలో ఈస్టర్న్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ (ఈఐఎల్)కు 51 శాతం వాటా ఉంది. ఈఐఎల్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ 51 శాతం వాటా కలిగి ఉంది. తద్వారా ఓఎండీసీలో స్టీల్‌ప్లాంట్ గరిష్ఠంగా 26 శాతం వాటా కలిగి ఉంది. ఈ గనులు ఏడాదికి 1.8 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి. 2012లో సామర్థ్యానికి మించిన ఉత్పత్తి కారణంగా సుప్రీంకోర్టు రూ.700 కోట్లు జరిమానా విధించింది. దీంతో ఒడిశా ప్రభుత్వం లీజును కొనసాగించడానికి నిరాకరించింది. ఆ జరిమానాను ఓఎండీసీ చెల్లించింది. అప్పట్నుంచి లీజును కొనసాగించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు అక్కడి ప్రభుత్వం, ప్రజలను ఒప్పించడంతో పబ్లిక్ హియరింగ్‌కు ఆమోదం లభించింది. ఈ ప్రక్రియతో రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు మంత్రిత్వశాఖకు తెలియజేస్తుంది. ఆపై అటవీ, పర్యావరణ అనుమతులను కోరనున్నారు. ఆ ప్రక్రియ సుమారు తొమ్మిది నెలలు పట్టవచ్చని అధికార వర్గాల సమాచారం. ఈ గనులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మంచి ఆస్తి అవుతాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సందర్భంగా ఉక్కు అధికారుల సంఘం అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. పబ్లిక్ హియరింగ్‌కు కృషి చేసిన ఓఎండీసీ, స్టీల్‌ప్లాంట్ అధికారులకు వారు అభినందనలు తెలియజేశారు.

ఎరువులు చల్లుతుండగా అస్వస్థత

తల్లాడ: ఓ రైతు పొలంలో రసాయనిక ఎరువులు చల్లుతూ తొమ్మిది మంది కూలీలు అస్వస్థతులయ్యారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నూతనకల్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. నూతనకల్‌కు చెందిన కూలీలు అన్నారుగూడెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వరి పొలంలో మందు చల్లేందుకు వెళ్లారు. గుళికలు, డీఏపీ, యూరియా కలిపి చల్లుతుండగా కొన్ని గంటల్లోనే అస్వస్థులయ్యారు. కూలీలు కాంపాటి పాపారావు, కిన్నెర కృష్ణ, కర్లకంటి శ్రీను, కొమ్మనబోయిన భద్రయ్య, పెద్ద బోయిన పవన్ కల్యాణ్, తేళ్లపుట్ల లక్ష్మన్, పమ్మి గోపాలకృష్ణ, గడగొట్టి భద్రాజీ, కె.వేణుగోపాల్‌కు ఒక్కసారిగా వాంతులు, కళ్లు తిరగడం, మెడ, ఒళ్లు నొప్పులతో అస్వస్థులయ్యారు. వెంటనే 108 వాహనంలో కొందరిని, ఆటోలో మరికొందరిని కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలియగానే సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి వైద్యులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు రమేశ్, శ్రీ విద్య, శ్రీ జన్య, గోపి తెలిపారు.

కొడవళ్ల ఊరు.. పేటేరు

- కొడవళ్లకు ప్రసిద్ధి పేటేరు శ్రామిక కాలనీ
- తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాలకు ఎగుమతి
- వ్యవసాయ సీజన్‌లో పేటేరు వైపు రైతుల అడుగులు
- మూడుతరాలుగా వృత్తిలో కొనసాగుతున్న పలు కుటుంబాలు
- పెరుగుతున్న ముడి సరుకు ధరలతో గిట్టుబాటు కాని శ్రమ
- వరికోత యంత్రాలతో తగ్గిన గిరాకీ



రేపల్లె రూరల్: కణకణలాడే అగ్ని కీలల నుంచి ఎగసిపడే అగ్ని రవ్వలు.. లయబద్ధమైన సుత్తుల సవ్వడులు... బలంగా పిడికెళ్లు బిగించి మలాటులతో కార్మికులు తన శక్తిని ఉపయోగించే ధ్వనులు అక్కడ సర్వ సాధారణం. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో కర్షకుడికి ఉపయోగపడే సాధనమైన కొడవలి తయారీలో రాత్రింబగళ్లు శ్రమిస్తుంటుంది పేటేరు గ్రామం.

పేటేరు వైపే అడుగులు..

వ్యవసాయ సీజన్ ప్రారంభమైందంటే బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని పేటేరు గ్రామంవైపు రైతుల అడుగులు పడతాయి. వ్యవసాయ రంగంలో కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీలో పేటేరు గ్రామంలోని శ్రామికనగర్ ప్రధాన భూమిక పోషిస్తోంది. వరి, మినుము కోతలకు అవసరమైన కొడవళ్ల తయారీలో పేటేరు గ్రామానికి రాష్ట్రంలోనే మంచి పేరు ఉంది. ఈ గ్రామం కొడవళ్ల తయారీలో ప్రధానపాత్ర పోషిస్తోంది. పేటేరులో సుమారు 70 ఏళ్ల క్రితం కొడవళ్ల తయారు ప్రారంభమై దినదినాభివృద్ధి చెందుతూ నేడు మూడవ తరం కార్మికులు వీటి తయారీలో నిమగ్నమయ్యారు. గ్రామంలో కొడవళ్ల తయారీ చేయడంలో నైపుణ్యత సాధించిన కార్మికులు నివసించే ప్రాంతం శ్రామికనగర్‌గా గుర్తింపు పొందింది. పేటేరు గ్రామంలో 30కి పైగా కార్ఖాణాలు(కొలిమి)లలో సుమారు 150 మంది కిపైగా కార్మికులు పని చేస్తున్నారు.

కొలిమిలో కాలి పదునైన కొడవలిగా మారి..

ముడి ఇనుపబద్దలను కొలిమిలో కాల్చి కొడవలి ఆకృతిగా మలచిన అనంతరం దానికి సానపట్టి నొక్కులు కొట్టి చెక్కపిడులను అమర్చే ప్రక్రియలో శ్రామికులు నిరంతరం శ్రమిస్తుంటారు. ఒక్కో కొలిమిలో రోజుకు సుమారుగా 200 వరకు కొడవళ్లు తయారు చేస్తుంటారు. కొడవళ్లు మూడు రకాల ధరల్లో తయారవుతుంటాయి. రూ.40, రూ.60, రూ.80, 120ల ధరల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ తయారు చేస్తారు. ప్రతి నెల గ్రామంలో లక్షకుపైగా కొడవళ్ల తయారీ జరుగుతుంది.

కొత యంత్రాల రాకతో తగ్గిన గిరాకీ..

నూతన సాంకేతిక రంగంలో విప్లవాత్మకంగా వస్తున్న మార్పులతో రైతులకు అందుబాటులోకి వస్తున్న యంత్రాలు కొంత మేర కొడవళ్ల తయారీపై ప్రభావం చూపింది. గతంలో పోల్చితే కొడవళ్ల తయారీకి కొంతమేర డిమాండ్ తగ్గిందని కార్మికులు చెబుతున్నారు. తమ కార్ఖానాలలో సంవత్సరం మొత్తం కొడవళ్లు తయారు చేస్తున్నా వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నాలుగు నెలలు పని ఒత్తిడి అధికంగా ఉంటుదని పేర్కొంటున్నారు.

చెన్నై, వైజాగ్‌ల నుంచి ముడిసరుకు దిగుమతి..

కొడవళ్ల తయారీకి ఉపయోగించే బేల్ బద్దలను చెన్నై, విశాఖపట్నం, కాకినాడ పోర్టుల నుంచే కాకుండా విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కిలోల లెక్కన కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటారు. ఏటికేడు ముడి సరుకు ధరలు పెరుగుతున్నా కొడవళ్ల ధరలు పెరగకపోవటంతో శ్రమ వృథా అవుతోందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. బేల్‌బద్దల లోడు గత ఏడాది రూ.58వేల నుంచి రూ.60వేలు ఉండగా ఈ సంవత్సరం రూ.65వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బొగ్గులు, చెక్క, ముడిసరుకులతో పాటు రవాణా చార్జీలు రోజురోజుకు పెరుగుతున్నా వాటి భారం కొడవలి ధరపై మోపకపోవడం గమనార్హం.

కొడవలిపై 'పిడి'గుపాడు


జైపూర్ నుంచి దిగుమతి చేసుకున్న పిడులు

కొడవళ్ల తయారైన తరువాత వీటికి అమర్చేందుకు చెక్కతో చేసిన పిడులు ఉపయోగించటం తప్పనిసరి. అయితే గ్రామంలోనే గతంలో పిడులు తయారు చేసేందుకు ప్రత్యేకంగా కొంతమంది కార్మికులు ఉండేవారు. వేరే ఉపాధి అవకాశాలు రావటంతో కొంతమంది.. శ్రమకు తగిన ఫలితం రాకపోవటంతో మరి కొంతమంది ఈ వృత్తికి దూరంగా ఉండటంతో పిడులు తయారు చేసేవారు గ్రామంలో కనుమరుగయ్యారు. దీంతో పిడులను ప్రస్తుతం జైపూర్ నుంచి అధిక ధరలు వెచ్చించి తెప్పించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం..



వందల మంది కార్మికులు కొడవళ్ల తయారీలో నిరంతరం శ్రమిస్తుంటారు. కత్తుల తయారీలో నాణ్యమైన ముడి ఇనుమును ఉపయోగించటంతో పాటు ప్రమాణాలను పాటిస్తూ కొడవళ్ల తయారీ జరుగుతుంది. దీంతో రైతులకు అందించే కొడవలి నాణ్యంగా ఉండటంతో ఎక్కువ కాలం ఉపయోగపడతాయి. దీంతో పేటేరు కొడవళ్లకు మంచి పేరు ఉంది.

– నలకుర్తి సుబ్బారావు, పేటేరు

సబ్సిడీ రుణాలు అందించాలి..



గతంతో పోలిస్తే ప్రస్తుతం పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. నాటి ముడి సరుకుల ధరలకు నేటి ముడి సరుకుల ధరలకు ఎంతో వ్యత్యాసం ఉంది. మేము చేసే కొడవళ్లకు గిరాకీ ఉన్నా ధరలు పలకటంలేదు. ప్రభుత్వం మాపై దృష్టిసారించి కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– చందోలు ధనుంజయరావు, పేటేరు

ఊరికి కీడొచ్చిందని..

మంగళపల్లి గ్రామస్తుల వన భోజనాలు

నకిరేకల్: ఊరికి కీడొచ్చిందని నల్లగొండ జిల్లా మంగళపల్లి వాసులు ఆదివారం ఇళ్లముందు కల్లాపి చల్లకుండానే వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలో గత నెలలో విషజ్వరాలు ప్రబలి పలువురు అస్వస్థతకు గురవడం తెలిసిందే. దీంతో ఊరికి కీడొచ్చిందని.. గ్రామస్తులంతా వనభోజనాలకు వెళ్లాలని స్థానిక వాట్సప్ గ్రూపుల్లో కోరారు. ఈ మేరకు 70శాతం మంది గ్రామస్తులు ఇళ్లముందు ఊడవకుండా, కల్లాపి చల్లకుండా తమ వ్యవసాయ బావులు, తోటల్లోకి వన భోజనాలకు వెళ్లారు. అక్కడే వండుకుతిని.. సాయంత్రానికి ఇంటిబాట పట్టారు.



నేను మూర్ఖుడిని అని తెలుసుకునేంత తెలివి నాకు ఉంది.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 19 ఆగస్టు 2024

దేవుణ్ణి చూసిన వాడు

'వానలో కలిసిన చీకటి ఆకాశం నుంచి నల్లటి విషంలా కారుతోంది' అని మొదలవుతుంది తిలక్ 'దేవుణ్ణి చూసిన వాడు' కథ. ఆ రాత్రి వానలో ఉలిక్కిపడి లేచిన గవరయ్యకు పెరటి వసారాలో ఏదో మూలుగు. ఏమిటది? లాంతరు తీసుకుని బయటకి వచ్చాడు. హోరుగాలి... భీకర వర్షం... మూలుగుతూ పడి ఉన్న ప్రాణి. లాంతరు ఎత్తి చూసి దిమ్మెరపోయాడు. భార్య. తనను వదిలిపెట్టి వెళ్లిన భార్య. 'గవరయ్య భార్య లేచిపోయిందట' అని ఊరంతా గేలి చేయడానికి కారణమైన స్త్రీ. మోసపోయి, నిండు గర్భంతో, నొప్పులు పడుతూ, మొహం చెల్లక వసారాలో పడి ఉంది. దూరంగా మెరుపు మెరిసింది. చెవులు చిల్లులుపడేలా పిడుగు. కాన్పు జరిగిపోయింది. కేర్‌మని– చేతుల్లోకి తీసుకోగానే సముదాయింపు పొందిన ఆ పసికూన గవరయ్యతో బంధమేసింది. క్షణం ఆలోచించలేదు అతడు. ఆమెను, ఆమె కన్న తనది కాని బిడ్డను లోపలికి తీసుకెళ్లాడు. మరుసటి రోజు ఊరిపెద్దలు 'లేచిపోయిందాన్ని ఏలుకుంటావా' అని వస్తే గవరయ్య ఏం చేశాడు? కత్తి పట్టుకు వచ్చి 'అడ్డు పడినవాళ్లను అడ్డంగా నరుకుతాను' అన్నాడు. అతడు మనిషి. దేవుడు. మానవత్వంలో దేవుడిని చూసినవాడు.

మధురాంతకం రాజారాం 'కొండారెడ్డి కూతురు' అనే కథ రాశారు. ఫ్యాక్షనిస్టు కొండారెడ్డి కూతురు ప్రేమ వివాహం చేసుకుంది. పారిపోయి బతుకుతోంది. చాన్నాళ్ల తర్వాత ఊరి మనుషులు చూడటానికి వచ్చారు. తన మనుషులు. తన తండ్రి దగ్గర పని చేసే మనుషులు. కొండారెడ్డి కూతురు ఎంతో సంతోషపడింది. మర్యాదలు చేసింది. వారి చేసంచుల్లో చాటుగా ఉన్న ఆయుధాలు చూసి అంతలోనే నిశ్చేష్టురాలైంది. తనను, భర్తను చంపుతారన్నమాట. తండ్రి పంపించాడన్న మాట. కాని ఇంటికి వచ్చిన అతిథులను అవమానించవచ్చా? వారి కోసం ఏమిటేమిటో వండింది. కొసరి కొసరి వడ్డించింది. ఊరి ముచ్చట్లు అడిగి చెప్పించుకుంది. ఆ రాత్రి తనకు ఆఖరు రాత్రి. హాలులో కుర్చీ వేసుకుని భర్త గదికి కాపలా కూర్చుంది. వాళ్లు వస్తారు. తనని చంపుతారు. కొండారెడ్డికి పుట్టినందుకు తాను చస్తుంది. కాని భర్తను చంపడానికి వీల్లేదంటుంది. వాళ్లు వచ్చారు. నీడల్లా నిలబడ్డారు. చంపుతారనుకుంటే కాళ్ల మీద పడ్డారు. 'అమ్మా మేమెందుకొచ్చామో తెలిసీ అన్నం పెట్టావు. చెడ్డ పనులు చేసే రోజు మీ అమ్మ ముఖం చూడకుండా తప్పుకునేవాళ్లం. చూస్తే చేయలేమని. ఇవాళ నీ ముఖం చూస్తూ నిన్నెలా చంపుతామమ్మా'... ఏడుస్తూ కాళ్లు కడుగుతున్నారు. ఆమె మనిషే. దేవత కాకపోవచ్చు. కాని మానవీయత ఉన్న మనిషి వదనంలో దైవత్వం ఉంటుంది.

'మనందరం దేవుళ్లమే' అంటాడు 'సత్యమే శివం'లో కమలహాసన్. 'సృష్టి విలయం రెండూ మన చేతుల్లోనే' అంటాడు 'సెపియెన్స్' పుస్తక రచయిత హరారి. 'నేటి మనిషి రెండు విషయాల వల్ల మనిషి గుణాన్ని కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు. ఒకటి ప్రకృతి విధ్వంసం– రెండు సాంకేతికతను పెంచి తాను మరుగుజ్జుగా మారడం' అంటాడు హరారి. ప్రకృతికి ఎడంగా జరిగే కొద్ది, పరిసరాల్లో సిమెంటు పెరిగే కొద్ది, నాలుగు గోడల నుంచి నాలుగు గోడలకు అతని దినచర్య మారేకొద్ది సహజమైన మానవ స్పందనలు మొద్దుబారక తప్పదు. పెట్ డాగ్స్ సమక్షంలో అతడు పొందగలుగుతున్నది కొద్దిగా ఓదార్పే. పల్లెలో ప్రకృతిలో ఉన్నప్పుడు గొడ్డూ గోదా, మేకా ఉడుతా, కాకీ పిచుకా అన్నీ అతని స్పందనలను సజీవంగా ఉంచేవి. 'ఎలా ఉన్నావు?' నుంచి 'ఎంత సంపాదిస్తున్నావు?'ను దాటి 'ఏం కొన్నావు?'కు వచ్చేసరికి అతనిలో మొదలైంది పతనం.

'లాభం' అనే మాట కనిపించని దారాలతో ఆడించే మాయావి. మనిషిని ఎంత ఓడిస్తే లాభం అంత గెలుస్తుంది. అంతేకాదు 'మనిషి మీద నమ్మకం పోయింది' అనే మాటను పుట్టించడం లాభాపేక్ష గల పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రాథమిక అవసరం. మనిషి మీద నమ్మకం పోయేలా... వాణ్ణి అది వస్తుగత, స్వార్థపరమైన, సంపద లాలసలో కూరుకుపోయేలా చేస్తుంది. లాభపడాలంటే, సుఖపడాలంటే చేయవలసింది మానవత్వాన్ని త్యాగం చేయడమే. అది పోగానే వాడు కుటుంబంతో, స్నేహితులతో, సమాజంతో, ప్రకృతితో, మానవాళితో ఎంత దారుణంగా అయినా వ్యవహరించవచ్చు. 'మనిషి మీద నమ్మకం పోయేలా' చేస్తే పెట్టుబడిదారీ వ్యవస్థకు మరో లాభం ఏమిటంటే... ఏ మనిషీ మరో మనిషితో కలవడు. సమూహంగా మారడు. తిరుగుబాటు చేయడు. నలుగురు బాగుపడి కోట్ల మంది మలమలమాడే వ్యవస్థకు ఢోకా రానివ్వడు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ 'యుద్ధం' అనే ముద్దుబిడ్డను పదేపదే కంటూ ఉంటుంది. యుద్ధం మానవత్వానికి అతి పెద్ద విరుగుడు.

అయితే మనిషి ఇలాగే ఉంటాడా? ఏ రచయితో అన్నట్టు 'రగిలిస్తే రాజుకునే మహాఅగ్ని మానవత్వం'. కోల్‌కతా నిరసనల్లో ఇవాళ అదే చూస్తున్నాం. యుగాలుగా... చితి పెట్టిన ప్రతిసారీ బూడిద నుంచి మానవత్వం తిరిగి జనిస్తూనే ఉంది. కాకుంటే అందుకు కావల్సిన రెక్కలు సాహిత్యమే ఇస్తుందని గ్రహించాలి. తల్లిదండ్రులూ..! మీ పిల్లల్ని ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు తప్పకుండా చేయండి. కాని నాలుగు మంచి పుస్తకాలు చదివించి మొదట మనిషిని చేయండి. ఏ విటమిన్ లేమికి ఏం తినాలి సరే... మానవత్వ లేమి ఉందేమో కనిపెట్టి విరుగుడుగా ఒక పుస్తకం చేతిలో పెట్టండి. ఎక్కడ పుస్తకాలు ఉంటాయో అక్కడ మానవత్వపు ఆవరణం ఏర్పడుతుంది. అదే దేవుడు తిరుగాడే తావు. ప్రపంచ మానవత్వ దినోత్సవ శుభాకాంక్షలు.

విభజన రేఖను చెరిపిన విజేతలు

కామెంట్



కరణ్ థాపర్

దేశ విభజనానంతరం ఎన్నో పరిణామాలు సంభవించాయి. గత నలభై ఏళ్లలో – విభజనకు ముందు తరం రాలిపోయింది. రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయి. బాలీవుడ్ సినిమాలు మునుపటిలా లేవు. అయినప్పటికీ భారత్, పాక్ మనుషులు ఒకేలా ఉన్నారు. ఒకే ఆహారం తీసుకుంటున్నారు. ఒకే ఒక చోట వేరుపడింది ఎక్కడంటే మతంలో! బ్రిటిష్ వాళ్లు గీసిన మ్యాపులో! దాన్ని దాటగలిగేందుకు 'పంజాబీయత'కు తగినంత బలమే ఉంది. ఆ బలమే... నీరజ్–అర్షద్ ఒకరితో ఒకరు చక్కగా కలిసిపోవటానికి కారణం అయింది. వారి క్రీడ మాత్రమే కాదు, వారి సంస్కృతి కూడా ఆ దగ్గరితనాన్ని నిర్ణయించింది. బరిలో ప్రత్యర్థులైనా పరస్పరం సానుకూలంగా మాట్లాడటం, బాంధవ్యాన్ని పంచుకోవటం అసహజత్వానికి దూరంగా ఉన్నాయి.

పంజాబీలు పాకిస్తాన్‌ను ఎలా చూస్తారనే దాని గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అది దేశంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా ఉంటుంది. నిజానికి, బెంగాలీలు బంగ్లాదేశ్‌ను ఎలా చూస్తారనే దానిని అందుకు చాలా దగ్గరి సమాంతరంగా నేను ఊహించుకుంటాను. రెండు రాష్ట్రాలు కూడా విభజన వల్ల తమ దేశాలతో వేరైపోయినప్పటికీ, కోల్పోయిన తమ రెండో సగంతో ఉన్న ఆత్మీయతలు, ఆనాటి అమ్మ ఒడి జ్ఞాపకాలు కొడిగట్టిపోలేదు. కాకపోతే అవి తరాల నుండి తరాలకు సంక్రమిస్తున్నట్లుగా ఉంది.

బహుశా అందుకే నీరజ్ చోప్రా–అర్షద్ నదీమ్‌ల కథ దేశంలోని ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత గల వార్త అయితే, పంజాబీలకు అది – ఇందులో వింతేముందన్నంతగా – ఒక మామూలు సంగతి అయింది. నేను మరికాస్త ముందుకు వెళ్లబోయే ముందు, హరియాణా 1966 వరకు కూడా కొన్ని శతాబ్దాలపాటు అవిభక్త పంజాబ్‌లో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్న సంగతిని మీకు గుర్తు చేయనివ్వండి. లాహోర్, లూథియానా మాదిరిగానే అంబాలా, రోహ్‌తక్ పంజాబీ ప్రాంతాలు.

కాబట్టి, నీరజ్–అర్షద్ ఒకరితో ఒకరు చక్కగా కలిసిపోవటంలో ఆశ్చర్యం లేదు. వారి క్రీడ మాత్రమే కాదు, వారి సంస్కృతి కూడా ఆ దగ్గరితనాన్ని నిర్ణయించింది. ఒకరితో ఒకరికి తమ గ్రెనడా, ఐరోపా, అమెరికా సహ–అథ్లెట్‌ల కంటే ఎక్కువగా ఉమ్మడితనం ఉంది. ఆలింగనం, నవ్వు, ఒకరి గురించి ఒకరు సానుకూలంగా మాట్లాడటం, ఒక బాంధవ్యాన్ని పంచుకోవటం ఇద్దరి మధ్య ఎంతో స్పష్టంగా, అసహజత్వానికి దూరంగా ఉన్నాయి. ఇలా కాకపోతేనే ఆశ్చర్యం.

వారి తల్లుల విషయంలో కూడా ఇది వాస్తవం. వారు తమ కొడుకుతో తలపడిన వారిని ప్రత్యర్థిగా చూడకపోవటానికి కారణం వారు తమ 'పంజాబీయత'ను అనుభూతి చెందటమే. నిస్సందేహంగా ఇది, వారు మాట్లాడే విధానంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న సారూప్యాన్ని వివరిస్తోంది. ''నేను నీరజ్ కోసం కూడా ప్రార్థిస్తున్నాను'' అని అర్షద్ తల్లి రజియా పర్వీన్ చెప్పారు. అదే విధంగా నీరజ్ తల్లి సరోజ్ దేవి కూడా ''అతను కూడా నా కుమారుడి లాంటి వాడే'' అని చెప్పారు. ''బంగారం గెలుచుకున్న అబ్బాయీ మా బిడ్డే, వెండి గెలుచుకున్న అబ్బాయీ మా బిడ్డే'' అని ఆమె అన్నారు.



ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న భారత్–పాక్ అథ్లెట్లు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్

నేనంటున్న పంజాబీ బాంధవ్యం అనే దాని గురించి మొదట నాకు 1980లో తెలిసింది. నేనప్పుడు లాహోర్‌లో ఉన్నాను. దేశ సరిహద్దుల ఆవలి ఆ తొలి పర్యటనలో నేను అటువైపు చేరుకునే వరకు కూడా పాకిస్తాన్‌ను నేను ఒక పరాయి దేశంగానే చూశాను. నిజంగా పరాయి దేశమే. కానీ అక్కడి ప్రజలైతే కచ్చితంగా పరాయి వారు కాదు. అలాగే వారికి నేను అపరిచితుడినీ కాదు, గ్రహాంతరవాసినీ కాదు.

ఒక సాయంత్రం నేను పాత 'వాప్డా'(వాటర్ అండ్ పవర్ డెవలప్‌మెంట్ అథారిటీ, పాకిస్తాన్) భవనంలోని సల్లూస్ రెస్టారెంట్‌లో కూర్చున్నాక, ఆ రెస్టారెంట్‌లో నేను తప్ప మరొకరు లేకపోవటం గమనించాను. ఒంటరిగానే డిన్నర్ చేసి, త్వరగా బయటికి వెళ్లిపోవటానికి సిద్ధం అయ్యాను. ఎంత పొరపాటు! నేను ఇండియా నుంచి వచ్చిన పంజాబీనని కనిపెట్టిన కొద్ది నిమిషాలకే రెస్టారెంట్ సిబ్బంది నా దగ్గరికి నడుచుకుంటూ వచ్చి మీతో మాట్లాడవచ్చా అని అడిగారు. నేను అంగీకరించగానే నాతో కలిసి కూర్చున్నారు. ఎంపిక చేసిన ఆహారాన్ని నా కోసం తెప్పించారు. లాహోర్‌లో నేను తప్పక చూడవలసిన ప్రదేశాలు ఏమిటో చెప్పారు. వెచ్చగా ఉన్న రోటీలను బలవంతంగా పక్కన పెట్టించి, తాజాగా చేయించిన పొగలు కక్కే రోటీలను నా ప్లేటులో ఒక దాని పైన ఒకటిగా వెడ్డింగ్ కేక్‌ను తలపించేలా ఇంత ఎత్తున సర్వ్ చేయిస్తూనే ఉన్నారు.

అయితే నేను ఎప్పటికీ మరచిపోలేనివి మాత్రం వారు నన్ను అడిగిన ప్రశ్నలు. ''మీరెప్పుడైనా జలంధర్‌లోని గల్లీ నంబర్ టెన్‌కి వెళ్లారా? అది మా తల్లితండ్రులు నివసించిన ప్రదేశం'' అని ఒక ప్రశ్న. ''మీరెప్పుడైనా అమితాబ్ బచ్చన్‌ని, రేఖను కలిశారా? నేను వారిని కలవటానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాను'' అని ఇంకో ప్రశ్న. ''ఇందిరా గాంధీ గురించి చెప్పండి. ఆమె గురించి ప్రతిదీ తెలుసుకోవాలని ఉంది నాకు'' అని అత్యంత ఆశ్చర్యకరమైన మరొక ప్రశ్న.

తమ తల్లితండ్రులు జీవితాన్ని గడిపిన ప్రదేశం గురించి ఆ ప్రదేశం తమది కూడా అన్నంత ఉద్విగ్నంగా, ఉత్సాహంగా వారు ఉన్నారు. భారతదేశం అన్నది వారికి వేరే దేశం అయుండొచ్చు కానీ, వారి తల్లితండ్రులు జన్మించిన ప్రదేశం ఇప్పటికీ తమ 'ఇల్లే'. అందువల్ల నేను వారు కోల్పోయిన దేశం నుంచి వెళ్లిన వ్యక్తినే అయినప్పటికీ, వారు మర్చిపోలేని వ్యక్తిని. 'సల్లూస్' ద్వారా వారు కనుగొన్న ఒక బాంధవ్య అనుసంధానాన్ని నేను.

ఇప్పుడు, 1980 అంటే... నలభై సంవత్సరాలకు పైమాటే. నాటి నుంచి ఎన్నో పరిణామాలు సంభవించాయి. దేశ విభజనకు ముందు తరం రాలిపోయింది. రాజకీయాల్లో మార్పులు వచ్చాయి. అవి మనల్ని ఆకర్షించటం లేదు. బాలీవుడ్ సినిమాలు మునుపటిలా లేవు. అయినప్పటికీ మనం ఒకేలా ఉన్నాం. ఒకే భాష మాట్లాడుతున్నాం. ఒకే ఆహారం తీసుకుంటున్నాం. ఆఖరికి ఒకేలా శాపగ్రస్తులమై ఉన్నాం. ఒకే ఒక చోట వేరుపడింది ఎక్కడంటే మతంలో, బ్రిటిష్ వాళ్లు గీసిన మ్యాపులో! దాన్ని దాటగలిగేందుకు పంజాబీయతకు తగినంత బలమే ఉంది.

నీరజ్–అర్షద్‌లు ఒకరికొకరు దగ్గరయ్యేలా చేసింది ఇదే. విదేశాలలో భారతీయులు, పాకిస్తానీలు ఒకరికొకరు – వాళ్లు పంజాబీలు అయినా కాకున్నా – కలివిడిగా ఉండేందుకు కూడా కారణం ఇదే. వారు ఒకరి సమక్షంలో ఒకరు సౌకర్యవంతంగా ఉంటారు. తమ గురించి తాము వివరించాల్సిన అవసరం వారికి లేదు. తమను అర్థం చేసుకుంటారని వారికి తెలుసు. ఉమ్మడి సంస్కృతి విభజన రాజకీయాల కంటే కూడా శక్తిమంతమైనది. ఇది మన రాజకీయ నాయకులకు అర్థమైతే బాగుండు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అసలైన భావన



సామ్యవాద భావనను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకున్నారు. దాని అర్థం ఒక సైకో నడిపే పొలిట్‌బ్యూరో ఏదో మనల్ని తొక్కుకుంటూ వెళ్లగలదని కాదు. కొన్ని అందరికీ చెందుతాయని మనం అంగీకరిస్తున్నామని అర్థం. మనం ఒకరిని ఒకరం ప్రేమించుకున్నా, ప్రేమించుకోకపోయినా ఒకరికి న్యాయం జరగడాన్ని నిరాకరించం.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

హంతకులెవరు?



బంగ్లాదేశ్‌లో జరిగిన భారీ విద్యార్థుల నిరసనోద్యమంలో వందల మంది విద్యార్థులు పోలీసుల చేతిలో చనిపోలేదు. ఎందుకంటే విద్యార్థుల శరీరాల్లో కన్పించిన బుల్లెట్లు 7.62 కాలిబర్ రైఫిల్స్ నుంచి కాల్చినవి. ఆ నిషేధిత రైఫిల్స్‌ను ఆర్మీ గానీ, పోలీసులు గానీ వాడటం లేదు. అంటే విద్యార్థులను పోరులే చంపారని ఇది రుజువు చేస్తోంది. ఎవరు వారు? జిహాదీలు?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

యథా రాజా...



యావత్తు పోలీస్ వ్యవస్థ ఒక దారుణమైన నవ్వులాటగా మారిపోయింది; ఎందుకంటే బెంగాల్‌లోని మతిభ్రష్ట ప్రభుత్వ పాలనలో వాళ్లు పనిచేస్తున్నారు కాబట్టి. దారుణం!

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

రహస్యం



జీవిత పాఠం: సంతోషంగా ఉండటానికి రహస్యం... స్వేచ్ఛ! ఆ స్వేచ్ఛను పొందే రహస్యం... ధైర్యం.

– అసీమ్ మల్హోత్రా, కార్డియాలజిస్ట్

అమ్మ దీవెన



నేను ఒక 35 ఏళ్ల మహిళను, ఇద్దరు పిల్లలకు తల్లిని. ప్రొఫెసర్‌గా పనిచేస్తాను. అయినా ఇప్పటికీ మా అమ్మే నా లంచ్ ప్యాక్ చేస్తుంటుంది. ఇలాంటి దీవెనలు ఉండాలంటే, ఎంత అదృష్టం ఉండాలి! అమ్మకు ఎప్పటికీ కృతజ్ఞురాలిని.

– అంబికా భాగీ దామోదరన్, కెమిస్ట్

దద్దరిల్లే రుచి



'అచార్' (ఊరగాయ, తొక్కు) అనేది 'పికిల్' కాదు. ఇంగ్లిష్‌లో ఊరగాయ అనేదానికి సరిపోయే మాట లేదు. అచార్ అంటే మహా గొప్పగా పరిమళాలతో కూడిన రుచులు దద్దరిల్లడం; పికిల్ అంటే వినిగర్‌లో నీరసపు దోసకాయ మునిగిపోవడం. రెండూ ఒకటి కాదు.

– నవీన్ కాబరా, ఆంట్రప్రెన్యూర్

మాట్లాడొద్దా?



మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న ఘోరాల పట్ల మౌనంగా ఉండటం అంటే, మన చేతులకు రక్తం అంటించుకోవడంతో సమానమే. ఇంత దారుణమైన అన్యాయం పట్ల మౌనంగా ఎలా ఉండగలం?

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ ఆంట్రప్రెన్యూర్

గతాన్ని కళ్ల ముందుంచే జ్ఞాపకం!

అభిప్రాయం



డా॥ తారకేశ్వరరావు ఇప్పిలి

గత స్మృతులను జ్ఞాపకంగా నిలిపే ఒక అద్భుతమైన కానుక ఫోటో.

వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫోటో చెబుతుంది. మాటల్లో చెప్పలేని ఎన్నో ఉద్వేగాల్నీ ఒక్క చిత్రంలో వర్ణించవచ్చు. ఫోటోలు కేవలం సంఘటనల్ని మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న కథలను కూడా చెబుతాయి.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని 1910 ఆగస్టు 19న మొదటిసారి జరిపారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ 1991 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 19న ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరపడం ప్రారంభించింది. భారతదేశంలో 1840లోనే ఫోటోగ్రఫీ ఆనవాళ్లు ఉన్నాయి. మొట్టమొదటి కేలోటైప్ ఫోటో స్టూడియో కోల్‌కతాలో స్థాపించారు. మొదట్లో దీనిని బ్రిటిష్ రాజు, జమీందార్లు, సిపాయిలు మాత్రమే ఉపయోగించారు. ఆ తరువాత 1877 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. మొట్టమొదటి కలర్ ఫోటో 1861లో తీశారు. భారత్‌లో మొట్టమొదటిగా లాలా దీన్‌దయాళ్ ఈ రంగంలో విశేష కృషి చేశారు.



ఈ రోజుల్లో 4కె వీడియోలు సర్వసాధారణమైనా, ఫోటోగ్రఫీకి ఉండే క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే... ఫోటోగ్రఫీ ఒక ఆర్ట్. అద్భుతమైన ఫోటోలు తీయడం ఒక కళ. ప్రపంచవ్యాప్తంగా అరుదైన, అద్భుతమైన ఫోటోలు తీసే క్రియేటివ్ ఫోటోగ్రాఫర్లు, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్లు ఉన్నారు. అందుకే వరల్డ్ ఫోటోగ్రఫీ డేకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఫోటోగ్రఫీకి మరింత డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఫోటోగ్రఫీ వృత్తి చేపట్టిన వారి భవిష్యత్తుకి ఏమీ ఢోకా లేదు. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఫోటోగ్రఫీ మరింత సులభం అయింది. ఇక సెల్ఫీ ఫోటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఏది ఏమైనా, ఫోటోగ్రఫీ చాలామందికి వృత్తిగానే కాదు ప్రవృత్తిగానూ మారిపోయింది.

మొదట ఫోటోగ్రఫీ కెమెరాలు చాలా పెద్దగా ఉండేవి. కాలక్రమంలో ఎయిమ్ అండ్ షూట్ కెమెరాలు, ఫీల్డ్ కెమెరాలు, డొనాల్ కెమెరాలు, డిజిటల్ సింగిల్ లెన్స్ రిఫ్లెక్స్, ఫ్లై కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు రీల్స్‌తో ఫోటోలు తీసే స్థాయి నుంచి చిన్న మెమొరీ కార్డుతో ఫోటోలు తీసే స్థాయికి ఫోటోగ్రఫీ చేరుకుంది. అయితే ఇంతటి పరిజ్ఞానం వెనుక ఎందరో శాస్త్రవేత్తల అధ్యయనాలు, పరిశోధనల నిరంతర కృషి దాగివుంది. అటువంటి మహనీయులను ఒక్కసారి గుర్తు చేసుకోవడమే ఫోటోగ్రఫీ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

అన్నా లీబోవిట్జ్, స్టీవ్ మెక్‌కరీ, సెబాస్టియో సల్గాడో, డోరోథియా లాంగే ఫోటోగ్రఫీ రంగంలో అద్భుతమైన కృషి చేశారు. వీరు తమ ఫోటోల ద్వారా విభిన్న సంస్కృతులను ప్రపంచానికి చూపించి, అద్భుతమైన జ్ఞాపకాలను మిగిల్చారు. మనిషి జీవితంలోని పోరాటం, మానవత్వం వంటి అంశాలను వాళ్ళ ఫోటోలలో ప్రదర్శించారు. కళాకారులు కొత్త సాంకేతికతలను ఉపయోగిస్తూ కొత్త తరాల ఫోటోగ్రాఫర్‌ల అభివృద్ధికి దోహదపడుతున్నారు. వారి పోర్ట్రెయిట్లు, ల్యాండ్‌స్కేప్ ఫోటోలు, ఇతర సేకరణలు మనలో ఆలోచన, ఉత్సాహం, భావోద్వేగాలను రేకెత్తించే స్థాయి. ఈ ఫోటోగ్రాఫర్‌లు గతంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను రికార్డ్ చేసి, మనకు చరిత్రను అందించారు. మెక్‌కరీ, లీబోవిట్జ్, సల్గాడో, లాంగే వంటి ఫొటోగ్రాఫర్ల కృషి ద్వారా ఫోటోగ్రఫీ నిరంతరం మారుతూ, కొత్త స్థాయికి చేరుకుంటూనే చెరగని ముద్రను లిఖిస్తోంది.

వ్యాసకర్త ఆంధ్ర ప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో సహాయాచార్యులు
(నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం)

తెలుగు సాహిత్యమూ... తాజా పాఠమూ...

'మా కన్నడ దేశంలో చాయ్ కోసం ఏ నలుగురు కుర్రాళ్లు కలిసినా కువెంపు గురించో, పూర్ణచంద్ర తేజస్వి గురించో, మరో సాహిత్యకారుని గురించో మాట్లాడుకుంటారు. సినిమాల మాట ఎత్తరు' అన్నాడు కన్నడ రచయిత వసుధేంద్ర. 'నా కథలు తెలుగులో అనువాదమై పుస్తకంగా వెలువడటం సంతోషంగా ఉంది. నా రచనలకు తమిళనాడులో, యూరప్‌లో, అమెరికాలో పాఠకుల క్లబ్‌లున్నాయి. వాటిని మొదలెట్టి నిర్వహిస్తున్నది ఒక తెలుగువాడు' అన్నాడు తమిళ రచయిత జయమోహన్.

ఆగస్టు రెండోవారంలో బెంగళూరులో జరిగిన నాలుగు దక్షిణాది భాషల 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్'లో ఈ రచయితలిద్దరూ మాట్లాడిన మాటలు తెలుగు సమాజ స్వభావాన్ని పరోక్షంగా నిరూపిస్తున్నాయి. ఏమంటే మన దగ్గర ఏ నలుగురు కుర్రాళ్లు కలిసినా సినిమాలు మాట్లాడుకుంటారు. మన దగ్గర ఏ నలుగురు పాఠకులు కలిసినా పరభాషా ఆరాధనను వ్యక్తపరుస్తారు. కేరళీయులు చెప్పింది ఎందుకు వదిలిపెట్టాలి? 'కరోనాలో ప్రభుత్వం అన్నీ బంద్ పెట్టి కేవలం మెడికల్ షాపులే తెరవడానికి అనుమతి ఇచ్చినా... 'అయ్యా సి.ఎం. గారూ! భౌతిక ఆరోగ్యం సరే... మానసిక ఆరోగ్యం కోసం పుస్తకాలు అక్కర్లేదా?' అని విన్నవిస్తే, ముఖ్యమంత్రి విజయన్ గారు వెంటనే స్పందించి వారంలో రెండు రోజులు వాటిని తెరవనిచ్చారు. అంతేనా? ఆ రోజుల్లో మేము స్విగ్గీలో కూడా పుస్తకాలు అమ్మాం' అని ఫెస్టివల్‌కు హాజరైన కేరళ ప్రచురణకర్త చెప్తే ఆశ్చర్యపోవడం తెలుగు ప్రతినిధుల పనైంది. ఏమంటే కరోనాలో మలయాళీలు పుస్తకాలు చదువుతుంటే మనం ఓటీటీలలో మలయాళ సినిమాలన్నీ చూస్తూ గడిపాం.

మనం ఏంటనేది మనం మాత్రమే ఉన్నప్పుడు తెలియదు. దాటి వెళ్లినప్పుడే తెలుస్తుంది. గతంలో లేనట్టుగా దక్షిణాదికే ప్రాధాన్యం ఇస్తూ మొదటిసారి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సాహిత్యకారులు 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్'లో కలిసినప్పుడు రెండు రోజుల ఆ వేడుకలో తమిళ, కన్నడ, మలయాళం నుంచి 'స్థాయి'తో తిరిగినవారు ఎందరు... తెలుగు నుంచి అలాంటి 'స్థాయి' కలిగినవారుగా నిలబడింది ఎందరు? ప్రారంభ వేడుకలో ఓల్గాకు స్థానం దక్కడం సంతోషమే అయినా పెరుమాళ్ మురుగన్, జయమోహన్, వివేక్ శానభాగ్ తదితర రచయితలు కనిపిస్తే తెలుగువారు ఆరాధనగా వెళ్లి పలకరించినట్టుగా తెలుగు రచయితలను ఆ భాషల పాఠకులు అంతే పలకరించారా? ఏం తక్కువ మనకు?

అక్కడకు హాజరైన వాడ్రేవు చినవీరభద్రుడు, మృణాళిని,



వేదికపై దక్షిణాది రచయితలు జయకాంతన్, శివప్రకాశ్, సచ్చిదానందన్, ఓల్గా, వివేక్ శానబాగ్

చూపు కాత్యాయని ఉద్దండులు. ఆధునిక ఆవరణలోని స్త్రీవాద కథను ప్రతిబింబించిన కుప్పిలి పద్మ వంటి రచయిత ఇతర భాషల్లో ఎక్కడ? మహిళా రచయితలకు వేదిక కల్పించి రచన, కార్యాచరణ నిర్వహిస్తున్న కె.ఎన్. మల్లీశ్వరి వంటి రచయిత్రులు ఎందరు? సాక్షాత్తూ 'గార్డియన్' పత్రిక రివ్యూ రాసేంతటి గొప్ప కథలు రాసిన గోగు శ్యామల అక్కడే ఉన్నారే! వీరంతా గౌరవం పొందలేదని కాదు. పొందారు. సరిపోదు! కేవలం మనల్ని మనం పెంచుకోకపోవడం వల్ల, ఎదుటివారి కృషిని గౌరవించలేకపోవడం వల్ల, పరాయి భాషల్లో అనువాదమయ్యి ఘనత చాటుకోవడం రాకపోవడం వల్ల, ముఖ్యం – ఒకరు ఎదుగుతుంటే కిందకు పట్టిలాగే పీతల స్వభావం వల్ల బెంగళూరులో తెలుగు వారు నలుగురిలో ఒకరిలా... ఇతర భాషల వారు నలుగురికి ఒకరిలా కనిపించారు.

నిజానికి 'బుక్ బ్రహ్మ'కు హాజరైన తెలుగు టీమ్ తెలుగు సాహిత్యం ఎంత వికాసవంతంగా ఉందో చూపింది. భిన్న సాహిత్యధోరణుల, వాదాల, శ్రేణుల ప్రతినిధులు ఉన్నారు. చిన్న వయసులో యువ సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన రమేష్ కార్తీక్ వంటి మన ఆదివాసీ రచయితా ఉన్నారు. ఇలాంటి టీమ్ ఇతర భాషల నుంచి హాజరు కాలేదు. గత యాభై ఏళ్ల తమిళ, మలయాళ, కన్నడ భాషల సాహిత్యంతో మన సాహిత్యాన్ని పోల్చినప్పుడు పురోగామి మెలకువను ప్రదర్శించడంలో మనల్ని మించినవారు లేరు. విప్లవ సాహిత్యంతో మొదలు మైనార్టీ సాహిత్యం వరకు జాజ్వల్యమైన కృషి సాగింది. గత పాతికేళ్లుగా సాగుతున్న 'రైటర్స్ మీట్' వంటి కృషి ఇతర భాషల్లో జరిగి ఉంటే ఎన్ని నోళ్లతో ఊదరగొట్టుకుని ఉండేవారో. ఇంత చేసినా తెలుగు వారు తెల్లముఖం వేయకతప్పడం లేదు. కాత్యాయనీ విద్మహే అన్నట్టు వైరుధ్యాల చైతన్యంలో మన ముందంజ వాటి మధ్య అంగీకారం సాధించడంలో లేదు. వైరుధ్యం శత్రుత్వం కాదని గ్రహించని మొండితనం తెలుగు సాహిత్యానికి చేటుగా మారింది. అహం, అక్కసు ఏ మేరకు నష్టం చేస్తున్నాయో ఎవరికి వారు పరిశీలించుకోవాలి. 'పిలిస్తే బాగుణ్ణు' నుంచి 'పిలిస్తే వస్తారో రారో' అనుకునే ఎదుగుదలకు సరిపడా కృషే కదా 'స్థాయి' అంటే!

సాహిత్యం లోపల ఇలా ఉంటే సాహిత్యానికి బయటి సమాజం మరోలా ఉంది. రాజకీయ వేత్తలు, వ్యాపారవేత్తలు, అధికారులు, డాక్టర్లు, లాయర్లు... వీరిలో తెలుగు పుస్తకాలు చదివేవారు ఎందరు? తెలుగు టీచర్లు, లెక్చరర్లు తెలుగు సాహిత్య సభలతో తమకు సంబంధమే లేనట్టుగా ఉండటం మనకే చెల్లింది. ఘనత వహించిన ఈ పౌరసమాజం నేడు గుర్తు పడుతున్నది! పట్టగలుగుతున్నది ప్రవచనకారులను, ఒకటీ అరా అవధాన పండితులను తప్ప ఆధునిక సాహిత్యకారులను కాదు... కనుక – అటు సాహిత్య సమాజం, ఇటు పౌర సమాజం పరస్పరం ఒక గీతకు చేరనంత వరకు తెలుగు సాహిత్యం ఏ గీతకూ చేరదు.

'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' తెలుగు సాహిత్యానికి నేర్పిన పాఠం ఇదే!

– మహమ్మద్ ఖదీర్‌బాబు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి రా.12.43 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** శ్రవణం ఉ.9.01 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.50 నుండి 2.18 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.49 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.32 వరకు, శ్రావణపూర్ణిమ, రాఖీ పండుగ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.21.

మయూరం.. త్రివర్ణం చెంత ఒయ్యారం




ప్రకాశం జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన నెమలి వంగపాడు పంచాయతీ ఎగువపల్లి గ్రామానికి అతిథిగా మారింది. నాలుగేళ్ల క్రితం ఆ ఊరికి వచ్చిన ఆ నెమలిని గ్రామస్తులంతా ఆప్యాయంగా చూసుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లి గింజలు తిని.. ఆ తర్వాత చెట్లపైకి, ఇంటి మిద్దెలపైకి వెళ్లి సందడి చేస్తుంటుంది. ఆదివారం గ్రామ మాజీ వలంటీర్ పాతకుంట నరసింహ భవనంపై కట్టిన భారత పతాకం వద్ద జాతీయ పక్షి కూర్చుంది. అనంతరం ఆ పక్కనే పురివిప్పి నాట్యం చేసింది.

– కనిగిరి రూరల్

గురిచూసి.. గుటుక్కుమనిపించి

గురిచూసి వేటాడటంలో నాకు నేనే సాటి అని నిరూపించుకుంది ఈ నీటి కొంగ (స్నేక్ బర్డ్). గుంటూరు జిల్లా ఉప్పలపాడు పక్షుల కేంద్రంలోని ఓ కొలనులో ఈ పక్షి చేపను వేటాడుతుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అదివో అల్లదివో శ్రీహరివాసము

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. తిరుమల కొలువైన శేషాచలం కొండలు పచ్చటి ప్రకృతితో అలరారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండలన్నీ పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. దేవదేవుడి దర్శనార్థం నిత్యం తిరుమలకు విచ్చేసే వేలాదిమంది భక్తులు ఈ ప్రకృతి అందాలను చూసి పులకిస్తున్నారు. అదివో అల్లదివో.. శ్రీహరివాసము.. పదివేల శేషుల పడగల మయము అంటూ శేషాచలం కొండలను చూసి భక్తి పారవశ్యానికి గురవుతున్నారు.

– తిరుమల



క్లుప్తంగా...

ముగిసిన సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన ముగిసింది. శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి వచ్చిన ఆయన ఆదివారం ఉదయం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా, కుమారస్వామి, సీఆర్ పాటిల్, రామ్మోహన్ నాయుడులతో భేటీ అయ్యారు. రూ.15 వేల కోట్ల రుణం త్వరగా ఇప్పించాలని, వెనుకబడిన జిల్లాలకు నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ ప్రధాని, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేశారు.

శ్రీశైలంలో 193 టీఎంసీల నీరు



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా ఆదివారం సాయంత్రానికి జలాశయంలో 881 అడుగుల మట్టంలో 193.4090 టీఎంసీల నీరు ఉంది. శనివారం నుంచి ఆదివారం వరకు జూరాల, సుంకేశుల నుంచి 78,498 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 99,237 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 14.688 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.729 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఆదివారం సాయంత్రానికి జలాశయానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 1,101,463 క్యూసెక్కుల నీరు వస్తోంది.

సామాజిక సమన్యాయం చేయాలి

రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు రాజేశ్ డిమాండ్



సాక్షి, అమరావతి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని కులాలకు సామాజిక సమన్యాయం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని, వర్గీకరణలో దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టి చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వర్గీకరణ అంశంపై అవగాహన కల్పిస్తూ ఉభయ రాష్ట్రాల్లో సోమవారం నుంచి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును 11 మంది ధర్మాసనంతో కూడిన బెంచి ఏర్పాటు చేసి పునః సమీక్షించాలని కోరుతూ రివ్యూ పిటిషన్ వేస్తామన్నారు. ఈనెల 19న భీమవరం, పాలకొల్లు, 20న విజయవాడ, 26న శ్రీకాకుళం, 27న తెలంగాణలోని మహబూబ్ నగర్‌లలో సమావేశాలు నిర్వహించనున్నట్లు రాజేశ్ వెల్లడించారు.

తొమ్మిదిమంది కూలీలకు అస్వస్థత

పొలంలో గుళికలు చల్లుతుండగా ఘటన



పెదపూడి: వరిపొలంలో గుళికలు చల్లుతూ తొమ్మిదిమంది కూలీలు ఆదివారం అస్వస్థతకు గురైన ఘటన తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు మండలం, పందలపాక గ్రామంలో చోటుచేసుకుంది. వారిని వెంటనే అనపర్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామగుర్రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నారాయణరెడ్డి పొలంలో ఊలపల్లి, మాచవరం, పందలపాక గ్రామాలకు చెందిన తొమ్మిది మంది కూలీలు టి.విజయకుమార్, సీహెచ్.దుర్గారావు, పి.యాకోబు, టి.గోవిందు. పి.రాంబాబు, వి.శ్రీను, ఆర్.వెంకటరమణ, వై.వినోద్‌కుమార్ తదితరులు ఆదివారం గుళికలు చల్లుతున్నారు. సుమారు 15 ఎకరాల్లో గుళికలు చల్లాల్సి ఉండగా ఆరు ఎకరాల్లో చల్లిన అనంతరం ఒక కూలీ తెచ్చిన మజ్జిగను తాగారు. కొంతసేపటికి తొమ్మిది మంది కూలీలు వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దాంతో వారిని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందరి పరిస్థితి నిలకడగానే ఉంది.

ఉల్లి రేటు.. మహా ఘాటు



రైతు బజార్లలో కిలో రూ.45.. బహిరంగ మార్కెట్‌లో రూ.60



సాక్షి ప్రతినిధి, కర్నూలు: రాష్ట్రంలో కర్నూలు జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో ఉల్లి సాగవుతోంది. ఖరీఫ్, రబీ సీజన్లలో ఏటా 87,500 ఎకరాల్లో ఇక్కడి రైతులు ఉల్లి సాగు చేస్తుండగా.. 5.25 లక్షల టన్నుల ఉల్లి ఉత్పత్తి అవుతోంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఇప్పటివరకు కేవలం 20,382 ఎకరాల్లోనే ఉల్లి సాగు చేస్తుండగా.. ఐదేళ్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ. దీంతో ఉత్పత్తి కూడా తగ్గుతోంది. రైతుల నుంచి మార్కెట్ యార్డుకు ఉల్లి రావడం భారీగా తగ్గింది.



కర్నూలు సి.క్యాంప్ రైతుబజార్‌లో ఉల్లిగడ్డలు

నాలుగు రాష్ట్రాల్లో దెబ్బతిన్న పంట

ఉల్లి ధరలు పెరగడానికి మహారాష్ట్రలో గత నెలలో కురిసిన భారీ వర్షాలే కారణమని తెలుస్తోంది. జూలై 24, 25 తేదీల్లో కురిసిన వర్షాలకు ఆ రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 50 శాతం పంట నష్టం వాటిల్లింది. ఒక్క నాసిక్ జిల్లాలోనే 48 వేల హెక్టార్లలో ఉల్లి సాగు చేస్తారు. కేవలం ఆ జిల్లానుంచే సుమారు 7 లక్షల టన్నుల ఉల్లి ఉత్పత్తి అవుతోంది. కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఉల్లి ఎక్కువగా సాగవుతుంది. జూలై మూడు, నాలుగో వారంలో కురిసిన వర్షాలకు ఆ రాష్ట్రాల్లోనూ పంట బాగా దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. మన రాష్ట్రం విషయానికి వస్తే ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఉల్లిలో తేమ శాతం, ఘాటు ఎక్కువ. వీటిని ఎక్కువ కాలం నిల్వ చేస్తే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ఏపీలో పండే ఉల్లిని ఉత్తర భారతదేశంలో పెద్దగా ఇష్టపడరు. అందుకే ఏపీ, తెలంగాణతో పాటు దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో ఈ ఉల్లిని విక్రయిస్తారు. మిగిలిన రాష్ట్రాల్లో పండించే ఉల్లిలో తేమ శాతం, ఘాటు తక్కువ. వాటిని ఏడాది నుంచి రెండేళ్లపాటు నిల్వ చేయొచ్చు. అందుకే ఈ ఉల్లిని దేశీయంగా వినియోగించడంతోపాటు బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఏపీలో వర్షాభావంతో సాగు విస్తీర్ణం తగ్గిపోగా.. ఉత్తర భారతదేశంలో వర్షాలతో పంట దిగుబడులు తగ్గాయి. దీంతో మార్కెట్‌కు ఉల్లి రావడం లేదు. ఫలితంగా ధరలు పెరుగుతున్నాయి.

రూ.5 వేలకు చేరే అవకాశం

ఈ ఏడాది మే నెలలో క్వింటాల్ ఉల్లి ధర కనిష్ఠంగా రూ.316 ఉంటే.. గరిష్ఠంగా రూ.1,617 పలికింది. ప్రస్తుతం ఆ ధర రూ.3,700కు పెరిగింది. మార్కెట్‌లో నిల్వలు తగ్గిపోతుండటంతో సెప్టెంబరులో ఉల్లి ధర క్వింటాల్‌కు రూ.4,500–రూ.5 వేల వరకూ చేరే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

50 శాతం కొనుగోళ్లు తాడేపల్లిగూడెం నుంచే..

కర్నూలులో ఉత్పత్తి అయ్యే పంటలో 20 శాతం మాత్రమే కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుగుతాయి. మిగిలిన 80 శాతం పంటను తాడేపల్లిగూడెం, హైదరాబాద్, చెన్నైతో పాటు ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ఇక్కడ దళారులను నియమించుకుని, వారి ద్వారా రైతులకు ముందుగానే అప్పులు ఇచ్చి, పంట చేతికి రాగానే మార్కెట్ ధర ప్రకారం తమకే విక్రయించాలని ఒప్పందం చేసుకుంటారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వ్యాపారులు కర్నూలులో ఉత్పత్తి అయ్యే పంటలో 50 శాతం కొనుగోలు చేస్తారు. అక్కడి ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయాలు సాగించి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి ధరలు ఇలా..

నెల	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
	(క్వింటాల్‌కు రూపాయల్లో)	
మే	316	1,617
జూన్	1,401	1,835
జూలై	2,387	2,500
ఆగస్టు	2,825	3,711

కర్నూలు జిల్లాలో ఆరేళ్లుగా ఉల్లి సాగు, ఉత్పత్తి

సంవత్సరం	(హెక్టార్లలో)	ఉత్పత్తి (క్వింటాళ్లలో)
2019-20	23,299	4,19,382
2020-21	22,268	4,00,824
2021-22	16,031	2,88,558
2022-23	26,970	4,85,457
2023-24	17,896	1,61,062
2024-25	8,153	-

ఎగుమతులపై నిషేధం విధిస్తేనే ధరలకు కళ్లెం

ఉల్లి ధరలను నియంత్రించేందుకు కేంద్రం ముందస్తు చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఏర్పడింది. భారత్ నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలు ఉల్లిని దిగుమతి చేసుకుంటాయి. ప్రస్తుతం శ్రీలంకలో కిలో ఉల్లి రూ.120 నుంచి రూ.150 వరకూ ధర పలుకుతోంది. ఈ క్రమంలో ఎగుమతులు నిషేధించడంతో పాటు నాఫెడ్‌లోని నిల్వలను కేంద్రం మార్కెట్‌లోకి విడుదల చేస్తే ధరలు దిగొస్తాయని వ్యాపారులు చెబుతున్నారు. 2019లో ఎన్నడూ లేనివిధంగా ఉల్లి ధర క్వింటాల్ రూ.13,010 పలికింది. అప్పట్లో రిటైల్‌లో కిలో ఉల్లి రూ.150కి చేరింది. వినియోగదారులు ఇబ్బంది పడకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉల్లిని కొనుగోలు చేసి రైతు బజార్లలో కిలో రూ.25కే విక్రయించింది. ఇప్పుడు కూడా ఉల్లి ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం రైతు బజార్లలో కిలో రూ.25కే విక్రయించాలని వినియోగదారులు కోరుతున్నారు.

విశాఖ అందాలు అద్భుతం

కైలాసగిరిని సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



కైలాసగిరిపై కుటుంబ సభ్యులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

ఆరిలోవ(విశాఖ తూర్పు): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిని సందర్శించారు. రోప్‌వేలో కొండపైకి చేరుకున్నారు. సర్క్యూట్ ట్రైన్‌లో కొండ పైభాగం అంతా పర్యటించారు. కుటుంబ సభ్యులతో కలసి శివపార్వతులు, ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ తదితర చోట్ల గ్రూప్ ఫొటోలు దిగారు. ఇక్కడ విశాలమైన పార్కులు, పిల్లల ఆట స్థలాలు, సర్క్యూట్ ట్రైన్ ట్రాక్, పూల మొక్కల పార్కులు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం తెలుగు మ్యూజియాన్ని సందర్శించారు. విశాఖ అందాలు అద్భుతంగా ఉన్నాయని జస్టిస్ జేకే మహేశ్వరి ప్రశంసించారు. కైలాసగిరి ప్రాముఖ్యత గురించి జస్టిస్ జేకే మహేశ్వరికి వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ పాల్‌కిరణ్ వివరించారు.



కైలాసగిరిపై సర్క్యూట్ ట్రైన్‌లో జేకే మహేశ్వరి



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జైసూర్య, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. - తిరుమల

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

బొమ్మలసత్రం: ఫైనాన్స్ కంపెనీ వేధింపులకు నంద్యాల జిల్లా గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన యువకుడు దస్తగిరి(24) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మదార్, దస్తగిరమ్మల రెండో కుమారుడు దస్తగిరి.. పెయింటర్. ఇంటి నిర్మాణం కోసం డబ్బు అవసరం కాగా, నంద్యాల పట్టణంలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ నుంచి రూ.2.50 లక్షలు అప్పు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.7,220 చెల్లిస్తూ వస్తున్నారు. ఈ నెల కంతు ఆలస్యం కావటంతో ఫైనాన్స్ సిబ్బంది దస్తగిరిని ఒత్తిడి చేశారు. కొంత సమయం ఇవ్వాలని ప్రాధేయపడ్డా వినకుండా రెండు రోజుల కిందట ఆయన ఇంటికి తాళం వేశారు. దీంతో అవమానభారం తట్టుకోలేక ఆదివారం గ్రామ శివారులో సౌభాగ్య పౌడర్(కళ్లాపి చల్లేందుకు వాడేందుకు ఉపయోగించేది) నీళ్లలో కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని గంటల తర్వాత దస్తగిరి మృతదేహాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సొసైటీ గుమస్తా కుటుంబానికి న్యాయం చేస్తాం

- జీతం బకాయిలు చెల్లిస్తాం.. కుమారుడికి ఉద్యోగం ఇస్తాం
- బ్యాంకు అధికారులు హామీ
- టీడీపీ, బ్యాంకు సిబ్బంది వేధింపులతో సొసైటీ గుమస్తా శ్రీనివాసరెడ్డి ఆత్మహత్య
- వైఎస్సార్‌సీపీ ఆందోళనతో బాధిత కుటుంబానికి న్యాయం



శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని చెబుతున్న బ్యాంకు చీఫ్ మేనేజర్ రమాదేవి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నేతలు, బ్యాంకు సిబ్బంది వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న పల్నాడు జిల్లా అన్నవరం పీఏసీఎస్ ఉద్యోగి ఓరుగుంటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి న్యాయం చేస్తామని జీడీసీసీ బ్యాంకు అధికారులు హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో జీతం బకాయిలు చెల్లించడంతో పాటు అతని కుమారుడు లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డికి తండ్రి ఉద్యోగం ఇస్తామన్నారు. అది కూడా పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. వివరాలు.. పల్నాడు జిల్లా అన్నవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఓరుగంటి శ్రీనివాసరెడ్డి గుమాస్తాగా పనిచేస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. ఉద్యోగం మానుకోవాలంటూ అతనిని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. టీడీపీ నేత, అన్నవరం సొసైటీ సీఈవో దొప్పలపూడి శ్రీనివాసరావు బ్యాంకు స్పెషల్ ఆఫీసర్ సురేంద్రబాబుతో కలిసి మూడు నెలలుగా జీతం కూడా నిలిపివేయించాడు. వారిద్దరి వేధింపులు తట్టుకోలేక శ్రీనివాసరెడ్డి శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. వైఎస్సార్‌సీపీ నేత, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీంతో శాంతి భద్రతల అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి బ్యాంకు అధికారులతో మాట్లాడారు. చీఫ్ మేనేజర్ రమాదేవి ప్రభుత్వాస్పత్రికి వచ్చి శ్రీనివాసరెడ్డి భార్య రామసీతమ్మ, కుమారుడు లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డి, కుమార్తె దేవికకు హామీలు ఇవ్వటంతో ఆందోళన విరమించారు. వెంటనే హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. కాగా, తన చావుకు టీడీపీ నేత దొప్పలపూడి శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సురేంద్రబాబు కారణమంటూ శ్రీనివాసరెడ్డి రాసిన సూసైడ్ నోట్‌ను కుమారుడు లక్ష్మీప్రసన్నరెడ్డి మీడియాకు చూపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు సువర్ణకాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు.



ఖాకీ వనంలో 'కలుపు' వృక్షం

టీడీపీ సేవలో పేట్రేగిపోతున్న కుప్పం అర్బన్ సీఐ

- వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా అక్రమ కేసులు
- టీడీపీలో చేరకపోతే అక్రమ కేసులతో జైలుపాల్జేస్తున్న వివాదాస్పద అధికారి
- తాజాగా.. కుప్పం మండల కన్వీనర్, కుమారుడిపై అక్రమ కేసులు.. జైలుపాలు



కుప్పం పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు మురుగేష్, కుమారుడు శ్రీనివాసులు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆయన ఓ పోలీసు అధికారి.. నిజాయితీగా, వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావంతో ఉండాల్సిన వ్యక్తి.. కానీ, ఆ లక్షణాలేవీ ఆయనలో మచ్చుకైనా కనిపించవు. ఖాకీ యూనిఫాంలో ఉన్న కరుడుగట్టిన 'పచ్చ' సైనికుడు. టీడీపీ కార్యకర్తలకంటే ఎక్కువగా పార్టీ కోసం పరితపిస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు చేయించి తిరిగి వారిపైనే అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారు కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు.

కూటమి సర్కార్ రాగానే స్వైరవిహారం

ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ ఎస్ఐ, సీఐగా ఎక్కువ కాలం అనంతపురం జిల్లాలో పనిచేశారు. హిందూపురంలో పనిచేసే సమయంలో వైఎస్సార్‌సీపీ నేత చేలూరు రామకృష్ణారెడ్డి హత్య కేసులో నిందితులకు సహకరించారనే కారణంగా ప్రభుత్వం ఆయన్ని వీఆర్‌కి పంపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల తరువాత కుప్పం అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన తరువాత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై బెదిరింపులు, దౌర్జన్యాలు వంటి వాటితో చెలరేగిపోతున్నారు. 24 గంటలు టీడీపీ కోసమే అన్నట్లుగా పనిచేస్తున్నారు.

పాత కేసులు తిరగదోడుతూ..

తాజాగా.. వైఎస్సార్‌సీపీ కుప్పం మండల కన్వీనర్ మురుగేష్, ఆయన కుమారుడు శ్రీనివాసులుపై ఆయన కన్నుపడింది. వీరిపై ఇప్పుడు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు. ఈ కేసులు కూడా ఇప్పటివి కావు. ఎనిమిది నెలల క్రితం జరిగిన ట్రాక్టర్ దొంగతనం కేసు ఒకటి కాగా.. 2022లో ఎమ్మార్పీఎస్, స్థానికుల మధ్య చెరువు పనుల విషయంలో చోటుచేసుకున్న వివాదం మరొకటి. ఇందులో మురుగేష్, శ్రీనివాసుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కొద్దిరోజులకు ఇరువర్గాల వారు రాజీపడడమే కాక కేసు ఉపసంహరించుకున్నారు కూడా. ఈ కేసులను సీఐ జీటీ నాయుడు ఇప్పుడు తిరగదోడారు. కుప్పం ఎంపీపీ, మండల కన్వీనర్ కుటుంబం టీడీపీ కండువా కప్పుకోలేదన్న కారణంతో శనివారం రాత్రి మురుగేష్, శ్రీనివాస్‌పై దొంగతనం.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

ఈ సీఐ వచ్చాకే దాడులు, కేసులు

కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుంచే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు అక్రమ కేసులు బనాయించడం ప్రారంభమయ్యాయి. కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీ హస్తగతం చేసేందుకు జీటీ నాయుడు రంగంలోకి దిగారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ఒక్కొక్కరిని పిలిపించి వార్నింగ్‌లు ఇవ్వడం ప్రారంభించారు. 'మర్యాదగా టీడీపీ కండువా కప్పుకో. లేదంటే ఏదో ఒక కేసుపెట్టి జైలుకు పంపుతా'.. అంటూ బెదిరింపులకు దిగారు. తన మాట వినని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేసినట్లు సమాచారం. సీఐ బెదిరింపులు, దౌర్జన్యాలకు భయపడి ఐదుగురు కౌన్సిలర్లు, మరో ఐదుగురు ఎంపీటీసీలు టీడీపీలో చేరిపోయారు. ఆ చేరికలు కూడా ప్రత్యేక వాహనంలో అమరావతికి పంపించి చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పించిన ఘనుడు ఈ సీఐ. ఇక తాజాగా.. కుప్పం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా జల్లికట్టు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన జల్లికట్టులో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీని నిర్వహణ వెనుక రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

వైఎస్సార్‌సీపీ నేతను వెంటాడి మరీ

ఇదిలా ఉంటే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ జూలై 21న బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తుండగా అర్ధరాత్రి కాపుకాచి వీ కోట వద్ద అరెస్టు చేసి కుప్పం పోలీసుస్టేషన్‌కు తరలించారు. అతన్ని అరెస్టు చెయ్యొద్దని కోర్టు ఆదేశాలున్నా.. చంద్రబాబు మెప్పు పొందేందుకు సీఐ జీటీ నాయుడు.. బస్సులో ప్రయాణిస్తున్న నాగార్జున యాదవ్ సెల్‌ఫోన్ సిగ్నల్‌ను ట్రాక్‌చేసి అరెస్టుచేశారు. ఈ విషయం గురించి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, మీడియా ప్రతినిధులు ఆయన్ను నేరుగా ఫోన్‌చేసి అడిగినా గోప్యంగా ఉంచారు. అరెస్టుచేయలేదే అంటూ బదులిచ్చారు. చివరకు.. నాగార్జున యాదవ్ స్వయంగా తాను కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఉన్నానని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. 41ఏ నోటీసులు ఇవ్వటం కూడా చట్ట విరుద్ధంగా ఉందని వైఎస్సార్‌సీపీ తప్పుబట్టింది. ఇలా కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు చట్టాన్ని అతిక్రమించి టీడీపీ పార్టీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ పట్టించుకోకపోవడంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

విస్మరిస్తే చంపెయ్యాలి: ధన్‌ఖడ్

జైపూర్: దేశం కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారిని చంపేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాలను పరమోన్నతంగా భావించని వారు వెల్లడించే అభిప్రాయం దేశ వ్యతిరేకంగానే ఉంటుందని పేర్కొన్నారు. దేశం ముందుకు సాగాలంటే ఇటువంటి వారిని అడ్డుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అయినా వారు జాతి అభివృద్ధికి హానికరమైన తమ చర్యలను కొనసాగిస్తున్న పక్షంలో చంపేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానన్నారు. విభిన్న అభిప్రాయాలను కలిగి ఉండటం ప్రజాస్వామ్యమనే పుష్పగుచ్ఛంలో పరిమళాలన్న ఉపరాష్ట్రపతి.. వ్యక్తిగత, రాజకీయ లాభం కంటే జాతి ప్రయోజనాలను మిన్నగా చూసుకునే వారికే ఇది వర్తిస్తుందన్నారు. మన గుర్తింపు భారతీయత, మన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదన్నారు. ఆదివారం జైపూర్‌లో అవయవదాతలతో ఏర్పాటైన సమావేశంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ మాట్లాడారు.

నేడు కర్ణాటకలో కాంగ్రెస్ నిరసనలు

బెంగళూరు: మైసూరులో భూకేటాయింపుల వివాదంలో కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేత, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అనుమతించడాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన చేపట్టనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు నిరసన ర్యాలీలు నిర్వహిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నేత, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం ప్రకటించారు. '' ఏం లేకున్నా గవర్నర్ దీన్నొక కేసులా మార్చారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఈ ఉదంతంపై కాంగ్రెస్ నిరసన బాటలో పయనిస్తుంది. తాలూకా, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు కార్యకర్తలు పాదయాత్రగా వెళ్లి గవర్నర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ రాష్ట్రపతిని ఉద్దేశిస్తూ మెమొరాండం అందజేస్తారు'' అని నిరసన కార్యక్రమ వివరాలను డీకే వివరించారు.

22న సీఎల్పీ భేటీ

గవర్నర్ నిర్ణయాన్ని ఐకమత్యంతో తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని చాటేందుకు 22వ తేదీన సీఎల్పీ భేటీని నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, బయోటెక్నాలజీ మంత్రి ప్రియాంక్ ఖర్గే చెప్పారు. '' ముడా భూకేటాయింపుల అంశంపై ఈ భేటీలో చర్చిస్తారు. చట్టబద్ధంగా ఈ కేసును ఎలా ఎదుర్కోబోతున్నామో ఆయన వివరిస్తారు'' అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

వాదించనున్న సింఘ్వీ, సిబల్ !

మైసూరు భూకేటాయింపుల కేసులో ప్రజా ప్రతినిధుల కోర్టులో సీఎం సిద్ధరామయ్య తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్ వాదించే అవకాశముంది. ఈ మేరకు వీరిద్దరూ నేడు బెంగళూరుకు వస్తున్నట్లు సీఎం కార్యాలయం తెలిపింది.

భిన్న ధ్రువాలు.. విభిన్న వైఖరులు





అగ్రరాజ్యం. అమెరికా ప్రపంచ పెద్దన్నగా కొనసాగాలంటే అధ్యక్షపీఠంపై ఆసీనులై పరిపాలించే నేత తీసుకునే నిర్ణయాలు తిరుగులేనివై ఉండాలి. దేశ అంతర్గత భద్రత, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ధరలుసహా యుద్ధాలు, వాతావరణ మార్పు వంటి అంతర్జాతీయ అంశాలపై పట్టుండాలి. అంతర్యుద్ధాలు, సంక్షోభాలు, అంతర్జాతీయ సమస్యలపై మిత్ర దేశాలతోపాటు శత్రుదేశాలనూ ఒప్పించగల నేర్పు తప్పనిసరి. నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌లు తాము గెలిస్తే ఎలాంటి పాలన అందిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత నాలుగేళ్లుగా జో బైడెన్ అమలుచేసిన అభివృద్ధి పథకాలను కొనసాగిస్తానని హారిస్ చెబుతుండగా అక్రమ వలసలను నిలువరించి బహిష్కరణ పర్వానికి తెరలేపుతానని, విప్లవాత్మక విధానాలను అమలుచేస్తానని ట్రంప్ భీష్మ ప్రతిజ్ఞచేశారు. "అధ్యక్షురాలిగా గెలవగానే శ్రామిక కుటుంబాల కోసం పాటుపడతా. కనీస వేతనాన్ని పెంచుతా. సేవలు, ఆతిథ్యరంగంలోని సిబ్బందికి అందే టిప్పులపై వసూలుచేస్తున్న పన్నులను రద్దుచేస్తా' అని హారిస్ అన్నారు. జూన్‌లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సైతం ఇదే హామీ ఇవ్వడం విశేషం. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపై ఇప్పటికే ట్రంప్, హారిస్ వెల్లడించిన అభిప్రాయాలు వారి పాలనాపంథాపై స్పష్టత తీసుకొస్తున్నాయి. వాటిని ఒకసారి తరచి చూస్తే..

అబార్షన్



హారిస్: సురక్షితమైన, చట్టబద్ధమైన అబార్షన్‌కు కమలా హారిస్ మద్దతు పలుకుతున్నారు. రిపబ్లిక్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అబార్షన్లపై నిషేధం విధించడాన్ని ఆమె ఇప్పటికే పలుమార్లు తప్పుబట్టారు. తాము అధికారంలోకి వస్తే చట్టబద్ధ అబార్షన్‌కు అనుమతిస్తూ పార్లమెంట్‌లో చట్టం తెచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు.

ట్రంప్: కొన్ని రాష్ట్రాల్లో అబార్షన్‌పై నిషేధం అమలవుతుండగా కొన్ని రాష్ట్రాల్లో షరతుల మేరకు అనుమతిస్తున్నారు. దీంతో అబార్షన్‌పై ఎప్పుడు ప్రశ్నించినా ట్రంప్ సమాధానం దాటవేశారు. అబార్షన్‌పై జాతీయస్థాయి విధానాన్ని ప్రకటించలేదు. రాష్ట్రాలకే ఆ నిర్ణయం వదిలేస్తే మంచిది అన్నట్లు గతంలో వ్యాఖ్యానించారు.

వాతావరణ మార్పులు/ఇంధనం



హారిస్: అమెరికాలో కర్బన ఉద్గారాల విడుదల తగ్గిస్తానని ఉపాధ్యక్షురాలి హోదాలో హారిస్ గతంలో చెప్పారు. హరిత ఇంధనానికి జై కొట్టారు. సముద్రగర్భంలో చమురు వెలికితీతను వ్యతిరేకించారు. విద్యుత్ వినియోగం ఆదాతోపాటు పర్యావరణ అనుకూల పథకాలను ప్రోత్సహించారు.

ట్రంప్: వాతావరణ మార్పుల అంశాన్ని గాలి కొదిలేశారు. పారిస్ ఒప్పందం నుంచి వైదొలిగారు. ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా చమురు తవ్వకాలకు పచ్చజెండా ఊపారు. బైడెన్ ప్రభుత్వం వచ్చాక పారిస్ ఒప్పందంలో అమెరికా చేరింది. అయితే ఈసారి తాను గెలిస్తే పారిస్ ఒప్పందానికి మళ్లీ కటీఫ్ చేప్తానని ట్రంప్ అన్నారు.

ప్రభుత్వపాలన



హారిస్: ప్రభుత్వ ఉద్యోగులను హఠాత్తుగా తొలగించే వివాదాస్పద 'ప్రాజెక్ట్ 2025' సిద్ధాంతాన్ని హారిస్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను సులభంగా తీసేసేందుకు వీలు కల్పించేలా 2020లో ట్రంప్ ఇచ్చిన షెడ్యూల్-ఎఫ్ ఉత్తర్వును హారిస్ వ్యతిరేస్తున్నారు. సిబ్బంది ఉద్యోగ భద్రతకు పాటుపడతానని ఆమె మాటిచ్చారు. అక్రమ వలసలను తగ్గిస్తానని చెప్పారు. ఆహార ఉత్పత్తుల ధరను తగ్గిస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల టిప్‌లపై పన్నును తొలగిస్తానన్నారు. కార్మికుల కనీస వేతనం పెంచుతానని, పౌరులు కొనే అధునాతన ఆయుధాలపై నిషేధం విధిస్తానని చెప్పారు.

ట్రంప్: తన హయాంలో అమలు చేయాలని ప్రయత్నించిన 'ప్రాజెక్ట్ 2025' సిద్ధాంతం గురించి ట్రంప్ ఎక్కడా మాట్లాడట్లేదు. అయితే అధ్యక్ష కేంద్రంగా కేంద్రీకృత ప్రభుత్వానికి బాటలువేసే ఈ సిద్ధాంతాన్ని తాను గెలిస్తే అమలుచేయాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తనపై పలు కేసులకు కారకులైన న్యాయశాఖ సిబ్బందిపై వేటు వేయడానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నాడని వార్తలొచ్చాయి. విద్యాశాఖను రద్దుచేస్తానని, ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ వంటి సంస్థలను ప్రక్షాళిస్తానని చెప్పారు.


చట్టాల అమలు/ప్రజాస్వామ్యం



హారిస్: హారిస్ గెలిస్తే ట్రంప్‌పై కేసులపై దృష్టిపెట్టే అవకాశముంది. గత అధ్యక్ష ఫలితాలను తప్పుబడుతూ, పార్లమెంట్ భవంతి మీదకు రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ట్రంప్ ఉసిగొల్పడం, నీలితారకు అనైతిక నగదు చెల్లింపులు, ఆస్తిగా ఎక్కువగా చూపి రుణాల పొందటం వంటి కేసుల్లో తీర్పులు త్వరగా వచ్చేలా హారిస్ ఒత్తిడి తేవచ్చు. ప్రజాస్వామ్యయుత పాలనకు కట్టుబడతానని హారిస్ గతంలో అన్నారు.

ట్రంప్: బైడెన్ చేతిలో ఓడినపుడు అధ్యక్ష ఫలితాలను ట్రంప్ అంగీకరించలేదు. ఈసారి కూడా ఓడిపోతే ఓటమిని ట్రంప్ ఒప్పుకోకపోవచ్చు. నాటి పార్లమెంట్‌పై దాడి, అక్కడి పోలీసులను గాయపరిచిన నిందితులకు క్షమాభిక్ష పెడతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎఫ్‌బీఐను ప్రక్షాళిస్తానని చెప్పారు. బైడెన్ పాలనలో అవినీతిపై ప్రత్యేక ప్రాసిక్యూటర్‌తో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

ఇజ్రాయెల్/ ఉక్రెయిన్ యుద్ధాలు



హారిస్: గాజా స్ట్రిప్‌లో హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులను సమర్థిస్తూనే పాలస్తీనియన్ల ప్రాణాలూ ముఖ్యమేనని హారిస్ చెప్పారు. త్వరగా యుద్ధాన్ని ముగించాలని ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూను కోరారు. కాల్పుల విరమణ ఒప్పందానికి, సంధికి మొగ్గుచూపారు. ఈజిప్ట్, ఖతార్‌లతో కలసి మధ్యవర్తిత్వానికి ఓటేశారు. ఈమె గెలిస్తే గాజా యుద్ధం త్వరగా ముగిసే వీలుంది. ఉక్రెయిన్ యుద్ధంపై ఆమె ఇంకా ఎలాంటి స్పష్టమైన విధానాలు ప్రకటించలేదు.

ట్రంప్: హమాస్ అంతమయ్యేదాకా ఇజ్రాయెల్‌కు మద్దతు పలుకుతానని ట్రంప్ గతంలో అన్నారు. అయితే మరింత మారణహోమం జరక్కుండా త్వరగా యుద్ధం ముగించి గాజాలో శాంతి నెలకొల్పాలని ఆయన కోరుతున్నారు. జనావాసాలపై ఇజ్రాయెల్ దాడులనూ ట్రంప్ సైతం ఖండించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని త్వరగా ముగించే సత్తా తనకుందని ట్రంప్ గతంలో అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కమలా హారిస్ కంటే నేను అందంగా కనిపిస్తా

ప్రత్యర్థిపై వ్యక్తిగత దాడులకు దిగిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు నానాటికీ రసవత్తరంగా మారుతోంది. వాచాలత్వానికి మారుపేరైన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై వ్యక్తిగత దాడికి దిగారు. ఆమె కంటే తానే చాలా అందంగా కనిపిస్తానని చెప్పారు. కమలా హారిస్ వికారంగా ఉంటారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. శనివారం పెన్సిల్వేనియాలో రిపబ్లికన్ పార్టీ ప్రచార ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. ఇటీవల ప్రఖ్యాత టైమ్ మేగజైన్ కవర్‌పేజీపై కమలా హారిస్ చిత్రాన్ని ముద్రించడాన్ని ప్రస్తావించారు. ఆ చిత్రాన్ని రూపొందించిన కళాకారుడు చాలా ఉదారంగా వ్యవహరించాడని అన్నారు. అంటే కమల అందంగా లేకపోయినా అందంగా ఉన్నట్లు చిత్రీకరించాడని తేల్చేశారు. నిజానికి ఆమె కంటే తానే చాలా అందంగా ఉంటానని స్పష్టంచేశారు. టైమ్ మేగజైన్ వద్ద ఉన్న కమల ఫొటోలు అంతగా ఆకట్టుకొనేలా లేకపోవడంతో నమ్మశక్యం కాని ఒక అద్భుతమైన చిత్రకారుడిని తీసుకొచ్చి ఆ చిత్రం గీయించారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రత్యర్థుల భౌతికపరమైన రూపురేఖలపై ట్రంప్ విపరీత వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ నోరుజారిన ఉదంతాలు ఉన్నాయి. కమల హారిస్ ఆర్థిక విధానాలను పెన్సిల్వేనియా ర్యాలీలో ట్రంప్ తప్పుపట్టారు. అవి పనికొచ్చేలా లేవని అన్నారు. అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్న జో బైడెన్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. తాను బైడెన్‌పై పోటీ చేసి ఓడించాలని నిర్ణయించుకున్నానని, ఆయన తప్పుకోవడంతో ఇంకెవరితోనే పోటీ చేయాల్సి వస్తోందని చెప్పారు. అసలు ఎవరీ కమలా హారిస్? అని మండిపడ్డారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు భారతీయుల మృతి

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం లాంపసాస్ కౌంటీలో బుధవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో భారతీయ అమెరికన్ కుటుంబానికి చెందిన దంపతులు, వారి కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. లియాండర్‌కు చెందిన అర్వింద్ మణి దంపతులు తమ కుమార్తెను డాలస్‌లోని కాలేజీలో చేర్చేందుకు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యంలో కారు వెనుక టైరు పేలి అదుపు తప్పి ఎదురుగా వేరే లేన్‌పై వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఘటనలో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఘటన తీవ్రతకు అర్వింద్ మణి(45)తోపాటు ఆయన భార్య ప్రదీప, కుమార్తె అండ్రిల్(17)తో తోపాటు మరో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. అర్వింద్ కుమారుడు అదిర్యన్(14) 9వ గ్రేడ్‌లో చేరాడని, స్కూలు ప్రారంభం కావడంతో వారతడిని ఇంటి వద్దే వదిలేశారని ఆయన సోదరుడు తెలిపారు. దీంతో, అదిర్యన్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడన్నారు.

అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహ్మద్ యూనుస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎదురు లేకుండా అధికారంలో కొనసాగేందుకు దేశంలోని అన్ని వ్యవస్థలను హసీనా నాశనం చేశారన్నారు. 'న్యాయ వ్యవస్థ భ్రష్టు పట్టింది. దాదాపు 15 ఏళ్లపాటు సాగించిన దుర్మార్గపు పాలనలో ప్రజాస్వామిక హక్కులను ఆమె అణగదొక్కారు. ప్రభుత్వ ఖజానాను దోచుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు'అని ఆయన నిప్పులు చెరిగారు. హసీనా క్రూరమైన నియంతృత్వ విధానాల ఫలితంగా దేశంలో అన్నిరకాలుగా పూర్తి గందరగోళంలోకి నెట్టివేయబడిందని పేర్కొన్నారు. భద్రతా బలగాలు, మీడియాతోపాటు పౌర యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ వంటి కీలక విభాగాల్లో ముఖ్యమైన సంస్కరణలను తేవాలన్నది తమ ప్రధాన ఉద్దేశమన్నారు. జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయ సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. శాంతి నెలకొనే వరకు సాయుధ బలగాలు పౌర విభాగాలకు సాయంగా పనిచేస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలు, భద్రతా బలగాల సహకారంతో అతి తక్కువ సమయంలోనే సాధారణ పరిస్థితులను తీసుకువస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలకు భద్రతను, రక్షణను కల్పించేందుకు ప్రభుత్వ కట్టుబడి ఉంటుందని ప్రకటించారు.

సుమోటోగా స్వీకరించిన సుప్రీం

- కోల్‌కతా డాక్టర్ హత్యోదంతంపై రేపు విచారణ
- విచారణ చేపట్టనున్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 20న ఈ కేసు విచారణ చేపట్టనుంది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానం వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చారు. దేశాన్ని కుదిపేస్తున్న వైద్యురాలి హత్య కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఘటనపై 14న సీబీఐ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు పలువురు న్యాయవాదులు సుప్రీంకోర్టు సీజేఐకు లేఖ రాశారు. డాక్టర్ హత్య ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది.

ప్రత్యేక చట్టం తీసుకురావాలి

కోల్‌కతాలో వైద్యురాలి హత్యపై 70 మందికిపైగా పద్మ అవార్డుల గ్రహీతలైన డాక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిపై హింసను అరికట్టడానికి, వారి తగిన భద్రత కల్పించడానికి, ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. వైద్యులపై, సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిని, మానసికంగా వేధించేవారిని శిక్షించడానికి ఆర్డినెన్స్ తేవాలని సూచించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో వైద్యుల్లో భయాందోళనలు పెరిగిపోతున్నాయని, ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. బాధితురాలి కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. ఆ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాని మోదీకి లేఖ రాసినవారిలో ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ్, ఎయిమ్స్ రెసిడెంట్స్ డాక్టర్లు తదితరులు ఉన్నారు.



కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియం వద్ద ఫుట్‌బాల్ అభిమానుల నిరసన

మమతా బెనర్జీది ద్వంద్వ వైఖరి

జూనియర్ డాక్టర్ తల్లిదండ్రుల ఆగ్రహం

కోల్‌కతా: అత్యాచారం, హత్యకు గురైన జూనియర్ డాక్టర్ తండ్రి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయం చేయాల్సిన ముఖ్యమంత్రి ఆ పని చేయకుండా ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు నిరసన ర్యాలీల్లో పాల్గొంటున్నారని మండిపడ్డారు. తమ కుమార్తె హత్య పట్ల మమతా బెనర్జీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. మమతవైఖరిని బాధితురాలి తల్లి సైతం తప్పుపట్టారు. వైద్యుల ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ హాస్పిటల్ చుట్టూ పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. కాగా, హత్యకు గురైన వైద్యురాలి పేరు, గుర్తింపును బయటపెట్టడంతోపాటు ఈ ఘటనపై ప్రజల్లో వదంతులు వ్యాప్తి చేసినందుకు బీజేపీ మాజీ ఎంపీ లాకెట్ చటర్జీతోపాటు మరో ఇద్దరు డాక్టర్లు కునాల్ సర్కార్, సుబర్ణ గోస్వామికి కోల్‌కతా పోలీసులు సమన్లు జారీ చేశారు.

కోస్ట్ గార్డ్ డీజీ హఠాన్మరణం



సాక్షి, చెన్నై/న్యూఢిల్లీ: భారత తీర రక్షక దళం(ఐసీజీ) డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ హఠాన్మరణం చెందారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన ఐసీజీ కార్యక్రమంలో రాజ్‌నాథ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండెపోటుకు గురైన రాకేశ్ పాల్‌ను వెంటనే చెన్నైలోని రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి 7 గంటల సమయంలో ఆయన ఆస్పత్రిలో కన్నుమూశారని అధికార వర్గాలు తెలిపాయి. చెన్నైలోనే ఉన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆస్పత్రికి వెళ్లి రాకేశ్ పాల్‌కు నివాళులర్పించారు. రాకేశ్ పాల్ పార్థివ దేహాన్ని ప్రత్యేక ఏర్పాట్లతో చెన్నై నుంచి అర్ధరాత్రి వేళ ఢిల్లీకి తరలించారు. రాకేశ్ పాల్ గతేడాది జూలై 19వ తేదీన ఐసీజీ 25వ డీజీగా బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ నావల్ ఎకాడమీ విద్యార్థి అయిన రాకేశ్ పాల్ 1989లో ఐసీజీ (ఇండియన్ కోస్ట్ గార్డ్)లో చేరి 34 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు.

ఏసీ ఔట్‌డోర్ యూనిట్ మీదపడి ఒకరు మృతి

న్యూఢిల్లీ: ఏసీ ఔట్‌డోర్ యూనిట్ రెండో అంతస్తు నుంచి మీదపడటంతో ఒక యువకుడు చనిపోగా మరొకరు తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఈ ఘటన సెంట్రల్ ఢిల్లీలోని దోరివలన్ ఏరియాలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో చోటుచేసుకుంది. జితేశ్(18), ప్రాన్షు(17) అనే ఇద్దరు రోడ్డు పక్కన మాట్లాడుతుండగా రెండో అంతస్తు నుంచి ఏసీ ఔట్‌డోర్ యూనిట్ వారిపై పడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ వెంటనే ఆస్పత్రికి తరలించారు. జితేశ్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రాన్షు చికిత్స పొందుతున్నాడు. అతడు ప్రస్తుతం వాంగ్మూలం ఇచ్చే పరిస్థితిలో లేడని దేశ్‌బంధు రోడ్ స్టేషన్ పోలీసులు తెలిపారు. సంఘటనాస్థలిని ఫోరెన్సిక్ బృందం పరిశీలించిందని, దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

బాలికపై బస్సులో సామూహిక అత్యాచారం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 15 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్ రోడ్‌వేస్‌కు చెందిన బస్సులో డెహ్రాడూన్‌లోని అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ (ఐఎస్‌బీటీ)లో ఇద్దరు డ్రైవర్లు, సహా మరో ముగ్గురు ఆగస్టు 12వ తేదీన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. 13వ తేదీ తెల్లవారుజామున బస్ టెర్మినల్‌లోని ఓ దుకాణం వద్ద బాలికను గార్డు గుర్తించాడు. వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి ఉత్తరాఖండ్ రోడ్ వేస్ బస్సును గుర్తించారు. ఐదుగురిని అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నేరం జరిగిన బస్సు, మరో బస్సును దర్యాప్తు కోసం ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించారు. మానసికంగా స్థిమితంగా లేని బాలిక సరైన సమాచారం ఇవ్వలేదు. తనది యూపీలోని మొరాదాబాద్ అని తెలిపింది. కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించింది. మొరాదాబాద్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీలోని కశ్మీరీ గేట్ నుంచి బస్సులో డెహ్రాడూన్‌కు వచ్చానని, అక్కడ ఐదుగురు వ్యక్తులు తనపై ఒక్కొక్కరుగా అత్యాచారానికి పాల్పడ్డారని బాలిక చెప్పిందని డెహ్రాడూన్ ఎస్ఎస్పీ అజయ్ సింగ్ తెలిపారు. నిందితులందరినీ అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు.

షాజహాన్‌పూర్‌లో చెట్లకు రాఖీలు

పర్యావరణ రక్షణకు నడుం కట్టిన మహిళలు

షాజహాన్‌పూర్: వేడుక ఏదనేది కాదు.. ఎందుకు ఉపయోగించామన్నది ముఖ్యం. రక్షా బంధన్.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకని అందిరికీ తెలిసిందే. ఆ బంధాన్ని చెట్లతో ముడివేసుకుంటున్నారు షాజహాన్‌పూర్ మహిళలు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లకు రాఖీ కడుతున్నారు. గత గురువారం నుంచి ఇప్పటివరకూ వెయ్యి చెట్లకు రాఖీలు కట్టారు. ముందుగా చెట్లకు కుంకుమ దిద్ది, రాఖీ కడతారు. తరువాత స్వీట్స్‌కు బదులుగా నీటిని, ఎరువులను వేస్తారు. స్థానికంగా ఉన్న వాట్సాప్ గ్రూప్ 'వీబీపీ' ఇలాంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అందులోని సభ్యులంతా వాటిని ఆచరిస్తున్నారు. పర్యావరణం పట్ల మన బాధ్యతను మరోసారి గుర్తు చేయడమే ఈ కార్యక్రమం ధ్యేయమని నిర్వాహకుల్లో ఒకరైన నీతూ గుప్తా చెబుతున్నారు. లక్ష చెట్లకు రాఖీలు కట్టడం తమ లక్ష్యమంటున్నారు. ఇదో సామాజిక ఉద్యమంగా మారితే బాగుంటుందని ఆకాంక్షిస్తున్నారు. కాగా, వీరి చొరవకు పలువురి ప్రశంసలు అందుతున్నాయి.


కరుణానిధి స్మారక రూ.100 నాణెం విడుదల



సాక్షి, చెన్నై: డీఎంకే దివంగత నేత, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శత జయంతి స్మారక రూ.100 నాణేన్ని ఆదివారం చెన్నైలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. మొదటి నాణేన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అందుకున్నారు. డీఎంకే ప్రభుత్వం ఏడాది పొడవునా కరుణానిధి శత జయంతి ఉత్సవాలను జరిపింది. ఆయన ముఖచిత్రంతో కూడిన రూ.100 నాణేన్ని కేంద్రం విడుదల చేసింది. ఆదివారం చెన్నై కలైవానర్ అరంగంలో జరిగిన వేడుకలో ఈ నాణేన్ని విడుదల చేశారు. కరుణ జీవిత ప్రస్థానంతో రూపొందించిన 7డీ టెక్నాలజీ లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.

దారుణంగా అవమానించారు

- జార్ఖండ్ మాజీ సీఎం చంపయ్ సోరెన్
- ఢిల్లీలో మకాం.. బీజేపీలో చేరే అవకాశం



రాంచీ: ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలే తనను దారుణంగా అవమానించారని, దాంతో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వచ్చిందని జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం సీనియర్ నాయకుడు చంపయ్ సోరెన్ అన్నారు. బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం నేపథ్యంలో చంపయ్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం 'ఎక్స్'లో తన ఆవేదనను షేర్ చేశారు. 'జూలై మొదటివారంలో ముఖ్యమంత్రిగా నేను పాల్గొనాల్సిన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను నాకు మాటమాత్రమైనా చెప్పకుండా పార్టీ నాయకత్వం రద్దు చేసింది. ఎందుకని ఆరా తీయగా పార్టీ ఎమ్మెల్యేల సమావేశం ఉందని, అప్పటిదాకా ఏ ప్రభుత్వ కార్యక్రమానికి హాజరు కాకూడదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇంతకంటే అవమానం మరొకటి ఉంటుందా?. ఎమ్మెల్యేల సమావేశంలో నన్ను రాజీనామా చేయమన్నారు. నిర్ఘాంతపోయా. అధికారంపై నాకెలాంటి యావ లేదు కాబట్టి వెంటనే రాజీనామా చేశా. కానీ నా ఆత్మగౌరవం దెబ్బతింది' అని చెప్పుకొచ్చారు. జీవితాన్ని ధారపోసిన పార్టీలో నా ఉనికే ప్రశ్నార్థకమైంది. నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని ఆ రోజే ఎమ్మెల్యేల భేటీలో ప్రకటించా. నా ఈ ప్రయాణంలో అన్ని ప్రత్యామ్నాయాలు తెరిచే ఉంటాయని సోరెన్ అన్నారు. ఇది తన వ్యక్తిగత పోరాటమని, ఇతర జేఎంఎం నాయకులను ఇందులోకి లాగదలచుకోలేదని చెప్పారు. ఎంతో చెమటోడ్చి నిర్మించుకున్న పార్టీకి నష్టం కలిగించాలనే ఆలోచన తానెప్పుడూ చేయలేదని, కాని అలాంటి పరిస్థితులు కల్పించారని చంపయ్ అన్నారు.

ఎమ్మెల్యేలకు ఎర వేస్తున్నారు: హేమంత్

బీజేపీ తమ పార్టీ ఎమ్మెల్యేలకు ఎర వేస్తోందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆరోపించారు. బీజేపీ గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర నుంచి నాయకులను జార్ఖండ్‌కు తెచ్చి గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల్లో విషం నింపుతోందని, ఒకరిపైకి మరొకరిని ఉసిగొల్పుతోందని అన్నారు. 'సమాజాన్ని విభజించడం మాట అటుంచితే.. వీళ్లు కుటుంబాలకు, పార్టీలను కూడా చీల్చుతారు. ఎమ్మెల్యేలకు ఎర వేస్తారు. డబ్బు నాయకులను పార్టీలు మారేలా చేస్తుంది' అని హేమంత్ పరోక్షంగా చంపయ్‌ను విమర్శించారు.

నెల తర్వాత తెరుచుకున్న బంగ్లా బడులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో నెల రోజులకు పైగా మూతబడిన విద్యాసంస్థలు ఆదివారం మళ్లీ తెరుచుకున్నాయి. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారడం, ప్రధాని హసీనా గద్దె దిగడం వంటి పరిణామాల మధ్య దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా అన్ని విద్యాసంస్థలు జూలై 17వ తేదీ నుంచి మూతబడ్డాయి. ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ సారథ్యంలో ఇటీవల తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెల్సిందే. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో..'ప్రధాన సలహాదారు యూనుస్ ఆదేశాల మేరకు ఆగస్టు 18వ తేదీ నుంచి అన్ని విద్యాసంస్థలను తిరిగి ప్రారంభించాలని సంబంధిత వర్గాలను కోరుతున్నాం'అంటూ 15వ తేదీన విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి మొసమ్మత్ రహీమా అక్తర్ పేరిట ఒక నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆదివారం ఉదయం యూనిఫాం ధరించిన స్కూలు విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవడం కనిపించింది. రాజధాని ఢాకాలోని చాలా ప్రాంతాల్లో ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగిపోయింది. బంగ్లాదేశ్‌లో పాఠశాలలు ఆదివారం నుంచి గురువారం వరకు పనిచేస్తాయి.

కేంద్ర మంత్రి జుయల్ ఓరం భార్య మృతి

డెంగ్యూతో మృతి చెందిన జింగియా ఓరం

భువనేశ్వర్: కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం భార్య జింగియా ఓరం మృతి చెందారు. డెంగ్యూతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. జుయల్ ఓరం సైతం డెంగ్యూ బారిన పడి అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జింగియా ఓరం మృతి పట్ల ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఆయన ఆస్పత్రిని సందర్శించారు. సీఎంతో పాటు ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, స్పీకర్ సూరమా పాఢి, ఇతర బీజేపీ నేతలు కూడా జింగియా ఓరం భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం : 19 : ఆగస్టు : 2024



చెల్లి అపేక్ష.. రాఖీ రక్ష

రాఖీ పౌర్ణమి కోసం ఆదివారం బెంగళూరు గాంధీబజార్‌లో రాఖీ కొనుగోలు చేస్తున్న యువతులు

న్యూస్‌రీల్

యడ్డి ఇంటి ముట్టడికి యత్నం



ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు

శివమొగ్గ: ముడా వ్యవహారంలో సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడాన్ని నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లాలోని శికారిపురలో నిరసన తెలిపారు. మాళేరకేరిలోని బీజేపీ మాజీ సీఎం యడియూరప్ప నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. పోలీసులు ముందు జాగ్రత్తగా అక్కడికి వెళ్లే రెండు దారులను బ్యారికేడ్లతో మూసివేశారు. కార్యకర్తలను బ్యారికేడ్ల వద్దే పోలీసులు అడ్డుకుని వ్యాన్లలో తరలించారు. గవర్నర్ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారారని, సీఎం సిద్దరామయ్యపై బీజేపీ, జేడీఎస్ నాయకులు కుట్ర చేస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో యడియూరప్ప నివాసానికి గట్టి పోలీసు బందోబస్తు కల్పించారు.

బైక్‌పై వెళ్తూ.. గుండెపోటుతో జవాన్ మృతి

యశవంతపుర: బైకులో వెళుతుండగా జవాన్‌కు గుండెపోటు వచ్చి మృతి చెందిన ఘటన బెళగావి ఆర్మీ స్థావరంలో ఆదివారం జరిగింది. సునీల్ సలాం (37) అనే జవాన్ మరాఠ పదాతిదళంలో హవల్దార్‌గా పని చేస్తున్నాడు. పని మీద బైకుపై వెళుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావటంతో బైకుపై నుంచి పడి ప్రాణాలు విడిచాడు. సమీపంలోని సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. మృతుని స్వస్థలం మహారాష్ట్ర చందగడ తాలూకా ఘళేవాడి కాగా, అక్కడే ఆదివారం సాయంత్రం లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. కరోనా వైరస్ మహమ్మారి వచ్చాక యువత, మధ్య వయస్కుల్లో కూడా గుండెకు ముప్పు పెరిగిందని వైద్యులు చెబుతున్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధ తాళలేక దంపతులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా కొళ్లెగాలలోని నారాయణస్వామి గుడి వీధిలో జరిగింది. నాగేష్ (56), అతని భార్య సత్యలక్ష్మి (46) దంపతులు. వీరు గత ఆరు నెలలుగా మైసూరులో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి కొళ్లెగాలకు వచ్చారు. ఉదయం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వ్యాపారం కోసం దంపతులు లక్షలాది రూపాయల మేర అప్పులు చేశారు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కొళ్లెగాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వీలింగ్ పోకిరీలకు శాస్తి



బైక్‌ను పైనుండి విసిరేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: ఇటీవల ఏ రహదారిపై చూసినా వీలింగ్ చేసే ఆకతాయిల సంఖ్య ఎక్కువవుతోంది. వీలింగ్ తో వాహనదారులు, స్థానికులు విసిగిపోతున్నారు. పోలీసులు ఎంత గస్తీ చేస్తున్నా వీలింగ్‌ను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. అయితే వీలింగ్‌తో విసిగిపోయిన గ్రామస్తులు వీలింగ్‌కు పాల్పడుతున్న యువకుని నుండి బైక్ లాక్కుని బ్రిడ్జి మీద నుంచి విసిరేసిన సంఘటన నెలమంగల తాలూకా తుమకూరు హైవేపై చోటుచేసుకుంది. కొందరు యువకులు వీలింగ్ చేస్తూ రీల్స్ చేసుకుంటుండగా జనం కోపం పట్టలేక ఒక బైక్ లాక్కుని 30 అడుగుల బ్రిడ్జి పై నుండి విసిరేసారు. దీంతో భయపడిన యువకులు అక్కడి నుండి పరారయ్యారు.

రాజధానిలో అర్ధరాత్రి ఘోరం



- యువతిపై అత్యాచారం
- లిఫ్ట్ అడిగిన విద్యార్థిని, కాటేసిన మృగాడు
- బొమ్మనహళ్లిలో సంఘటన

బొమ్మనహళ్లి: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని దారుణ అత్యాచారం, హత్యపై దేశమంతటా ఆగ్రహ జ్వాల వెల్లువెత్తుతోంది. హంతకున్ని ఉరితీయాలంటూ వైద్యులతో సహా ప్రజాసంఘాలు ముమ్మరంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ సమయంలో సిలికాన్ నగరంలో మరో ఘోరం చోటుచేసుకుంది. యువతిపై ఓ దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పోలీసు స్టేషన్ పరిధిలోని బొమ్మనహళ్ళిలో శనివారం అర్ధరాత్రి దాటాక ఈ సంఘటన చోటుచేసుకుంది.

కారులో వస్తుండగా..

బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ పట్టణం వద్దనున్న ఓ ప్రైవేటు కళాశాల్లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న యువతిపై లైంగిక దాడి జరిగింది. శనివారం రాత్రి ఆమె స్నేహితులతో కలిసి కోరమంగళలో ఉన్న పబ్‌కు వెళ్లింది. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో స్నేహితునితో కలిసి కారులో ఇంటికి బయల్దేరింది. కోరమంగళలో కారు అదుపు తప్పి ఓ ఆటోను కొట్టింది. దీంతో ఆటోలోని వారు కారులో ఉన్న యువతీ యువకునితో గొడవ పడ్డారు. తరువాత యువతి పోలీసులకు ఫోన్ చేయడంతో ఆటో డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. యువతి నడుచుకుంటూ ముందుకు వెళ్లింది. ఓ బైకిస్టు కనిపించడంతో ఆమె లిఫ్టు అడగడంతో అతడు సరేనని తీసుకెళ్లాడు. బొమ్మనహళ్ళి సమీపంలోని నిర్జన ప్రాంతంలోకి యువతిని తీసుకెళ్లడంతో యువతి గట్టిగా ప్రశ్నించడంతో కొట్టాడు. ఆపై అత్యాచారం చేసి పారిపోయాడు. యువతి తన మొబైల్‌లో ఎస్‌ఓఎస్ బటన్‌ను నొక్కడంతో జీపీఎస్ ద్వారా యువతి స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. స్పృహ తప్పి పడిపోయిన యువతిని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

5 బృందాలతో గాలింపు

విషయం తెలుసుకున్న హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. యువతిపైన అత్యాచారం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. దుండగుడు ఒక్కడేనని నగర ఉత్తర విభాగం అదనపు పోలీసు కమిషనర్ రమణగుప్త తెలిపారు. నిందితుని గాలింపునకు 5 బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.



అత్యాచారాలకు నిరసనగా బెంగళూరులో మెడికోల ఆందోళన

పసిమొగ్గపై అకృత్యం

కోలారు: జిల్లాలో ముళబాగిలు తాలూకాలోని ఓ గ్రామంలో 7 సంవత్సరాల బాలికపై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. వివరాలు.. బాలిక గ్రామంలోని పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. గార పని ఉందా అని అడుగుతూ నిందితుడు (21) బాలిక తండ్రి వద్దకు వచ్చాడు. ఈ సమయంలో బాలికకు మొబైల్‌ఫోన్‌లో గేమ్స్ చూపిస్తానని ఇంటిపైకి తీసుకు వెళ్లి అత్యాచారం చేశాడు. బాలికకు రక్తస్రావం జరిగి ఏడవడంతో ఇరుగుపొరుగు రాగా దారుణం బయటపడింది. వెంటనే నిందితున్ని నిర్బంధించారు. బాలికకు పట్టణ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కామాంధున్ని అరెస్టు చేశారు.

టెన్త్ బాలికపై లైంగికదాడి

మైసూరు: నీ తల్లిని చంపుతానంటూ బెదిరించి మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆమె ఫొటోలను వైరల్ చేసిన కీచకుడిని జిల్లాలోని నంజనగూడు పోలీసులు అరెస్ట్ చేశారు. నంజనగూడు హౌసింగ్ బోర్డు కాలనీ నివాసి ఆదర్శ్ అనే యువకుడు ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివే 15 ఏళ్ల బాలికను బైక్‌లో వెంటాడేవాడు. చెప్పినట్లు వినకపోతే నీ తల్లిని చంపుతానని బెదిరించాడు. దీంతో భయపడిన బాలిక అతను పిలిచిన చోటకల్లా వెళ్లింది. ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె నగ్నఫొటోలను పాఠశాల హెచ్‌ఎంకు పంపాడు. దీంతో ఆమె తల్లిని పాఠశాలకు పిలిపించి సమాచారం అందించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దుండగున్ని అరెస్టు చేశారు.

నాకు నువ్వు.. నీకు నేను



చిక్కమగళూరులో ఓ తీగపై కనువిందు చేసిన రామచిలుకల జంట

చెన్నపట్టణ టికెట్‌పై చర్చ

దొడ్డబళ్లాపురం: తనకు ఎమ్మెల్యే కావాలనే ఆకాంక్ష లేదని, అయితే చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో జేడీఎస్ నుండి టికెట్ ఇస్తే తాను పోటీ చేయాలని పార్టీలో చర్చ జరిగిందని జేడీఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి అన్నారు. ఆదివారం బెంగళూరులో పార్టీ ఆఫీసులో సమావేశంలో మాట్లాడారు. చెన్నపట్టణ ఉప ఎన్నికలో ఎవరు పోటీ చేయాలనేది జేడీఎస్- బీజేపీ కూటమి నిర్ణయిస్తుందన్నారు. చెన్నపట్టణ నుంచి కుమారస్వామి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, అక్కడ 70 శాతం ఓట్లు జేడీఎస్ వే అన్నారు.

ప్రాసిక్యూషన్‌పై న్యాయ పోరాటమే

- నేడు హైకోర్టులో సీఎం సిద్దు పిటిషన్?
- స్టే, లేదా కొట్టివేతకు వినతి
- జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు



శివాజీనగర: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాల స్వీకారంలో తన ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ గెహ్లాట్ అనుమతినివ్వడాన్ని ప్రశ్నిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం కోర్టును ఆశ్రయించనున్నారు. గవర్నర్ ఆదేశాలపై స్టే, లేదా కొట్టి వేయాలని హైకోర్టులో పిటిషన్ సమర్పించనున్నారు. కాంగ్రెస్ నేతలు, సీనియర్ వకీళ్లు అయిన కపిల్ సిబాల్, అభిషేక్ మను సింఘ్వి ఢిల్లీ నుంచి ఆదివారం బెంగళూరుకు వచ్చారు. వీరి ద్వారా సిద్దరామయ్య న్యాయ పోరాటం గురించి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం సైతం సిద్దరామయ్యకు అండగా ఉంటుందని నాయకులు చెబుతున్నారు. ముడా కేసును, ఫిర్యాదిదారుల లేఖలను, ప్రాసిక్యూషన్ ఆదేశాలను లోతుగా అధ్యయనం చేసి ఎలా ముందుకెళ్లాలనేది సిబాల్, సింఘ్వీలు మంతనాలు జరిపారు. రాష్ట్రానికి చెందిన రాజ్యాంగ, న్యాయ నిపుణులు కూడా పాల్గొన్నారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేశాక ఏం జరగబోతుంది అనేది ఉత్కంఠగా మారింది.



సిద్దరామయ్యకు మద్దతుగా మైసూరులో ధర్నా

ప్రజా ప్రతినిధుల కోర్టులో..

ముడా కేసులో సిద్దరామయ్యపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు అనుమతి కోరుతూ ప్రజా ప్రతినిధుల కోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 20న జడ్జి ఆదేశాలిచ్చే అవకాశం ఉంది. అంతలోపే తమ విన్నపాలను ఆలకించాలని సిద్దరామయ్య సోమవారం మధ్యంతర పిటిషన్ సమర్పించే అవకాశాలు ఉన్నాయి. సామాజిక కార్యకర్తలు స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహాం కోర్టులో సీఎంపై ప్రైవేట్ కేసు వేసి ఎఫ్‌ఐఆర్ నమోదుకు విజ్ఞప్తి చేశారు.

అన్ని జిల్లాల్లో ధర్నాలు: డీసీఎం

కాంగ్రెస్ పార్టీ ఆందోళనలను కొనసాగిస్తోంది. సోమవారం అన్ని జిల్లాల్లో బీజేపీ, కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా ధర్నాలు జరుపనున్నారు. మైసూర్ బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. ఆదివారం బెంగళూరులో కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఈ విషయాలను తెలిపారు. ప్రతి జిల్లాలో ధర్నాలు చేసి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి భంగం కలుగుతోంది. వివాదం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మహాత్మాగాంధీ బాటలో అహింసా పద్ధతిలోనే మా పోరాటం జరుగుతుంది అని చెప్పారు.


బెంగళూరుపై జికా పంజా

- జిగణిలో ఐదుగురికి పాజిటివ్

బనశంకరి: కన్నడనాట ఒకవైపు డెంగీ హడలెత్తిస్తుండగా మరోవైపు జికా జ్వరం వ్యాపిస్తోంది. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో 7 మందికి జికా సోకిన కేసులు వెలుగుచూశాయి. డెంగీ, మలేరియా జ్వరాలు కూడా ప్రబలడంతో ప్రజలు హడలిపోతున్నారు. జికా రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లాలని వైద్యారోగ్యశాఖ తెలిపింది. తల నొప్పి, కళ్లు ఎర్రబడటం, జ్వరం, శరీరమంతా తట్టు తరహాలో చిన్న చిన్న బొబ్బలు, ఒళ్లు నొప్పులు, విరేచనాలు జికా జ్వరం లక్షణాలు.

గర్భిణిలు జాగ్రత్త: ఆరోగ్యమంత్రి

బెంగళూరులో అధిక బాధితులు బయటపడ్డారు. జిగణిలో 5 జికా వైరస్ కేసులు వెలుగుచూశాయని ఆరోగ్యశాఖమంత్రి దినేశ్ గుండూరావ్ తెలిపారు. రెండు వారాల్లో 5 మందికి సోకినట్లు చెప్పారు. బాధితులు భయపడవద్దని, కానీ గర్భిణిలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. శివమొగ్గలో 2, జిగణిలో 5 కేసులు వెలుగుచూశాయన్నారు. జిగణిని జికా కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించి ఆరోగ్యశాఖ నిఘా పెట్టిందని తెలిపారు. జికా బాధితులు, వారి సన్నిహితుల రక్తపు నమూనాలను వైద్యసిబ్బంది సేకరించారన్నారు. రోగి ఇంటి నుంచి మూడు కిలో మీటర్ల పరిధిలో ప్రజలను పరీక్షలు చేపట్టాలి. అంతేగాక ఈ ప్రాంతాన్ని కంటైన్మెంట్ జోన్‌గా పరిగణిస్తామని, ప్రజలు ఇంటి పరిసరాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.



హెయిర్ కటింగ్‌పై గొడవ

- దళిత యువకుని హత్య

సాక్షి,బళ్లారి: కొప్పళ జిల్లాలో దారుణం జరిగింది. దళిత యువకునికి క్షవరం చేసే విషయంలో బార్బర్ షాపులో గొడవ హత్యకు దారి తీసింది. కొప్పళ జిల్లా యలబుర్గా తాలూకా సంగనహాలదళ్లిలో ముత్తణ్ణ అనే క్షురకుడు దళిత యువకుడు యమనూరుస్వామికి కటింగ్ చేయడానికి నిరాకరించారు. దీంతో అతడు ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. ముత్తణ్ణ కోపం పట్టలేక కత్తితో పొడిచి హత్య చేశాడు. యలబుర్గి పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేశారు. హత్యను హోంమంత్రి పరమేశ్వర్ తీవ్రంగా ఖండించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్నా ఇలాంటి దురాగతాలు జరగడం సహించరానిదని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, నిందితునిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



హతుడు, నిందితుడు



ఆదివారం సాయంత్రం బెంగళూరులో వర్షం కురిసింది. నాయండహళ్లి వంతెనపై వాననీరు

5 రోజులు భారీ వర్ష సూచన

యశవంతపుర: రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఐదురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు బెంగళూరు వాతావారణశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 22 వరకు భారీగా వానలు పడనున్నాయి. సోమవారం కరావళి జిల్లాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు. 20, 21న కరావళిలో కుండపోత పడవచ్చని తెలిపారు. ఇక ఉత్తర కర్ణాటక భాగంలో 20 వరకు భారీ వానలు పడవచ్చు. 18, 19 తేదీల్లో బెంగళూరు సహా దక్షిణ భాగంలో ఎల్లో అలర్ట్‌ను జారీ చేశారు.

తీర్థయాత్ర నుంచి తిరిగి రాని లోకాలకు



ప్రమాదంలో మృతులు (ఫైల్)

- కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- అసువులు బాసిన కుటుంబం
- గదగ్ జిల్లాలో దుర్ఘటన



నుజ్జయిన కారు, ఆర్టీసీ బస్సు

రాయచూరు రూరల్, యశవంతపుర: తీర్థయాత్రకు వెళ్తూ ఓ కుటుంబం తీరని విషాదానికి గురైంది. ఆర్టీసీ బస్ కారును ఢీకొన్న ఘోర ప్రమాదంలో తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలు దుర్మరణం పాలైన ఘటన గదగ్ జిల్లాలో జరిగింది.

వివరాలు.. ఆదివారం ఉదయం వాయువ్య కర్ణాటక ఆర్టీసీకి చెందిన బస్సు ఇలకల్ నుంచి హుబ్లీకి వెళ్తోంది. హుబ్లీ- షోలాపూర్ హైవేలో నరగుంద తాలూకా కోణ్ణూరు వద్ద ఎదురుగా వస్తున్న కారును అతి వేగంగా ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న హావేరి నగరానికి చెందిన రుద్రప్ప అంగడి (55) భార్య రాజేశ్వరి (45), కూతురు ఐశ్వర్య (16), కుమారుడు విజయ్ (12) తీవ్ర గాయాలతో మృత్యువాత పడ్డారు.

కళాపూర్‌కు వెళ్తుండగా

వీరు శ్రావణమాసం పూజలు చేయడానికి కళాపూర్ బసవేశ్వర దేవాలయ దర్శనానికి వెళుతున్నారు. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడమే దుర్ఘటనకు కారణమని స్థానికులు తెలిపారు. నరగుంద పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మరికొందరేమో కారు నడుపుతున్న రుద్రప్ప అంగడి నిద్రమత్తులో బస్సును ఢీకొట్టినట్లు చెప్పారు. రుద్రప్ప ఎలెక్ట్రికల్ కాంట్రాక్టర్ అని, హావేరి జిల్లా కాంట్రాక్టర్ల సంఘంలో సభ్యుడని తెలిసింది. ఈ మరణవార్తను బంధువులు రుద్రప్ప తల్లిదండ్రులకు చెప్పలేదు. వారు దూరంగా తీర్థయాత్రకు వెళ్లారని తెలిపారు.



ప్రమాదం జరిగిన స్థలంలో బస్సు, కారు

కూర్చున్నవారు అలాగే...

రెండు వాహనాలు అతి వేగంతో ఢీకొట్టుకోగా ఆ తాకిడికి కారులో సీట్లలో కూర్చున్నవారు అలాగే ప్రాణాలు కోల్పోయారు. ఆ దృశ్యాన్ని చూసిన జనం భయాందోళనకు గురయ్యారు. బస్సు వేగంలో నియంత్రించలేక కారును ఢీకొని రోడ్డు పక్కలోని గుంతలోకి దిగింది. బస్సులోని ప్రయాణికులకు చిన్న చిన్న గాయాలు తగిలాయి. యాక్సిడెంట్ తరువాత బస్సు కండక్టర్, డ్రైవర్ పరారయ్యారు.

బాహుబలి



గోమటేశ్వరునికి పూజ చేసిన దృశ్యం

మండ్య: జిల్లాలోని కేఆర్ పేట తాలూకాలోని ప్రముఖ ధార్మిక పుణ్యక్షేత్రం బసది గొమ్మటు బాహుబలి విగ్రహానికి జైనులు ఆదివారం నవ కలశాలతో పాదపూజ చేశారు. తరువాత కావేరి నదికి వాయనం సమర్పించారు. బసది హొసకోటి భగవాన్ బాహుబలి దిగంబర జైన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో శ్రవణ బెళగొళకు చెందిన అభినవ చారుకీర్తి మహాస్వామీజీ ఆధ్వర్యంలో పూజలు, వాయన కార్యక్రమం నెరవేర్చారు. జైన మునులు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నన్ను బెదిరిస్తోంది

- కేంద్రమంత్రి కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు తనను బెదిరిస్తున్నారని కేంద్రమంత్రి కుమారస్వామి ఆరోపించారు. బెంగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం బెదిరింపులకు తాను బెదిరేది లేదన్నారు. తనపై ఉన్న పాత కేసులను తిరగతోడుతున్నారని, సుప్రీంకోర్టులో ఉన్న కేసును అడ్డం పెట్టుకుని గవర్నర్‌ను అవమానించడంతోపాటు తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. 2006లో తనపై మైనింగ్ ఆరోపణలు చేసినప్పుడు కూడా బెదరకుండా ఎదిరించానన్నారు. సిద్దరామయ్యకు డీకే శివకుమార్ వల్లే పదవి గండం ఉందని ఆ విషయం ఆయన గ్రహించలేకపోతున్నారన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రి స్వచ్ఛతపై దృష్టి పెట్టండి



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి

మాలూరు: డెంగీ కేసులు రోజు రోజుకు అధికమవుతున్న నేపథ్యంలో ఆస్పత్రి స్వచ్ఛతపై దృష్టి పెట్టాలని జిల్లా ఉప విభాగ అధికారి డాక్టర్ మైత్రి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సభాంగణంలో ఆరోగ్య కవచ సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డెంగీ కేసులను తగ్గించడానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఆస్పత్రిలో పేద రోగులకు తగిన వైద్య అందాలని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె రమేష్, హరిప్రసాద్, ప్రభుత్వ ఆస్పత్రి పాలనాధికారి డాక్టర్ వసంత్ కుమార్, తాలూకా ఆరోగ్యాధికారి రమేష్‌బాబు, ఎస్ఐ గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత ప్రొఫెసర్ మృతి

మైసూరు: మైసూరు విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్, ప్రగతిశీల మేధావి మహేష్ చంద్ర గురు (68) శనివారం రాత్రి గుండె పోటుతో నగరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన గ్యాంగ్రీన్‌తో బాధపడుతుండేవారు. 1980లో హైదరాబాద్‌లో పౌరసంబంధాల అధికారిగా సేవలందించిన ఆయన అనంతరం మంగళూరు వర్సిటీలో జర్నలిజం ప్రొఫెసర్‌గా పత్రికారంగంలోకి అడుగుపెట్టారు. అనంతరం మైసూరు వర్సిటీకి బదిలీ అయి 2019లో పదవీ విరమణ చేశారు. అనంతరం ప్రగతిశీల పోరాటాల్లో చురుగ్గా పాల్గొని గుర్తింపు పొందారు. కమ్యూనిస్ట్ భావజాలాన్ని సమర్థించే ఆయన నాడహబ్బ దసరా వేళలో మహిషా దసరా ఆచరణలో ప్రముఖ పాత్ర పోషించారు.

భక్తి శ్రద్ధలతో రుద్ర పారాయణం



పాల్గొన్న రుత్వికులు

బాగేపల్లి: పట్టణంలోని శంకరమఠం, గడిదం గాయత్రి సముదాయ భవనంలో బెంగళూరు రుద్ర బళగకు చెందిన 150 మంది, బాగేపల్లి బ్రాహ్మణ మహాసభకు చెందిన 50 మంది సంయుక్త ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం 200 మంది రుత్వికులతో రుద్రపారాయణం భక్తి శ్రద్ధలతో జరిగింది. బాగేపల్లి నివాసి శేషగిరి బాబు, భీమేష్, రఘు, తాలూకా బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు మునిరామయ్య, కార్యదర్శి ఎస్.నాగరాజు, వైఎస్ కృష్ణకుమార్, పీఎల్ నాగరాజారావు, రాఘవేంద్రరావు, బీఎస్ కృష్ణ, కే.ప్రసాద్, చంద్రమౌళి, దత్తాత్రేయ, సీతారాం, నంజుండశర్మ, టీఎన్ రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌లైన్ ట్రయల్ రన్ విజయవంతం

బొమ్మనహళ్లి: నమ్మమెట్రో హసిరు మార్గం నాగసంద్ర నుంచి మాదావరద వరకు నమ్మ మెట్రో గ్రీన్‌లైన్ విస్తరణ మార్గంలో ట్రయల్ రన్ విజయవంతమైంది. ఉదయం 6 గంటలకు ఆరు బోగీలతో ఈ రైలు మెట్రో స్టేషన్‌కు వచ్చే వరకు సిగ్నళ్లను పరిశీలించారు. ప్రస్తుతం ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయి. దీంతో నమ్మ మెట్రో ఎక్స్ ఖాతాలో ట్రయల్ విజయవంతమైందని పేర్కొంది. గరిష్టంగా 35 కి.మీ వేగంతో వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసు అధికారులు

మండ్య: వాటర్ మీటర్ పరిశీలనకు వచ్చినట్టుగా చెప్పి ఇంట్లోని వారిని మోసగించి నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేసుకుని పరారైన నిందితుడిని మండ్య పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన రవి (29) గత నెల 26న స్వర్ణసంద్ర బడావణెలోని పుష్పవతి అనే మహిళ ఇంటికి మరో ఇద్దరితో వచ్చి వాటర్ మీటర్ పరిశీలనకు వచ్చినట్లు చెప్పి, చూపాలని కోరారు. నిందితుల్లో ఇద్దరు వ్యక్తులు ఇంటిపైకి వెళ్లి ట్యాంక్ పరిశీలిస్తున్నట్లు నటించగా, మరొకరు ఇంటి లోపలకు వెళ్లి గదిలోని రూ.50 వేల నగదు, 180 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేసుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు బెంగళూరులోని అత్తిబెలెలో నిందితుడు రవిని అరెస్ట్ చేసి విచారణ జరపగా, చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.10 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

మండ్య: ఇంటి వద్ద కట్టి ఉంచిన ఆవును చిరుత చంపి తిన్న ఘటన తాలూకాలోని బెళ్లాండగెరె గ్రామంలో ఆదివారం ఉదయం జరిగింది. గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ తమ ఇంటి వెనుక భాగంలో కట్టివేసిన ఆవుపై చిరుత దాడి చేసి చంపి తింది. పగటి పూటే ఇలా జరగడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

సండూరు.. కనీస సౌకర్యాలు కరువు



రోడ్డు పక్కనే కూరగాయల అమ్మకాలు



అధ్వానంగా ఉన్న పట్టణంలోని ఓ రోడ్డు

- పట్టణంలో రోడ్లు అస్తవ్యస్తం
- అధ్వానంగా ఆర్‌టీసీ బస్టాండు
- రోడ్డుపైనే కూరగాయల మార్కెట్
- పేరుకే ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సాక్షి,బళ్లారి: పేరు గొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో. అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు, దేశంలో అధిక సంపదను సృష్టిస్తున్న ప్రాంతంగా గుర్తింపు, దేశంలోనే పేరుగాంచిన స్టీల్ ఇండస్ట్రీ అయిన జిందాల్ సంస్థ ఉన్న నియోజకవర్గం, ఇలా చెప్పుకుంటూ పోతే వేల కోట్లు కాదు లక్షల కోట్ల సంపదను సృష్టిస్తున్న సండూరులో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో స్థానికులు పాలకుల తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. రాజ మహారాజులు పాలించిన ప్రాంతం, పేరుకే సండూరు రాజులు, లాడ్ కుటుంబాలు అని గొప్పలు చెప్పుకుంటారే కాని అక్కడ జనం పడుతున్న ఇబ్బందులు ఆ రెండు కుటుంబాలు నియోజకవర్గాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవాలనుకుంటున్నదే కాని నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి ఆలోచించడం లేదని అక్కడ సామాన్య ప్రజల నుంచి వెలువడుతున్న మాట. ఘోర్పడే, లాడ్ కుటుంబాలు ఈ నియోజకవర్గాన్ని శాసిస్తున్నాయి. ఈ రెండు కుటుంబాలకు చెందిన వారే అక్కడ రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు గడించారు. రెండు కుటుంబాలు సంపదలో పోటీ పడి సంపాదించుకున్నారు. మైనింగ్ వ్యాపారంలో అపర కుబేరులుగా ఎదిగారు.

నియోజకవర్గ ప్రజల బాధలు వర్ణనాతీతం

సండూరు నియోజకవర్గంలో కనీస సౌకర్యాలు లేక జనం పడుతున్న బాధలు వర్ణించలేని విధంగా మారాయి. పేరుకే సండూరులో ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేశారు కాని అక్కడ వైద్యులు పని చేయడం అంతంత మాత్రమే. సదుపాయాలు కూడా లేకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. సండూరులో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద ఎత్తున పన్నుల రూపంలో ఆదాయం జమ అవుతుంటుంది. జిందాల్ కంపెనీ కూడా ఈ నియోజకవర్గంలో ఉండటంతో ఆ సంస్థ నుంచి వందల కోట్ల రూపంలో పన్నులు చేరుతుంటాయి. ఎన్నో స్టీల్ ఇండస్ట్రీస్ కూడా వెలిశాయి. ఇంత పెద్ద ఎత్తున సంపద ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్య విద్యావంతులు, అవిద్యావంతులు కూడా ఇక్కడకు వచ్చి ఏదో రకంగా పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వినాసం ఉంటున్న జనం సండూరు అభివృద్ధిపై తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముందు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల్లో అది చేస్తాం..ఇది చేస్తాం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కాలం గడిపి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సౌకర్యాలు కరువైన ఆర్‌టీసీ బస్టాండు

ప్రాసిక్యూషన్ వెనక్కి తీసుకోవాలి





మాట్లాడుతున్న మంత్రి సుధాకర్, ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

- కాంగ్రెస్ కార్యకర్తల భారీ ర్యాలీ

చింతామణి: సీఎం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని వెంటనే గవర్నర్ వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర మంత్రి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గ్యారెంటీ పథకాలతో ప్రజల మన్ననలను పొందుతుండటాన్ని సహించలేక బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, మంత్రి సోదరుడు బాలాజీ, నగర సభ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకోవాలి

మైసూరు: సీఎం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని వెంటనే గవర్నర్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నగరంలో కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. నగరంలోని కాంగ్రెస్ భవన్ ఆవరణలో సమావేశమైన ఆందోళనకారులు బీజేపీ, జేడీఎస్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకు నేతృత్వం వహించిన పంచ గ్యారెంటీ పథకాల అమలు సమితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ పుష్పా అమరనాథ్ మాట్లాడుతూ... గవర్నర్ పాలనను గాలికొదిలి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జేడీఎస్, బీజేపీ నాయకులు సీఎంను గద్దె దించాలని పన్నుతున్న కుట్రలు ఫలించబోవన్నారు. ఆందోళనలో మహిళా నాయకురాళ్లు పుష్పవల్లి, లతాసిద్దశెట్టి, లతామోహన్, మంజుల, రాజేశ్వరి, భవ్య, నాగరత్న, రాధామణి తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక ఖర్గే ఆక్రోశం

యశవంతపుర: సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వడం సరికాదు అని మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. బెంగళూరులో మాట్లాడుతూ బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో సీబీఐ, ఈడీ, ఐటీ, గవర్నర్‌ను అస్త్రంగా వాడుకొంటుందని ఆరోపించారు. గవర్నర్ పదవిని దుర్వినియోగం చేయరాదన్నారు.

ప్రభుత్వాన్ని కూలదోయడానికి గవర్నర్ కుట్ర

బాగేపల్లి: ఆర్‌టీఐ కార్యకర్త ఫిర్యాదు మేరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతివ్వడం ప్రజా ప్రభుత్వాన్ని పతనం చేసే కుట్ర అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎంపీ మునివెంకటప్ప విమర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీయేతర ప్రభుత్వాలను దొడ్డిదారిన కూల్చేందుకు ప్రయత్నిస్తున్న ఎన్‌డీఏ పార్టీల కుట్రలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముడా, వాల్మీకి తదితర అన్ని కుంభకోణాలపై హైకోర్టు జడ్జి నేతృత్వంలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, పరస్పరం బురద చల్లుకునే ఇలాంటి చర్యలకు వెంటనే అధికార, విపక్షాలు స్వస్తి పలికి ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు.

నేడు బీజేపీ ఎమ్మెల్యేల ధర్నా

దొడ్డబళ్లాపురం: ముడా స్కాంలో కాంగ్రెస్ ధర్నాలను ఖండిస్తూ సోమవారం బీజేపీ ఎమ్మెల్యేలు విధానసౌధ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు ధర్నా చేయనున్నారు. గవర్నర్ నిర్ణయాన్ని శ్లాఘిస్తూ, కాంగ్రెస్ ప్రవర్తనను ఖండిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. సీఎం సిద్దరామయ్య తక్షణమే రాజీనామా చేయాలని డిమాండు చేస్తామన్నారు. గతంలో గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ సీఎం యడియూరప్ప ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చినప్పుడు సిద్ధరామయ్య స్వాగతించారని తెలిపారు.

రిజర్వేషన్ అనేది సామాజిక న్యాయం

బొమ్మనహళ్లి: అణిచివేతకు గురైన దళిత, అట్టడుగు వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేయడంలో రిజర్వేషన్ ప్రక్రియ ఒక భాగమని దళిత నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు ఎల్.హనుమంతయ్య అన్నారు. బెంగళూరు నగరంలోని గాంధీ భవనంలో ఆదివారం మాదిగ పొలిటికల్ ఫోరం, శూద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిజర్వేషన్ తీర్పుపై ఆయన మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడచినా దేశంలో దళితులకు సామాజిక హోదా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లలో సమానత్వం కల్పించలేదన్నారు. 30 ఏళ్ల క్రితం కర్ణాటకలో ప్రారంభమైన అంతర్గత రిజర్వేషన్ల పోరాటం ప్రస్తుతం ముగింపు దశకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో మంత్రి ఆర్.బీ.తిమ్మాపూర్, కేంద్రమాజీ మంత్రి ఎ.నారాయణ స్వామి, మాజీ ఎమ్మెల్యేలు ధర్మసేన, వీరభద్రప్ప, హలరవి, విశ్రాంత ఐఏఎస్‌లు గోనల్ బిమప్ప, విజయ్‌కుమార్ సింహా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

సర్వతోముఖాభివృద్ధికి కంకణం

- కేంద్ర జలశక్తి, రైల్వే సహాయ మంత్రి సోమణ్ణ

తుమకూరు: తుమకూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున ఇక్కడ అవసరమైన మౌలిక సౌకర్యాలు, రైల్వే, జాతీయ రహదారుల అభివృద్ధి, వసంతనరసాపురలో లాజిస్టిక్ పార్క్ నిర్మాణం, హెచ్ఏఎల్ విస్తరణ, ఉపాధి కల్పన తదితరాలకు ముందు చూపుతో పథకాలను అమలు చేస్తామని కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయమంత్రి వీ.సోమణ్ణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో తమ నూతన కార్యాలయాన్ని పూజ చేసి ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు.

దక్షిణ భారతంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో బెంగళూరు తర్వాత తుమకూరు ఉందన్నారు. జిల్లా రైతుల శ్రేయస్సును కాపాడే ఉద్దేశంతో కొబ్బరి రైతుల అనుకూలం కోసం 10,500 మెట్రిక్ టన్నుల కొబ్బరి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం కల్పించామన్నారు. ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి జిల్లా రోడ్ల అభివృద్ధి గురించి చర్చించగా, మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా తుమకూరు రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించడంతో పాటు బెంగళూరు–తుమకూరు మధ్య త్వరలో మెము రైలు సేవలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈనెల 24న సాయంత్రం రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు స్టాపింగ్‌కు తాను పచ్చజెండా చూపుతానన్నారు. ఎమ్మెల్యేలు జీబీ జ్యోతిగణేష్, సురేషగౌడ, సీబీ సురేష్‌బాబు, టీబీ జయచంద్ర, మాజీ ఎంపీ జీఎస్ బసవరాజు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు హెచ్ఎస్ రవిశంకర్ హెబ్బాక, ఎమ్మెల్సీలు చిదానందగౌడ, ఆర్.రాజేంద్ర, మాజీమంత్రి బీసీ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయంలో పూజ చేస్తున్న సోమణ్ణ తదితరులు

గవర్నర్ తీరుపై నిరసన

మండ్య: సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆదివారం జిల్లాలోని మళవళ్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే పీఎం నరేంద్రస్వామి నాయకత్వంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని తాలూకా పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించిన ఆందోళనకారులు అనంతరాం సర్కిల్‌లో మానవహారం నిర్మించి గవర్నర్, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరు కార్యకర్తలు పొర్లుదండాలు పెట్టారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వాన్ని కూలదోసే కుట్ర ఇది అని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం తాలూకా కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ మరితిబ్బేగౌడ, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి బీఎస్ శివణ్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డయ్య, సీపీ రాజు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు వార్తలు...

26 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కోలారు: శ్రీ ఆచార్య ప్రభోదానంద యోగీశ్వర దివ్య ఆశీస్సులతో నగరంలోని కీలుకోటలో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు కృష్ణ జన్మాష్టమి మహోత్సవాల సందర్భంగా నగర వ్యాప్తంగా వివిధ కార్యాలయాలు, సంఘ సంస్థలకు ఆహ్వానం పత్రికలు అందజేశారు. ఆదివారం నగరంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐకి ఆహ్వాన పత్రికను అందించిన ప్రభోద సమితి సభ్యులు నగరంలోని కీలుకోట అంతరగంగ రహదారి ఎస్ రామయ్య కాలనీలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26 నుంచి ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం ఉదయం 10 గంటలకు భగవద్గీత శ్లోకాలు, భావార్థ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న గురువారం ఉదయం 10 గంటలకు జ్ఞాన వాహిని ఎంపిక చేసిన గీత గాయన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదే రోజున పాఠశాల విద్యార్థుల నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న మధ్యాహ్నం 1 గంటకు శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సేవా సమితికి చెందిన వెంకటరాయప్ప, గంగరాజు, మురళి, మధు, చంద్రు తదితరులు ఉన్నారు.



ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

పంటలు బాగా పండాలని పూజలు



పూజలు నిర్వహించిన దృశ్యం

కోలారు : పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ తాలూకాలోని తిమ్మనాయకనహళ్లి అమాని అరసీకెరె వద్ద ఉన్న పురాతన దేవాలయం శ్రీ హొన్నమ్మ, చిన్నమ్మ దేవికి విశేష పూజలు చేశారు. జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షురాలు రత్నమ్మ నంజేగౌడ పూజాది కార్యక్రమాలను నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజా కార్యక్రమంలో గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ, అంజిగౌడ, హెచ్ చలపతి, కృష్ణప్ప, గ్రామ పంచాయతీ సభ్యుడు మునిరాజు, సతీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాపన వేడుకలో నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కోలారు : తాలూకాలోని నరసాపురంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారు, శ్రీ కాలభైరవేశ్వర స్వామి దేవతల నూతన విమాన గోపుర, కలశ, ధ్వజస్తంభ స్థిరబింబ, జీర్ణోద్ధారణ పూజా కార్యక్రమాలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో కోలారు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్ కుమార్, కేపీసీసీ సభ్యుడు నందిని ప్రవీణ్, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు చంజిమలై రమేష్, బంగారుపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్రగోపాలగౌడ, నరసాపురం సొసైటీ అధ్యక్షుడు ఖాజీ కల్లహళ్లి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశసేవకు సన్మానం

బొమ్మనహళ్లి: దేశ సేవ కోసం లాభదాయమైన విదేశీ ఉద్యోగాలను వదులుకున్న సుమారు 100 మందికి సన్మానం చేశారు. దొమ్మనూరులో ఉన్న బెంగళూరు ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమాండర్ వీకే, ఆచల్ చౌదరి, ఓం ప్రకాష్ ఖన్నా, కృష్ణదాస్ నాయర్, విప్పర్తి ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నంది ఘాట్‌లో విరిగి పడిన చెట్టుకొమ్మ

- నిలిచిపోయిన వందలాది వాహనాలు



ఘాట్ రోడ్డులో పడిపోయిన చెట్టుకొమ్మ

చిక్కబళ్లాపురం: విశ్వవిఖ్యాత నందికొండను వీక్షించడానికి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. వీకెండ్ అయితే రద్దీ ఎక్కువగా ఉంటుంది. శనివారం రాత్రి కురిసిన గాలి వానకు భారీ చెట్టు కొమ్మ రోడ్డుపై పడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న నందిగిరి ధామ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కార్యాచరణ చేపట్టారు. కొండ మీద నుంచి సూర్యోదయాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు నిరాశతో వెనుతిరిగారు.

సహకార రంగంలో విశ్వాసం ముఖ్యం



విద్యార్థులకు పురస్కారాలు అందించిన దృశ్యం

బనశంకరి: సహకార రంగంలో విశ్వాసం, కష్టమర్ల హితరక్షణ ముఖ్యమని శ్రీచరణ్ సౌహర్ద కో–ఆపరేటివ్ బ్యాంక్ సంస్థాపక అధ్యక్షుడు బీవీ.ద్వారకనాథ్ తెలిపారు. శ్రీ చరణ్ సౌహర్ద కో–ఆపరేటివ్ బ్యాంకు 28వ సర్వసభ్య సమావేశం సందర్భంగా 2024లో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో ప్రతిభ కనబరిచిన బ్యాంకు సభ్యులు విద్యార్థులకు బీవీ.ద్వారకనాథ్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు పాఠ్యేతర అంశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. శ్రీ చరణ్ సౌహర్ద కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఈసారి రూ.2.89 కోట్ల నికర లాభం గడించిందని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత బీకే.శ్రీనివాస్, బ్యాంక్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: గత కొన్ని రోజులుగా ప్రజలను బెంబేలెత్తిస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కిన ఘటన చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకా సత్తెగాల గ్రామంలో జరిగింది. సత్తెగాల, చెలువనహళ్లి, సరగూరు, జాగేరి, ధనగెరె గ్రామాల్లో గత 15 రోజులుగా ఓ చిరుత గ్రామస్తులను ముప్పు తిప్పలు పెడుతోంది. ఈనేపథ్యంలో అటవీ అధికారులు సిబ్బందితో కలిసి సత్తెగాల గ్రామ పరిసరాల్లో బోను ఏర్పాటు చేయడంతో ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో బందీ అయింది. విషయం తెలియగానే అటవీ శాఖ ఆర్ఎఫ్ఓ భరత్, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని చిరుతను పాలార్ అడవికి తరలించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చిరుత దాడితో ఆవు మృతి

చిరుత దాడితో ఓ ఆవు మృతి చెందిన ఘటన జిల్లాలోని సాలిగ్రామ తాలూకా దేవితంద్రె గ్రామంలో జరిగింది. గ్రామ నివాసి రైతు మహేష్ పొలంలో ఆవు మేత మేస్తుండగా చిరుత దాడి చేసి చంపేసింది. చిరుత గత కొన్ని రోజులుగా గ్రామంలో పెంపుడు జంతువులపై దాడి చేస్తోంది. చిరుతను పట్టుకోవాలి గ్రామస్తులు అటవీ అధికారులను డిమాండ్ చేశారు.

సంస్కృతి, సాంప్రదాయాలు అలవరచుకోవాలి

కోలారు: విద్యార్థులు విద్యతో పాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని, ఉత్తమ పౌరుడుగా రూపుదిద్దుకోవాలని బంగారుపేట కన్నడ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణి తెలిపారు. ఆదివారం బంగారుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మన్వంతర ప్రకాశన ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞాన వికాస అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేవలం విద్యతోనే జ్ఞాన వికాసం సాధ్యం కాదు. వ్యక్తి తన జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే జ్ఞానం ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థులు ప్రతినిత్యం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లే సమయంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని వెళ్లాలన్నారు. ఇదే సమయంలో విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ప్రిన్సిపాల్ మాలిని, మన్వంతర ప్రకాశన అధ్యక్షుడు అనంతరాం, సంచాలకుడు మామి ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రుల సమ్మేళనం



కవయిత్రులు సత్కరించిన దృశ్యం

బనశంకరి: ఐఎస్ఓ గుర్తింపు పొందిన ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక కళాసంస్థ కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కవయిత్రుల కవి సమ్మేళనం ఘనంగా ముగిసింది. ఆదివారం బెంగళూరు నగరంలోని కళ్యాణనగర ఇంజోఏషియన్ అకాడమీ ప్రాంగణంలో కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మెన్ డాక్టర్ బొగ్గవరపు మాల్యాద్రి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కవి సమ్మేళనాన్ని మహిళా పారిశ్రామికవేత్త డాక్టర్ సుభాషిణి జాలరి, ప్రొఫెసర్ డాక్టర్. ఏకాంబరం, డాక్టర్. సుబ్రమణ్యం శర్మ ప్రారంభించారు. సమ్మేళనంలో తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం, ఆంగ్ల భాషల్లో 78వ స్వాతంత్ర్య భారతావనిలో మహిళల పాత్ర అనే అంశంపై తమ కవితలు వినిపించి ప్రశంసలు పొందారు. ప్రత్యేకంగా కవయిత్రుల సమ్మేళనం నిర్వహించడం పట్ల డాక్టర్ సుబ్రమణ్యశర్మ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ, డాక్టర్ ఏకాంబరం, ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ అంబికా అనంత్, డాక్టర్ సీ.నారాయణస్వామి, డాక్టర్ పత్తిపాక మోహన్, డా.రామేశర్మ తదితరులు పాల్గొని కవయిత్రులను సత్కరించారు. డాక్టర్ రత్నారెడ్డికి సమాఖ్య జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

క్లుప్తంగా

గవర్నర్ నిర్ణయంపై ఆగ్రహం



ఆందోళనలో పాల్గొన్న నాయకులు

గౌరిబిదనూరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్లో ఆదివారం అహింద నాయకులు ధర్నా నిర్వహించారు. తాలూకా బీసీ నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ...రాష్ట్ర సంక్షేమానికి కృషి చేస్తున్న సిద్దరామయ్యపై అపవాదులు మోపడం అన్యాయమన్నారు. గవర్నర్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాది రంగప్ప మాట్లాడుతూ... కేంద్రంలోని మతతత్వ పార్టీలు చేరి సిద్ద రామయ్యపై కుట్రలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కురుబ సమాజం నేతలు మైలారప్ప, బలరాం, లింగప్ప, బాలు, నాగరాజు, మహదేవ, రాము, రాజు, మారుతి, కాంత, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

భద్రా డ్యాంకు వాయనం



వాయనం సమర్పిస్తున్న మంత్రి దంపతులు

శివమొగ్గ: శివమొగ్గ, దావణగెరె జిల్లాల రైతుల జీవనాడిగా పేరొందిన భద్రా జలాశయం గరిష్ట నీటిమట్టానికి చేరడంతో ఆదివారం గనులు, భూవిజ్ఞాన శాఖ మంత్రి మల్లికార్జున్ వాయనం సమర్పించారు. దావణగెరె జిల్లా మద్దతుదారులతో కలిసి భద్రా డ్యాంకు విచ్చేసిన ఆయన ముందుగా గంగాపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన భార్య, ఎంపీ ప్రభా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. గతేడాది వర్షాభావంతో భద్రా డ్యాం పూర్తిగా నిండలేదు. డ్యాంలో నీటి కొరత ఉండేది. అయితే ఈసారి మంచి వర్షాలతో డ్యాం గరిష్ట నీటిమట్టానికి చేరువైంది. ఇప్పటికే డ్యాం నుంచి అదనపు నీటిని బయటకు వదులుతున్నారు. కాగా డ్యాంకు వాయనం సమర్పించేందుకు దావణగెరె జిల్లా ప్రజాప్రతినిధుల నుంచి పోటాపోటీ నెలకొంది. ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు తమ మద్దతుదారులతో విచ్చేసి డ్యాంకు వాయనాలు సమర్పించారు.

కోటగోడకు ముప్పు



పడిపోయిన రాళ్లు

పావగడ: రాజుల కాలంలో పాలేగాళ్ళు నిర్మించిన పురాతన కోట గోడ శనివారం రాత్రి కొంత మేర కూలిపోయింది. పావగడ పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ప్రసిద్ధమైన ఏడు చుట్ల కోట కూలి పోవడంతో స్థానిక చరిత్రకారులు, వాల్మీకి సంఘం నాయకులు ఆవేదన చెందారు. గోడ పక్కనే ఓ వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి జేసిబి యంత్రాలతో పునాదులు తవ్వడంతో కోట గోడ దెబ్బ తిని కూలి పోవడానికి కారణమైందని స్థానిక చరిత్ర పరిశోధకుడు చెలువ రాజన్ అభిప్రాయపడ్డారు. అందులోనూ ప్రాక్షికంగా కూలిన కోట అతి ప్రాచీన మైనదని, శత్రువులు చొరబడకుండా రెండు పొరలతో కట్టిన కోట అని తెలిపారు. కూలిన ఆ కోట గోడను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాచీన కోట గోడలను సంరక్షించడానికి పురావస్తుశాఖ ముందుకు రావాలన్నారు. ఇప్పటికే పావగడలో పలు కోటలు ధ్వంస మైనాయని తెలిపారు.

యువత పరిశోధనల్లో పాల్గొనాలి



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న అతిథులు

కృష్ణరాజపుర: యువత ఎక్కువగా పరిశోధనల్లో పాల్గొని తద్వారా దేశ అభివృద్ధికి సహకరించాలని ఇస్రో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పీజీ దివాకర్ పేర్కొన్నారు. ఆయన ఇక్కడి కేంబ్రిడ్జి కాలేజీలో ఏర్పాటు చేసిన 14వ స్నాతకోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. చంద్రయాన్-4 గురించి ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. తాము చంద్రయాన్ ద్వారా ఒక వస్తువును తేవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నామన్నారు. ఉపగ్రహ కేంద్రాన్ని ప్రారంభించాలనే ఉద్దేశాన్ని కూడా కలిగి ఉన్నామన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసే దిశలో కేంబ్రిడ్జి విద్యా సంస్థ మంచి పునాది వస్తోందన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషి శ్లాఘనీయం అన్నారు. కేంబ్రిడ్జి కాలేజీ అధ్యక్షుడు డీకే మోహన్, డాక్టర్ బాల సుబ్రమణ్యామూర్తి, సీఈఓ నితిన్ మోహన్, ప్రిన్సిపాల్ ఇందుమతి పాల్గొన్నారు.

జనసంద్రంగా లాల్‌బాగ్



పుష్పాలతో త్రివర్ణ శోభితం



గ్లాజ్‌హౌస్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ థీమ్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు



పార్లమెంట్ థీమ్ వద్ద సందర్శకుల రద్దీ

- వీకెండ్‌తో రద్దీ
- నేటితో ముగియనున్న ఫ్లవర్ షో

బనశంకరి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన 216వ ఫల పుష్ప ప్రదర్శన ఆబాల గోపాలాన్ని అలరించింది. ఈనెల 8న ప్రారంభమైన ఫ్లవర్‌షో సోమవారంతో తెరపడుతుంది. గత 10 రోజులుగా లక్షలాది మంది ప్రదర్శనను వీక్షించారు. విద్యార్థులు, ఐటీ బీటీ ఉద్యోగులు, దేశ విదేశాలనుంచి పర్యాటకులు సైతం ఫ్లవర్‌షోకు విచ్చేసి పుష్ప అందాలు, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, పార్లమెంటు పుష్ప ఆకృతుల థీమ్‌లను వీక్షించారు. 8 తేదీ నుంచి శనివారం వరకు 7 లక్షల మంది ప్రదర్శనను తిలకించారు. టిక్కెట్ల విక్రయాలు ద్వారా రూ.2.40 కోట్లు వసూలైందని ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీశ్ తెలిపారు. విధాన పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఫ్లవర్‌షోను వీక్షించి మెచ్చుకున్నారు. అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్, ఇటలీ దేశాలకు చెందిన పర్యాటకులు సైతం ఫ్లవర్ షోను వీక్షించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆదివారం సెలవు రోజు రావడంతో నగర వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఫ్లవర్ షోలో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

విషం తాగి సోదరుల బలవన్మరణం

మైసూరు: సోదరులిద్దరూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో జరిగింది. వివరాలు.. దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా ముండోడికి చెందిన ధర్మపాల్ ముండోడి, పుష్పా దంపతుల కుమారులు నాగేంద్ర (39), సనత్ (36) అనే ఇద్దరు అన్నదమ్ములు నగరంలో నివసిస్తున్నారు. తమ ఇంటిలో మానసికంగా కుంగిపోయి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుల అంత్యక్రియలను జిల్లాలోని గుండ్లుపేటలో నెరవేర్చారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కడుపునొప్పితో బాలిక...

కడుపునొప్పి తాళలేక ఓ బాలిక నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా హనూరు పోలీసు స్టేషన్ పరిధిలోని శాగ్య గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన భాగ్య (15) అనే బాలిక తరచు కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈక్రమంలో కడుపునొప్పి తీవ్రం కావడంతో తాళలేక కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. కాలిన గాయాలతో విలవిలలాడుతుండగా ఆమెను తల్లిదండ్రులు గమనించి కామగెరె హోలీక్రాస్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మరణించింది. హనూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

చిక్కలో భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి గంట పాటు ఎడతెరిపి లేని వర్షం పడింది. దీంతో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. నగరంలో స్టేడియం రోడ్డు, హెచ్ఎస్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కారు ఢీకొని బైకిస్టు మృతి



సర్దార్ బాషా (ఫైల్), మృతదేహం

గౌరిబిదనూరు: శనివారం సాయంకాలం 6 గంటల సమయంలో స్థానిక అలకాపురానికి చెందిన సర్దార్ బాషా (45) అనే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. పట్టణంలో గార పని చేసుకొని తిరిగి ఇంటికి వెళుతూ ఉండగా బర్జానకుంటె సమీపంలో వెనుక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు ఢీకొనింది. తీవ్ర గాయాలైన ఆయన మరణించాడు. మంచేనహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసి కారు, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇంటి పెద్ద మృతితో కుటుంబం రోడ్డున పడింది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

మైసూరు: అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసిన మైసూరు కువెంపునగర పోలీసులు నిందితుడి వద్ద నుంచి రూ.6 లక్షల విలువ చేసే గూడ్స్ వాహనం, రూ.1.20 లక్షల విలువ చేసే పల్సర్ బైక్‌ను స్వాధీన పరచుకున్నారు. జమ్మూ కశ్మీర్ నివాసి మహమద్ రమ్జాన్(21) అనే యువకుడు మైసూరు కువెంపునగరలోని శంకర్ బిల్డ్ ప్రొడక్ట్స్ కంపెనీకి చెందిన గూడ్స్ వాహనాన్ని చోరీ చేశాడు. ఈ విషయంపై కంపెనీ మేనేజర్ కువెంపునగర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్యాచరణ చేపట్టిన పోలీసులు దొంగను అరెస్ట్ చేసి గూడ్స్ వాహనాన్ని స్వాధీనపరచుకున్నారు. విచారణలో బిళికెరె పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన పల్సర్ బైక్ మిస్టరీ కూడా వీడింది. కువెంపునగర ఎస్ఐ అరుణ్ నేతృత్వంలో పీఎస్ఐలు గోపాల్, మదన్‌కుమార్, సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు.

వైద్యుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

గౌరిబిదనూరు: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం తాలూకా కార్యాలయం ముందు వైద్యులు ధర్నా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వారు ఓపీడీ చికిత్సను నిలిపివేసి, అత్యవసర చికిత్సలు మాత్రమే చేపట్టినట్లు వైద్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. కోల్‌కత ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ప్రభుత్వ వైద్యుడు డా లక్ష్మీకాంత్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి డా గీతా బలరాం, డా శ్రీధర్, డా మంజునాథ్, డా జమున, డా విరూపాక్షి, వివిధ ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం, నేలకొరిగిన పంటలు

గౌరిబిదనూరు: తాలూకాలో శనివారం రాత్రి గాలి వాన కారణంగా పలు పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, రాగులు, మిరప, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. తాలూకా భీమనహళ్ళిలోని రైతు మహిళ భాగ్యమ్మ తన ఒకటిన్నర ఎకరాలో ఉన్న 1500 అరటి చెట్లు నేలకొరిగాయి. కోత సమయంలో పంట మొత్తం నాశనమైందని, దాదాపు రూ. 5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. ఉదయం అధికారులు పంటను పరిశీలించారు.



గాలి వానకు కుప్పకూలిన అరటి చెట్లు

ప్రతిభా పురస్కారాలు అందజేత



తుమకూరు: దక్షత, ప్రామాణికతతో ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటే సహకార రంగంలో అభివృద్ధి సాధ్యమని కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయమంత్రి వీ.సోమణ్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నగరంలోని సిద్ధివినాయక సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ 32వ వార్షిక సర్వసభ్య సమావేశం, ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత 32 ఏళ్లుగా ఏ గ్రేడ్‌లో ఉన్న సొసైటీ ఇంకా బ్యాంకుగా అప్‌గ్రేడ్ అయ్యేందుకు అన్ని రకాలుగా సహకారం అందిస్తానన్నారు. సొసైటీ అధ్యక్షుడు టీసీ ఓహిలేశ్వర్, అటవి శివలింగస్వామీజీ పాల్గొనగా, వీరశైవ సేవా సమాజ అధ్యక్షుడు శేఖర్, పాత్రికేయుడు అడవీశప్ప, పారిశ్రామికవేత్త రుద్ర ప్రకాష్‌లను సన్మానించారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ ఎక్కువ మార్కులు పొందిన పిల్లలకు సత్కరించారు.

హోసూరు వార్తలు..

వైద్య విద్యార్థినిపై హత్యాచారం దారుణం



ఆందోళన నిర్వహిస్తున్న డాక్టర్లు, విద్యార్థులు, సిబ్బంది

హోసూరు: కోల్‌కత్తాలో పీజీ విద్యార్థినిపై అఘాయిత్యం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హోసూరులోని సెయింట్ పీటర్ వైద్య కళాశాల ఆస్పత్రి డాక్టర్లు విధులు బహిష్కరించి ఒక్కరోజు ఆందోళన చేపట్టారు. డాక్టర్ ఆనందరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో డాక్టర్లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేశంలో ప్రాణాలను రక్షించే డాక్టర్లకే రక్షణ లేకపోయిందని, కోల్‌కతా ఘటన అత్యంత దారుణమని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

కంటైనర్ లారీలో గంజాయి

హోసూరు: ఆంధ్ర నుంచి తమిళనాడులోని మదురైకు అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయిని మత్తిగిరి పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాలు... కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మీదుగా కంటైనర్ లారీలో గంజాయి తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తంగదురైకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు మత్తిగిరి పోలీసులు కళుగొండపల్లి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన కంటైనర్ లారీని తనిఖీ చేయగా 20 కిలోల గంజాయి బయటపడింది. డ్రైవర్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా తిరుపత్తూరు ప్రాంతానికి చెందిన రాజేష్, మధురై ఈచ్చంబట్టికి చెందిన జయకుమార్‌లుగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

డ్రైవర్ ఆత్మహత్య

కెలమంగలం: మద్యం మత్తులో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట పట్టణ పంచాయతీలోని తేరుపేట ప్రాంతానికి చెందిన గణేష్(35) వ్యాన్ డ్రైవర్. ఇతనికి తాగుడు అలవాటుండేది. రెండు రోజుల క్రితం మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. విషయం గమనించిన బంధువులు డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదే చేసుకొని విచారణ చేస్తున్నారు.

భూ దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న దృశ్యం

హోసూరు: ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి రూ.25 లక్షల విలువ చేసే స్థలాన్ని అందజేసిన దాతకు పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హోసూరు తాలూకా తొరపల్లి అగ్రహారం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి స్థలం లేదని, దాతలు ముందుకురావాలని, గ్రామస్తులు, పాఠశాల యంత్రాంగం కోరుతూ వచ్చింది. ఈ విషయంపై స్పందించిన నివృత్త ఆర్గనైజర్ క్రిష్ణమూర్తి రూ. 25 లక్షల విలువ చేసే స్థలాన్ని పాఠశాల అభివృద్ధికి దానంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి పంచాయతీ అధ్యక్షులు శాంతమ్మ నంజప్ప, విద్యాశాఖాధికారులు సతీష్‌కుమార్, టి.టి.రాజు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, కుమరవేల్, సెందిల్‌కుమార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం చంపకవల్లి వేంకటరమణ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ. 50 వేల విలువ చేసే వస్తువులు అందజేశారు.

ఒంటి ఏనుగు సంచారం



రోడ్డుపై సంచరిస్తున్న ఒంటి ఏనుగు

హోసూరు: డెంకణీకోట– అంచెట్టి మార్గంలో ఒంటి ఏనుగు సంచారంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అంచెట్టి అటవీ ప్రాంతంలో 50కి పైగా ఏనుగులు మకాం వేసి తాగు నీరు, ఆహారం వెతుక్కొంటూ గ్రామాలవైపు వెళ్లి పంటపొలాలపై దాడి చేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం గుంపు నుంచి విడిపోయిన ఓ ఏనుగు రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కల్గించింది. వెంటనే వాహనదారులు అటవీ శాఖాధికార్లకు సమాచారం ఇచ్చారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగును దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించారు. ఏనుగుల రోడ్లపైకి రాకుండా అటవీ ప్రాంతాల్లో ముళ్ల కంచెలు, సోలార్ కంచెలు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పర్యాటక శాఖ హోటళ్ల పరిశీలన



ఓ హోటల్‌ను పరిశీలించి కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి

హోసూరు: హోసూరులోని తమిళనాడు హోటళ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆహారభద్రతా శాఖ మంత్రి మంత్రి నేరుగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శరయు అధ్యక్షతన మంత్రి చక్రపాణి శనివారం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హోసూరులో పర్యాటక శాఖ ద్వారా నిర్వహిస్తున్న తమిళనాడు హోటళ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక శాఖ ద్వారా తమిళనాడు హోటళ్లను నిర్వహిస్తుందని, ఈ హోటళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి నిధులు కేటాయించిందని, హోసూరులోని తమిళనాడు హోటల్లో రూ.1.25 కోట్ల ఖర్చుతో మరమ్మతులు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఈ హోటల్లో 36 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, 70 నుంచి 80 శాతం పర్యాటకులు బసచేయడంతో హోటల్ అభివృద్ధికి కృషి చేస్తుందని, గత రెండు నెలల్లో సుమారు 14.52 లక్షల దాకా హోటల్ నుంచి ఆదాయం వచ్చిందని, పర్యాటక శాఖ ద్వారా నిర్వహించే హోటళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరింత అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడుతుందని సూచించారు. కార్యక్రమంలో మంత్రి వెంట హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ ఎస్ఏ.సత్య, కమిషనర్ శ్రీకాంత్, డెప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బాంబు బెదిరింపు

యశవంతపుర: బెళగావి నగరంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కపిలేశ్వర ఆలయానికి బాంబు పెట్టినట్లు బెదిరింపు కాల్ రావటంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ విషయం సామాజిక మాధ్యమాలలో సందేశం వైరల్ కావటంతో బెళగావి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈనెల 12న కపిలేశ్వరస్వామిపై ఒక స్టోరీని సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. దీనికి రిప్లైగా ఇలాయిత్ అనే వ్యక్తి బాంబు బెదిరింపును సందేశం పెట్టడం వివాదంగా మారింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

పొలం కంచె.. ఇద్దరిని బలిగొంది

- కరెంటు షాక్‌తో మృత్యువాత





మృతుడు అనిల్ కుమార్, మృతుడు పుట్టరాజు

పావగడ: పొలానికి వెళ్లి వర్షంలో కంచె తగిలి విద్యుత్ ఘాతంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ దుర్ఘటన తుమకూరు జిల్లా పావగడ తాలూకా అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధి లోని టీఎన్ బెట్ట గ్రామంలో జరిగింది. వివరాలు.. టీఎన్ బెట్ట గ్రామానికి చెందిన దివ్యాంగుడు వడ్డెర అనిల్ కుమార్(29). ఇతన్ని బంధువు వడ్డెర పుట్టరాజు (35) తన 3 ఎకరాల పొలంలో సాగుచేసిన వేరుశనగ పంట కావలికి శుక్రవారం రాత్రి సుమారు 9 గంటలప్పుడు తీసుకెళ్లాడు. జంతువులు రాకుండా ఆ పొలం చుట్టూ తంతి తీగల కంచెను ఏర్పాటు చేసి ఉంచారు. అప్పటికే వర్షం కురిసింది. కంచె తగిలి ఇద్దరూ మృత్యువాత పడ్డారు. శనివారం ఉదయం అటువైపు వెళ్ళిన కూలీలు ఇద్దరి మృతదేహాలను చూసి కుటుంబీకులకు సమాచారం అందించారు. పుట్టరాజు తండ్రి రామరాజప్ప మాట్లాడుతూ తోట చుట్టూ తంతి తీగల కంచె మాత్రం వేయించామని, విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇంకా ఇప్పించ లేదని, తన కుమారుడు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఉంటాడని బోరున విలపించాడు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బైక్ పంక్చరై...



మృతుడు కుమార్

పావగడ: శ్రావణ శనివారోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో అరసికెరెకు చెందిన తిమ్మయ్య కుమారుడు, జేసిబి డ్రైవర్ కుమార్ (24) మరణించాడు. సమీప కెరెక్యాతనహళ్ళి గ్రామం సమీపంలోని స్వారమ్మ దేవాలయం వద్ద వెళ్తున్న కుమార్ బైకు ముందరి టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం కుమార్ తల మీదుగా వెళ్ళడంతో తల పూర్తిగా ఛిద్రమై చనిపోయాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ

ఊరికి కీడొచ్చిందని..



ఊరికి కీడొచ్చిందని నల్లగొండ జిల్లా మంగళపల్లి వాసులు ఆదివారం ఇళ్లముందు కల్లాపి చల్లకుండానే వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలో గత నెలలో విషజ్వరాలు ప్రబలి పలువురు అస్వస్థతకు గురవడం తెలిసిందే. దీంతో ఊరికి కీడొచ్చిందని.. గ్రామస్తులంతా వనభోజనాలకు వెళ్లాలని స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో కోరారు. ఈ మేరకు 70శాతం మంది గ్రామస్తులు ఇళ్లముందు ఊడవకుండా, కల్లాపి చల్లకుండా తమ వ్యవసాయ బావులు, తోటల్లోకి వన భోజనాలకు వెళ్లారు. అక్కడే వండుకుతిని.. సాయంత్రానికి ఇంటిబాట పట్టారు. - నకిరేకల్

■ 'వృక్షా' బంధన్



విశాఖలోని ఇందిరా గాంధీ జూ పార్కులో పురాతనమైన మర్రి చెట్టుకు కొందరు చిన్నారులు రాఖీ కట్టారు. గ్రీన్‌క్లైమేట్ బృందంతో కలిసి జూ సిబ్బంది ఆదివారం వృక్షాబంధన్ మహోత్సవం పేరిట కార్యక్రమం నిర్వహించారు. వృక్షాలు రేపటి తరాలకు వారసత్వ సంపద అని జూ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జి.మంగమ్మ తెలిపారు. ఈ ఏడాది ఐదు రాష్ట్రాల్లో వృక్షాబంధన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు గ్రీన్‌క్లైమేట్ వ్యవస్థాపకుడు రత్నం పేర్కొన్నారు. - ఆరిలోవ (విశాఖ తూర్పు)

■ బంక మట్టినీ పిండేస్తున్నారు



చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని చెరువుల్లో పైన బంకమట్టి, దాని కింద నాణ్యమైన ఇసుక లభిస్తోంది. దీన్ని గమనించిన టీడీపీ నేతలు జేసీబీ వాహనాలతో పైనున్న మట్టిని తొలగించి, ఇసుక తోడేస్తున్నారు. కొన్ని చోట్ల ఈ మట్టినీ అమ్ముకుంటుండగా, మరికొన్ని చోట్ల 'ఉపాధి' గుంతల చుట్టూ పోస్తూ కొత్త గుంతలుగా కలరింగ్ ఇస్తున్నారు. తాజాగా ఉపాధి కూలీలు పనులు చేసినట్టుగా బిల్లులు పెట్టుకోనేందుకు ఈ తంతు సాగుతోంది. ఇందుకు ఉపాధి పథకం ఈజీఎస్ అధికారులు సైతం వీరికి సహకరిస్తున్నారు. ఇక బంక మట్టి కింద ఉన్న ఇసుకను ట్రాక్టర్లతో రహస్య డంపులకు తరలించి.. ఆపై కర్ణాటకకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పలమనేరు మండలంలోని కౌండిన్య నదిలో పదుల చోట్ల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. మరో వైపు మొరం చెరువు, అడవికి అనుకుని ఉన్న కుంటలు, పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య నది పరివాహక ప్రాంతాలు, నీళ్లు తగ్గిన చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. ఇంత జరుగుతుంటే ఇరిగేషన్, సెబ్, రెవిన్యూ, పోలీసు అధికారులు చోద్యం చూస్తుండటం దారుణం. - పలమనేరు

క్లుప్తంగా...

దళితుడిపై పచ్చమూకల దాడి

- తీవ్ర గాయాలపాలు
- చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న టీడీపీ దౌర్జన్యకాండ



గాయపడ్డ దళితుడు ఓబులేశు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : దళితులపై టీడీపీ నేతల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్లలో ఆదివారం ఓ దళితుడిపై దాడి చేశారు. రొంపిచర్లకు చెందిన కోటా వెంకటరమణ ఆటోమొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. టీడీపీ నాయకుల వేధింపులు తట్టుకోలేక కొద్ది రోజుల కిందట గ్రామం వదిలి వెళ్లిపోయాడు. తిరిగి వచ్చి షాపు వద్ద సీసీ కెమెరాలు అమరుస్తుండగా.. టీడీపీ నేతలు నాగరాజు, మురళి, నాగార్జున నాయుడు వారి అనుచరులతో వచ్చి దుకాణంపై దాడి చేసి.. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. షాపును తెరిచేందుకు అంగీకరించేది లేదంటూ దౌర్జన్యం చేశారు. దీనిని అడ్డుకున్న వెంకటరమణ కూతురు సుష్మ, నగిరి దళితవాడకు చెందిన ఓబులేశుపైనా దాడి చేశారు. వారి దాడిలో ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం పీలేరు ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, వెంకటరమణ గ్రామ సమీపంలో గృహ నిర్మాణం కోసం ఇటుకల బట్టీ ఏర్పాటు చేశాడు. కంకర, పునాది రాళ్లు ఉంచాడు. అతను గ్రామంలో లేకపోవడంతో ఫజులుపేటకు చెందిన మురళి అక్రమంగా తన అనుచరులతో కలిసి రూ.5 లక్షల విలువ చేసే 60 వేల ఇటుకలు, పునాది రాళ్లు, కంకరను అమ్ముకున్నాడు. ఈ నెల 7న వెంకటరమణకు చెందిన బైక్‌ను ధ్వంసం చేయడంతో పాటు.. ఆయన దుకాణానికి తాళాలు కూడా వేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కేసు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించినా స్థానిక పోలీసులు పట్టించుకోలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పత్రాల దహనం ఘటనలో బాధ్యులపై చర్యలు

మంత్రి దుర్గేష్



దహనమైన పత్రాలను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

ధవళేశ్వరం : పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కార్యాలయం వద్ద పత్రాలను దహనం చేసిన ఘటనలో బాధ్యులను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జేసీ ఎస్.చినరాయుడును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు భూసేకరణ కార్యాలయాన్ని ఆదివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ కుమారిని ఘటనపై ప్రశ్నించారు. దుర్గేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చే రీతిలో కొందరు ఉద్యోగులు ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పత్రాలను తగులబెట్టిన విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టాలని జేసీని ఆదేశించారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ అధికారుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.

ఫైళ్ల దగ్ధం కేసులో నలుగురి సస్పెన్షన్

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ఎడమ ప్రధాన కాల్వ భూసేకరణ కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దగ్ధానికి సంబంధించి సీనియర్ అసిస్టెంట్లు కె.నూకరాజు, కారం బేబి, స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.కళాజ్యోతి, ఆఫీసు సబార్డినేట్ కె.రాజశేఖర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం సస్పెండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లు ఎ.కుమారి, ఎ.సత్యదేవిలకు షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ ఘటనపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వేదవల్లి ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

పత్తికొండ హత్య కేసులో
టీడీపీ నేతే హంతకుడు

- రాజకీయ ఆధిపత్యంలో భాగంగానే ఆ పార్టీ నేత శ్రీనివాసులు హత్య
- కేసులో ప్రధాన నిందితుడు నరసింహులు హోసూర్‌లో అదే పార్టీ నేత
- ఆధిపత్యం కోసం సహచర నేతను హత్యచేసిన మరో నేత
- వైఎస్సార్‌సీపీపై బురద జల్లాలనుకున్న లోకేశ్ ఇప్పుడేమంటావ్?



ఎన్నికల ప్రచారంలో గుడిసె నరసింహులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: పత్తికొండ నియోజకవర్గం హోసూర్‌లో ఇటీవల హత్యకు గురైన టీడీపీ నేత వాకిటి శ్రీనివాసులు కేసును పోలీసులు ఛేదించారు. శ్రీనివాసులును అదే గ్రామానికి చెందిన మరో టీడీపీ నేత గుడిసె నరసింహులు హత్య చేయించాడని గుర్తించారు. పత్తికొండ టీడీపీలో ఆధిపత్య పోరులో భాగంగానే ఒక టీడీపీ నేతను, అదే పార్టీకి చెందిన మరో నేత హత్య చేయించినట్లు తేలింది. ఈ హత్య జరిగిన రోజు వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్సార్‌సీపీ హత్య చేసిందనేలా పార్టీపై, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. ఇప్పుడు వాస్తవాలు బట్టబయలు కావడంతో లోకేశ్ నవ్వులు పాలుకావడంతో పాటు వైఎస్సార్‌సీపీపై ఆయన పచ్చి అబద్ధాలు మాట్లాడతారని.. వైఎస్సార్‌సీపీ, జగన్‌పై అదేపనిగా బురదజల్లుతున్నారని స్పష్టమైంది.

అడ్డు తొలగించుకునేందుకే స్కెచ్..

హోసూర్‌లో వాకిటి శ్రీనివాసులు టీడీపీ నేత. గుడిసె నరసింహులు సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా రిటైరైన తర్వాత టీడీపీలో చేరి నాయకునిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. శ్రీనివాసులును పత్తికొండ సహకార సంఘం అధ్యక్షుడిగా ఎంపిక చేసేందుకు ఎమ్మెల్యే శ్యాంబాబు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రాజకీయంగా తన భవిష్యత్తు ఏంటో చెప్పాలని శ్యాంబాబును నరసింహులు అడిగినట్లు తెలుస్తోంది. హోసూర్‌లోనే ఇద్దరూ ఉంటే భవిష్యత్‌లో గొడవలు ఉంటాయని, పత్తికొండలో కాపురం పెడితే అక్కడ ఓ వార్డు బాధ్యతలు అప్పగిస్తానని నరసింహులుకు శ్యాంబాబు చెప్పినట్లు తెలిసింది. దీంతో.. రాజకీయంగా శ్రీనివాసులు ఎదగడంతో పాటు తాను ఊరు వదిలే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని గ్రహించిన నరసింహులు.. ఈనెల 14న శ్రీనివాసులును హత్య చేయించారు. ఇక శ్రీనివాసులును వడ్డే కాశీనాథ్, ఎరుకల వంశీ అనే ఇద్దరు బాలనేరస్తులు హత్యచేసినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసాచారి వెల్లడించారు. వీరితో పాటు రామాంజనేయులు, హరికృష్ణ, వడ్డే నరసింహులను కూడా కేసులో చేర్చారు.

ఇప్పుడేమంటావ్ లోకేశ్?



హత్య జరిగిన ఉదయం 'పచ్చ' ఛానెళ్ల వైఎస్సార్‌సీపీ నేతలే టీడీపీ నేతను హత్యచేశారని ఊదరగొట్టాయి. వైఎస్సార్‌సీపీపై కావాలనే లోకేశ్ దుష్ప్రచారంతో ట్వీట్ కూడా చేసేశారు. 'ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నా! ఎన్నికల్లో టీడీపీ తరఫున కీలకంగా పనిచేశాడనే కక్షతో కిరాతకంగా హతమార్చారు. ప్రజాక్షేత్రంలో తిరస్కారానికి గురైనప్పటికీ జగన్ అండ్ కో తమ పాత పంథా మార్చుకోకుండా దురాగతాలకు పాల్పడుతున్నారు' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్ చూసి హోంమంత్రి అనిత, మరో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కూడా వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేశారు. ఈ హత్యకు రాజకీయరంగు పులిమి వైఎస్సార్‌సీపీపై మోపే ప్రయత్నం చేశారు. కానీ, పోలీసు విచారణలో వాస్తవాలు బయటపడడంతో ఈ హత్య విషయంలో వైఎస్సార్‌సీపీ, జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన ఆరోపణలకు మంత్రి లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారో!?

మహిళా ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌పై..
అధికార పార్టీ నేతల దాడి

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆటోడ్రైవర్

- పోలీసులు వాహనాన్ని తరలిస్తుండగా అడ్డగింత
- ఆటోడ్రైవర్ సమాచారంతో హుటాహుటిన వచ్చిన టీడీపీ నేతలు
- మహిళా ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి
- ఈ ఘటనను వీడియో తీస్తున్న యువకుడిపైనా మూకుమ్మడి దాడి



టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ మహిళ ఎస్సై గీతా రమ్య, హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, ప్రవీణ్‌కుమార్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులపై టీడీపీ నేతలు దాడిచేశారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని పెన్నా వారధి సమీపంలో జరిగింది. నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతా రమ్య.. హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణతో కలిసి ఆదివారం సాయంత్రం ఆమె రంగనాయకులపేట పెన్నా వారధికి సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. సంతపేట ప్రాంతానికి చెందిన మహేష్ పూటుగా మద్యం తాగి ఆ మార్గంలో ఆటో నడుపుతుండగా ఎస్సై అతనిని ఆపి పరీక్ష చేసి కేసు నమోదు చేశారు. ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించేందుకు యత్నించగా డ్రైవర్ అడ్డుకున్నాడు. ఆటోను ఎలా తీసుకెళ్తారంటూ తన స్నేహితులకు ఫోన్‌చేశాడు. అయినా, ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ తాడు సాయంతో ఆటోను తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా మహేష్ మళ్లీ అడ్డుకున్నాడు. ఇంతలో టీడీపీ నేత కప్పిర శ్రీనివాసులు, అతని సతీమణి కప్పిర రేవతి తమ అనుచరులతో అక్కడికొచ్చి పోలీసులపై దాడిచేసి గాయపరిచారు. అదే సమయంలో అక్కడున్న ప్రవీణ్ అనే వ్యక్తి దాడి ఘటనను వీడియో తీస్తుండగా అతన్ని కూడా టీడీపీ నేతలు మూకుమ్మడిగా దాడిచేశారు. ఇరువర్గాల మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. దీంతో కప్పిర దంపతులూ గాయపడ్డారు. ఇరువర్గాలు సంతపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం ట్రాఫిక్ ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, ప్రవీణ్ జీజీహెచ్‌లో చేరారు. కప్పిర దంపతులు తొలుత జయభారత్ ఆస్పత్రి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ ఆస్పత్రిలో చేరారు. ఇరువర్గాల ఫిర్యాదులపై సంతపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు.

టీడీపీ నాయకుల బెదిరింపులతో
వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ప్రాథమిక పాఠశాల చైర్మన్ పదవి కోసం బెదిరింపులు
- అన్నమయ్య జిల్లా మల్లాలమ్మదిన్నె యానాది కాలనీలో ఘటన



శుక్రవారం గుళికలు తిన్న కోటేశ్వరయ్యను 108లో ఆస్పత్రికి తీసుకెళుతున్న దృశ్యం

పెనగలూరు : ప్రాథమిక పాఠశాల చైర్మన్ పదవి విషయంలో టీడీపీ నేతలు ఓ వ్యక్తిని బెదిరించడంతో ఆయన మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కట్టావారిపల్లి పంచాయతీ మారుమూల గ్రామం మల్లాలమ్మదిన్నె ప్రాథమిక పాఠశాల చైర్మన్ పదవి కోసం టీడీపీ వారు గ్రామస్తులపై బెదిరింపులకు దిగుతున్నారు. ఈ గొడవల నేపథ్యంలో ఎంపికను విద్యాశాఖాధికారులు వాయిదా వేశారు. అప్పటి నుంచి టీడీపీ నాయకులు మహిళలను బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో మల్లాలమ్మదిన్నె యానాది కాలనీ వాసులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 15వ తేదీ రాత్రి టీడీపీ నాయకులు గ్రామంలోకి వెళ్లి హల్‌చల్ చేశారు. ప్రభుత్వం మాది, నాయకత్వం మాది, చైర్మన్ పదవి మాకే దక్కాలి.. లేదంటే మీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగినట్టు గ్రామ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో పెద్దగా వ్యవహరించే చలం కోటేశ్వరయ్య ఇంటి వద్దకు వెళ్లి చైర్మన్ పదవి తమకు దక్కకుంటే నీ ఇంటిని నేలమట్టం చేస్తాం.. నీ అంతుచూస్తాం.. అంటూ హెచ్చరించారు. దీంతో మనస్థాపానికి గురైన కోటేశ్వరయ్య ఆ మర్నాడు విష గుళికలు తిని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. కోటేశ్వరయ్య గుళికలు తిన్న విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు సమాచారం లేదని చెప్పారు. ఎంఈవో గిరివరదయ్యను వివరణ కోరగా అక్కడ పరిస్థితులు వివాదాస్పదంగా ఉండటంతో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఎంపిక జరగాలని డీఈవోను కోరినట్టు తెలిపారు. మల్లాలమ్మదిన్నెలో దాదాపు 40 కుటుంబాలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే వీరికి పాఠశాల, సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయి.

హెడ్ కానిస్టేబుల్, హోం గార్డు సస్పెన్షన్

తిరుపతి క్రైమ్ : తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో విచ్చలవిడిగా సాగుతున్న గ్రావెల్ అక్రమ తరలింపుపై 'అక్రమ రవాణాకు పోలీస్ ఎస్కార్ట్' శీర్షికన ఆదివారం సాక్షి మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డును సస్పెండ్ చేసినట్లు తెలిపారు. 'చంద్రగిరి మండలం మల్లాయపల్లి నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి, టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు చంద్రగిరి సీఐకి ఫిర్యాదు వచ్చింది. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకునే చర్యలు తీసుకోవాలని చంద్రగిరి రక్షక్ మొబైల్ హెడ్ కానిస్టేబుల్ ఎస్ బసవయ్య, హోం గార్డ్ సుధాకర్‌ను ఆయన ఆదేశించారు. అయితే వారు అలా చేయకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై వెంటనే విచారణ జరిపాం. వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశాం' అని చెప్పారు.

చిరుద్యోగులపై ప్రతాపమా?

అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలకు పోలీస్ ఎస్కార్ట్ కల్పించిన ఘటనలో అసలు దోషులను వదిలి చిరుద్యోగులపై ప్రతాపం చూపించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజులుగా చంద్రగిరి నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక అక్రమ వ్యాపారాలు భారీ స్థాయిలో సాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో మట్టి అక్రమ రవాణాపై స్థానికులు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టించుకోకపోతే తామే అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో సదరు ప్రజాప్రతినిధి పోలీసు అధికారికి ఫోన్ చేసి, స్థానికుల నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. వెంటనే ఆ పనిలో నిమగ్నమైన పోలీసు అధికారి (సీఐ).. ఓ హెడ్ కానిస్టేబుల్, హోం గార్డుకు వాహనం ఇచ్చి పంపించారు. ఆ మేరకు వారు హుటాహుటిన బయలుదేరి.. అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలకు రక్షణ కల్పించారు. ఇదే విషయాన్ని 'సాక్షి' ఆదివారం ఆధారాలతో ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఎవరి ఆదేశాలతో వారు అలా రక్షణ కల్పించాల్సి వచ్చిందనే విషయాన్ని పట్టించుకోకుండా, హెడ్‌కానిస్టేబుల్, హోం గార్డును మాత్రమే ఎలా సస్పెండ్ చేస్తారని పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. ప్రజా ప్రతినిధుల మాట వింటున్న ఉన్నతాధికారులు ఇలా చిరుద్యోగులను బలి చేయడం తగదంటున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అక్రమ మైనింగ్, ఇసుక, గ్రావెల్, భూ దందా, దౌర్జన్యాలు యథేచ్ఛగా సాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

కుప్పంలో జల్లికట్టు.. 10 మందికి పైగా గాయాలు



జల్లికట్టులో పెద్ద ఎత్తున కట్టిన టీడీపీ జెండాలు, తోరణాలు

కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తంలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో పది మందికిపైగా యువకులు గాయపడ్డారు. టీడీపీ నేతలు ఎలాంటి జాగ్రత్తలు లేకుండా నిర్వహించిన జల్లికట్టు కారణంగా స్థానిక వ్యక్తితో పాటు పదిమందికి పైగా తమిళనాడు వాసులకు గాయాలయ్యాయి. ఎద్దులను నిలువరించేందుకు హద్దులో యువకులు పోటీ పడటంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో కుల్లాయప్ప కొటాలు గ్రామానికి చెందిన కుశలప్ప తీవ్రంగా గాయపడగా, వెంటనే కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనితో పాటు గాయపడ్డ తమిళనాడు యువకులను తమిళనాడులోని ఆస్పత్రులకు తరలించారు. జల్లికట్టు నిర్వహణదారులు ఎంట్రీ ఫీజుల పేరిట ఎద్దుల యజమానుల వద్ద రూ.16 లక్షలు వసూలు చేశారు. ఇంత మొత్తంలో వసూలు చేసిన నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ జెండాలు, తోరణాలు కట్టి జల్లికట్టు నిర్వహించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు రేగుతున్నాయి.

ఇసుక స్టాక్ యార్డులో.. తుళ్లూరు సీఐ వీరంగం

- ట్రాక్టర్ డ్రైవర్లను కులం పేరుతో పచ్చి బూతులు దూషించిన పోలీసు అధికారి
- వే బిల్లులు ఇచ్చిన అధికారులను వదిలి ట్రాక్టరు డ్రైవర్‌పై ప్రతాపం
- మీ సినిమా అయిపోయిందంటూ నోటికొచ్చినట్లు మాటలు



ట్రాక్టర్ తరలిస్తున్న సమయంలో బతిమాలుతున్న యజమాని

గుంటూరు టాస్క్‌ఫోర్స్: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెం ఇసుక స్టాక్ యార్డులో తుళ్లూరు సీఐ ఆగడాలు మితిమీరుతున్నాయని, అకారణంగా, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వీరంగం వేస్తున్నట్లు బాధితులు గగ్గోలు పెడుతున్నారు. నోటితో చెప్పలేని రీతిలో బండ బూతులు తిడుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. తాజాగా.. శనివారం సాయంత్రం ఇసుక లోడింగ్ చేసుకుంటుండగా ఆ సీఐ వచ్చి.. రికార్డులు పరిశీలించి లోడింగ్ జరుగుతున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను కిందకు దించి 'నీకిది మూడో ట్రిప్పు.. నువ్వెందుకు వచ్చావురా? నీ ఊరేది, నీ కులం ఏంటి రా..?' అని గద్దించారు. డ్రైవర్ ఉద్దండరాయునిపాలెం అని బదులివ్వగానే.. మాదిగ లం..కో..ల్లారా.. అంటూ అతన్ని బిల్లులు రాసే దగ్గరకి జుట్టు పట్టుకుని లాక్కెళ్లి బూతులు తిడుతూ ఇష్టమొచ్చినట్లు కొట్టి వే బిల్లును లాక్కొని ట్రాక్టర్‌ను వే బ్రిడ్జి దగ్గర కాటా పెట్టించి స్టేషన్‌కు తీసుకురావాలని కానిస్టేబుల్‌కు చెప్పారు. నిజానికి.. లోకల్ ట్రాక్టర్ కావడం, ట్రాక్టర్లు తక్కువ సంఖ్యలో ఉండటంతోపాటు స్థానిక గ్రామాల్లోనే ఇసుకను తోలుతుండటంవల్ల సదరు ట్రాక్టర్ ఆ రోజు క్యూలోనే మూడో ట్రిప్పు కింద వచ్చింది. అయితే, అసలు వే బిల్లులు ఇచ్చిన వారిని వదిలిపెట్టి తనను కావాలనే టార్గెట్ చేసి కులం పేరుతో దూషించి కొట్టాడని బాధితుడు ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వానికి నిర్ణీత ధర చెల్లించి వే బిల్లులు తీసుకుని ఇసుకను తీసుకెళ్తున్న దళితుడినైన తనపై సీఐ దుర్మార్గంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించాడు. స్టాక్ యార్డులో వేబ్రిడ్జి ఉండాల్సి ఉన్నప్పటికీ అవేమీ నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా కేవలం జేసీబీ బొచ్చ ప్రామాణికంగా లోడింగ్ జరుగుతుంటే వాహనాలపై అధిక లోడు కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

మరో యువకుడిపైనా మాటల దాడి..

ఇక ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన మణికంఠ అనే మరో ఎస్సీ యువకుడి లారీపై కూడా ఓవర్ లోడింగ్ కేసు నమోదు చేసిన సీఐ అతన్ని కూడా పిలిపించి.. రాయడానికి వీల్లేని భాష మాట్లాడుతూ.. 'మాదిగ నా కొడకల్లారా.. నీ మీద తొమ్మిది కేసులున్నాయి.. ఇంకోసారి కనపడితే నీ మీద రౌడీషీట్ ఓపెన్ చేసి బొక్కలో వేస్తా నువ్వు ఊరు వదిలి పారిపోవాలి'.. అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడని బాధితుడు వాపోయాడు. ఇలా ఉద్దండరాయునిపాలెం ఎస్సీ యువకులే టార్గెట్‌గా సీఐ బెదిరింపులు ఎక్కువయ్యాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పడిగాపులు కాసి ఒక్క ఇసుక ట్రాక్టరు తీసుకెళ్లి అన్‌లోడ్ చేస్తే యజమాని వద్ద నుంచి మాకు వచ్చేది రూ.300–రూ.400లేనని.. పోలీసులు ఇలా తమను టార్గెట్ చేస్తే బతికేదెలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే టార్గెట్..

ఇసుక తరలింపులో టీడీపీ నేతల వాహనాలను వదిలేసి వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలే టార్గెట్‌గా సీఐ వ్యవహరిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. అదే టీడీపీకి చెందిన వారి వాహనాలు కూడా ఎక్కువ ట్రిప్పులు వేసినట్లు రికార్డుల్లో ఉన్నా తమనే టార్గెట్ చేస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కులం పేరుతో తిట్టి కాళ్లతో తన్నాడు..



బిల్లు రాయించుకుని లోడింగ్ చేసుకునేందుకు వెళ్లిన నన్ను పిలిచి మాదిగ లం..కొ..ల్లారా అంటూ జుట్టు పట్టుకుని (రాయలేని భాషలో తిడుతూ) చెంపల మీద కొట్టి కిందపడేసి బూట్లతో కడుపులో గట్టిగా తన్ని 'నా కొడకల్లారా ఉద్దండరాయునిపాలెం మాదిగ నా కొడుకులను ఊళ్లో ఒక్కడినీ ఉండనివ్వను' అంటూ నానా మాటలన్నాడు. - ప్రసన్నకుమార్, ట్రాక్టర్ డ్రైవర్

రౌడీషీట్ ఓపెన్ చేసి బొక్కలో..



నాపై గతంలో టీడీపీ వాళ్లు పెట్టిన కేసు విషయంలో స్టేషన్‌కు పిలిపించి ఏ కులం అని అడిగి.. 'మాదిగ నా కొడకల్లారా మీకు ఎక్కడవిరా ఈ లారీలు? నీ మీద 9 కేసులున్నాయి. ఇంకోసారి కనబడితే 'నా కొడకా నీ మీద రౌడీషీట్ ఓపెన్ చేసి బొక్కలో దె.. మీ సినిమా అయిపోయింది' అంటూ బండబూతులు తిట్టాడు. - నందిగం మణికంఠ

సన్నిధి

ఒకరికొకరు అండాదండా



శ్రావణ పూర్ణిమ, వరలక్ష్మీ వ్రతం అంటే తెలియని వారు ఉండవచ్చునేమో కానీ, రాఖీపూర్ణిమ అంటే తెలియని వారుండరు. పేరు తెలిసినా ఆ సంప్రదాయ బద్ధంగా ఆనాడు ఏం చేయాలో... రాఖీ కట్టడంలోని అంతరార్థం ఏమిటో తెలిసినవారు అరుదనే చెప్పాలి. పూర్ణిమనాడు శ్రవణానక్షత్రం ఉన్న మాసానికి శ్రావణ మాసమని పేరు. శ్రావణమాసంలో రాత్రివేళ పూర్ణిమ తిథి ఉన్న రోజును రక్షికా పూర్ణిమ అన్నారు పెద్దలు. రక్షించగలిగిన పూర్ణిమ, రక్షణ కోరుకునే వారికోసం ఉద్దేశింపబడిన పూర్ణిమ అని అర్థం. ఈ పండుగ కాస్తా కాలక్రమంలో రాఖీపూర్ణిమగా పేరు మార్చుకుంది.

శ్రావణ పూర్ణిమనాడు ఉదయమే స్నానం చేయాలి. ఎవరిని రక్షించదలిచామో– అంటే నేటి నుండి ఒక సంవత్సరం పాటు ఎవరికి అండగా ఉండదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి మనం కట్టబోయే రక్షిక (రాఖీ)ని దైవం ముందుంచి పూజ చేయాలి. వరుడు కట్టబోయే మంగళ సూత్రానికి ఎలా మాంగల్యబల పూజ చేస్తారో, ఆ పూజాశక్తి దానిలో ప్రవేశించి ఆ సూత్రాన్ని కట్టించుకున్న ఆమెకీ, కట్టిన వ్యక్తికీ ఆపదల్లేకుండా చేస్తుందో అంతటి శక్తి ఉన్నది ఇక్కడ రక్షికకి. కాబట్టి దీనికీ పూజ చెయ్యాలి. అంటే పూజ ద్వారా పూజాశక్తిని దానిలోనికి ప్రవేశింప చెయ్యాలన్నమాట.

అలా పూజాశక్తితో కూడుకున్న ఈ రక్షికని ఒక సంవత్సర కాలంపాటు– మనం ఎవరిని రక్షించడానికి అండగా నిలువదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి కడుతూ– 'ఆ రక్షిక మీద అక్షతలని వేయాలి. ఇలా కట్టడాన్ని అపరాహ్ణసమయంలో (అహ్నం అంటే పగలు. అపరం అంటే మధ్యాహ్నం 12 దాటాక. కాబట్టి అపరాహ్ణం అంటే 12 నుండి 3 గంటల మధ్య అని అర్థం) మాత్రమే చేయాలి. అయితే ఇది ఇప్పటి ఆచారం కాదు... ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమే! రక్షాబంధనం కట్టడం పూర్తయింది కదా అని ఇక అంతటితో వదిలేయకూడదు. ఆ బంధానికి కట్టుబడి ఒకరికి ఒకరు అన్నింటా అండగా నిలవాలి.

మరో ముఖ్య విశేషమేమిటంటే ఇది కేవలం స్త్రీలు మాత్రమే కట్టాలనే నియమం లేదు. స్త్రీలకి స్త్రీలూ పురుషులకి పురుషులూ కూడా కట్టుకోవచ్చు, అలా అండగా నిలవాలనే పవిత్రోద్దేశ్యం ఉంటే. అంతే కాదు.. దేశ రక్షణలో పాల్గొనే సరిహద్దు భద్రతాదళాలకు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వారి విజయాన్ని, శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి సంవత్సరం శ్రావణ పున్నమిరోజు రక్షాబంధనం కడుతుండటం శుభపరిణామం.

స్థితి కారుడైన శ్రీహరి జన్మనక్షత్రం శ్రవణం నిండుగా ఉండే ఈ శ్రావణ పూర్ణిమనాడే నేను ఫలాని వారికి రక్షణ కోసం కడుతున్నాను. కాబట్టి ఆ శ్రీహరి అనుగ్రహం నా మీద ప్రసరించి నేనూ రక్షించే వాడిగానే ఉండాలని అర్థం చేసుకోవడానికే శ్రావణపూర్ణిమని ఈ పండుగ రోజుగా నిర్ణయించారని గమనించాలి. అంతేకాదు, అపరాహ్ణ సమయంలో రక్షికని కడుతున్న నా రక్షికాబంధానికి ఆ ప్రత్యక్ష కర్మసాక్షి సూర్యుడని తెల్పడానికే.

యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః
తేన త్వామపి బధ్నామి రక్షే! మా చల మాచల!

రాక్షసులకి రాజూ, మహాబలవంతుడూ అయిన బలి చక్రవర్తి ఏ రక్షాబంధన శక్తి కారణంగా శ్రీహరికి వశమైపోయాడో, దేవతలంతా తమ తమ తపశ్శక్తిని శ్రీహరికి బాసటగా ఉంచుతూ రక్షికని కట్టారో, ఆ రక్షికా శక్తి నాలో ప్రవేశించిన నేను కూడ ఈ మిత్రునికి లేదా మిత్రురాలికి ఈ రక్షికని ముడి వేస్తున్నాను. ఓ రక్షికా! రక్షణశక్తి నీనుండి తొలగకుండును గాక! అని పై శ్లోకానికి అర్థం. ఈ పండుగలోని హంగులు, ఆర్భాటాల మాట ఎలా ఉన్నా, తమకు రక్షణ ఇవ్వవలసిందిగా కోరుతూ... తమ సోదరులకు దుష్టశక్తుల పీడ లేకుండా, వాహన ప్రమాదాలు తదితర విపత్తుల బారినుంచి కాపాడి భగవంతుడు ఈ సంవత్సరమంతా రక్షగా నిలవాలని కాంక్షిస్తూ ఎంతో దూరాభారాలకు ఓర్చి పుట్టింటికి వచ్చి సోదరుల చేతికి రక్షాబంధనం కట్టడం, వారికి తీపి తినిపించడం, 'నీకు అండగా నేనున్నాను' అని అభయమిస్తూ సోదరులు వారి శక్తికొలది పసుపు కుంకుమలు, చీరసారెలతో సత్కరించడం ఇటీవల వెల్లివిరుస్తున్న ఒక సత్సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని ఒక పండుగలా జరుపుకోవడంతో మాత్రం సరిపెట్టకూడదు. అందులోని అంతస్సూత్రాన్ని అర్థం చేసుకుని, దానిని ఆచరణలో పెట్టాలి. అప్పుడే సమాజం బాగుంటుంది.

– డి.వి.ఆర్.



మంచి మాట

సంతోషమే బలం

మానవుడు ఆనంద స్వరూపుడు. ఆనందం కోసమే నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉంటాడు. చిత్రంగా ఆ ప్రయత్నంలో దానినే విస్మరించటం, కోల్పోవటం జరుగుతుంది. ఆనందంగా ఉండటం సహజ స్థితి. అప్పుడే పుట్టిన పిల్లలు చూడండి. ఆనందంగా నవ్వుతూ ఉంటారు. ఆకలి వేసినప్పుడో ఇబ్బంది కలిగినప్పుడో మాత్రమే ఏడుస్తారు. అది వాళ్ళు తమ భావాలను ప్రకటించగల ఒకే ఒక భాష.

ఆనందాన్ని క్రమక్రమంగా వయసుతోపాటు కోల్పోతున్నాడు మానవుడు. దానికి కారణం శోకం. అందుకే అర్జునుడు విషాదంలో కూరుకుపోయినప్పుడు శ్రీ కృష్ణుడు ''నీకు శోకించే అధికారం లేదు'' అని వరుసగా ఎన్నో శ్లోకాలలో నొక్కి వక్కాణించాడు. శోకం మనిషిని మానసికంగా క్రుంగదీస్తుంది. మనోబలం తగ్గటంతో శరీరం కూడా సరిగా సహకరించదు. అది అన్ని రుగ్మతలకి ఆహ్వానం.

''ఈడుపు కాళ్ళు ఏడుపు మొఖం'' అన్ని పనులకు ఆటంకం కలిగిస్తాయి. ఏడుపుగొట్టు ముఖం దరిదాపుల్లోకి ఏ శుభాలు రావు. ఎందుకంటే ఏడుపు మొహం రాగానే కాళ్ళు ఈడవటం జరుగుతుంది. ఇంక పనులు ఏమవుతాయి? విజయానికి మూలం ఉత్సాహం. శోకం ఉత్సాహాన్ని తరిమికొడుతుంది. ఇంకా ఏం చేస్తుందో తెలుసా?

''శోకో నాశయతే ధైర్యం
శోకో నాశయతే శ్రుతమ్
శోకో నాశయతే సర్వం
నాస్తి శోక సమో రిపుః''

ఎప్పుడూ జీవితంలో ఎవరినీ పల్లెత్తు మాట అనని కౌసల్య రాముడు వనవాసం చేయటానికే నిశ్చయించుకున్నాడు అని తిరిగి వచ్చిన సుమంత్రుడు చెప్పగానే శోకోపహతచేతన అయి దశరథుడితో నిష్ఠురంగా మాట్లాడుతుంది. దశరథుడు ఆమెను బ్రతిమాలుతుంటే తన తప్పు తెలుసుకుని ఈ మాటలు అంటుంది. తాను ఆ విధంగా కఠినంగా మాట్లాడటానికి శోకమే కారణం అని దానిని మించిన శత్రువు లోకంలో లేదు అంటుంది.

నొప్పి వేరు, బాధ వేరు, శోకం వేరు. నొప్పి భౌతిక మైనది. శరీర సంబంధం. బాధ మనస్సుకి సంబంధించినది. శోకం మనస్సు లోలోపలి పొరలలోకి చొచ్చుకొని పోయి జీవుణ్ణి వేదనకి గురి చేస్తుంది. తనకో తనవారికో కష్టం కలిగింది అనే భావన జోడించబడి ఉంటుంది. ఎప్పుడైతే నేను, నా అన్న భావన కలిగిందో మనస్సు నిర్మలంగా, నిష్పక్షపాతంగా ఆలోచించలేదు. ఎదుటివారి సమస్యలని తేలికగా పరిష్కరించగలవారు తమకి వచ్చిన చిన్న సమస్యని కూడా పరిష్కరించలేకపోవటానికి ఇదే కారణం. అది తమది కాదు ఎవరిదో అని ఆలోచించగానే తాము అందులో ఉండరు గనుక వెంటనే పరిష్కారం లభిస్తుంది. శోకంలో ముందుగా వచ్చేదే 'నేను' అన్నది. దానితో ముందుగా ధైర్యం జారిపోతుంది.

అర్జునుడికి వచ్చింది కూడా శోకమే. ధైర్యం కోల్పోవటం వల్ల శరీరం వణకటం, చేతిలో ఉన్న గాండీవం జారిపోవటం వంటివి జరిగాయి. ఆ శోకాన్ని పోగొట్టి ధైర్యాన్ని, దానికి మూలమైన జ్ఞానాన్ని ఇచ్చే ముందు నీకు శోకించే అర్హత, అధికారం లేదు అని గట్టిగా చెప్పాడు. మరేం చేయాలి అంటే ''సమస్యలు వస్తే క్రుంగిపోక వాటితో యుద్ధం చేయాలి.'' అని ఆదేశించాడు. అది అర్జునుడికి మాత్రమే కాదు. భారతీయులు అందరూ. మనం అన్నివిధాల సమస్యలతోను పోరాడి విజయం సాధించాలి.

> ఎవరికైనా కష్టం వస్తే బ్రహ్మాండంగా ఓదారుస్తాం – కష్టాలు మనుషులకి కాక మాకులకి వస్తాయా? కలకాలం ఉండవు, మంచి కాలం ముందు ఉంది అని. తనదాకా వస్తే ధైర్యానికి మూలకారణమైన జ్ఞానం నశిస్తుంది. చదివిన చదువంతా నట్టేట్లో కలిసిపోతుంది. తెలివిపోయాక ఏమి ఉంటుంది? అందు వల్ల శోకాన్ని మించిన శత్రువు లేదు అన్నది కౌసల్య. నిజమే కదా!

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఇది ఒక అమూల్యమైన సంపద..

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాతలు, నాయనమ్మలు, అమ్మమ్మలు అద్భుతమైన మానవీయ సంబంధాలు. వారి సమక్షం ఒక విశ్వవిద్యాలయమే. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఒక పాఠశాల ఉంది. పాఠశాలల్లో పేరంట్స్ డే జరపడం సర్వసాధారణమే.. కానీ అక్కడ గ్రాండ్ పేరెంట్స్ డే కూడా జరుపుతారు. అటువంటి పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే ఎంత గొప్ప విశేషమో తెలియ చేయడానికి వారిని ఎందుకు గౌరవించాలో బోధపరచడానికి వారీ ఉత్సవం నిర్వహిస్తారని తెలిసి చాలా సంతోషమేసింది. తాతలు, నానమ్మలు, అమ్మమ్మల దగ్గర పెరిగిన పిల్లల్లో ధైర్యం, సంస్కారం ఎక్కువగా ఉంటుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తన ప్రసంగంలో తెలియచేసారు. అటువంటి పెద్దల సమక్షంలో పెరిగే పిల్లల మానసిక పరిణతి, సంస్కారబలం వృద్ధి చెందుతాయి. పెద్దల విలువని ఎంతని లెక్కగట్టగలం!!!

వారు లేరని బాధపడేవాళ్ళుంటారు చాలా మంది... అటువంటప్పుడు వారిని ఓల్డ్ ఫర్నీచర్ అని తప్పించడం ఎంత నీతిబాహ్యమైన చర్య? తండ్రి పెద్దవాడయిపోయాడు. కొడుకు భుజం మీద చెయ్యివేసుకుని వెళ్ళడం ఒక తీవి. తండ్రి చేతిని కొడుకు పట్టుకుని తీసుకెళ్ళి కూర్చోబెడితే అదొక తీవి. నా కొడుకును సహాయంగా తీసుకుని బయటకు వెళ్ళి రావడం నా అవసరం, నా ఆనందం. దాని ప్రయోజనం మరొకరికి ఎలా తెలుస్తుంది? కొడుకు ఎక్కడ ఉంటే అక్కడ ఉపశమనం. కోడలు ఎక్కడ ఉంటే అక్కడ ఒక ఊరట. మనసుకు గొప్పశాంతి. అది సంపద. అంత గొప్ప సంపదకు దూరంగా ఏకాకిగా బతకడమా!!! మనుమలతో కలసి బతకడం భగవంతుడిచ్చిన గొప్ప భాగ్యం. వారిలో తమను తాము చూసుకోవడం పెద్దలకు పెద్ద ఓదార్పు. ఈశ్వరుడిచ్చిన ఇంత గొప్ప సంపద నాకు ఎవరి వలన లభిస్తున్నది... కోడలు వలన. అంటే వివాహం అనేది ఈ సంపద సృష్టికి మూల కారణం అవుతున్నది. స్థిరచరాస్తులు ఎంత పోగేసుకున్నాం అన్నదానికంటే... కుటుంబంలో మనుషుల మధ్య మనసులు ఎంతగా కలిసాయన్నది ఈ ఆనందాలకన్నింటికీ హేతువవుతుంది. ఆరోగ్యకర సమిష్టి జీవనానికి దారివేస్తుంది.



జీవితాన్ని కూడా గాలికి వదిలేసి సంపాదనలో మునిగితేలేవాడికి సంసార సుఖం తెలియదు. సంపాదన అవసరమే, కానీ సంసార జీవితాన్ని కలిసికట్టుగా ఆస్వాదించకపోతే ఇక గృహస్థాశ్రమ వైభవం ఎక్కడుంది? దాని ఫలాలను నీవెక్కడ ఆస్వాదిస్తున్నావు? అంటే బతకడానికి సంపాదన... అంతే తప్ప సంపాదన కోసం బతకడం కాదు కదా! శ్రీమంతుల ఇంట అయినా పేదల ఇంటయినా... అరమరికలు లేకుండా ఉమ్మడిగా బతకడం వర్తమానంలో సంతోషాలకే కాదు, తరువాత తరాలకు కూడా సంతోషకారకాలను అందిస్తున్నాం. అందుకే కొడుకు, కోడలు, కుమార్తె, అల్లుడు, తల్లిదండ్రులు, అత్తమామలు, తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు, మనుమలు.. ఇదంతా గొప్ప సంపద. ఈ సంపదకు మూలం వివాహ వ్యవస్థ. అందుకే గృహస్థాశ్రమ ప్రవేశం ఒక వైభవానికి నాంది.

సినిమా

రాకీ మాటలు మొదలు



● విశ్వక్ సేన్

మెకానిక్ రాకీగా టైటిల్ రోల్‌లో విశ్వక్ సేన్ నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విశ్వక్ సేన్ ఆదివారం తన రాకీ పాత్రకు డబ్బింగ్ మొదలుపెట్టారు. ''మంచి మాస్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గేర్, ఫస్ట్ సాంగ్‌కి మంచి స్పందన లభించింది'' అని చిత్రబృందం పేర్కొంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 31న ఈ చిత్రం విడుదల కానుంది. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కటసాని.

పవర్‌ఫుల్ రోల్



● శివ రాజ్ కుమార్

శివన్నగా పాపులర్ అయిన కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ కెరీర్‌లోని 131వ సినిమా పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. కన్నడ, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి కార్తీక్ అద్వైత్ దర్శకుడు. పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో ఈ చిత్రాన్ని ఎస్ఎన్ రెడ్డి, సుధీర్ .పి నిర్మిస్తున్నారు. ''శివ రాజ్ కుమార్ ఓ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్న ఈ చిత్రంపై ఆయన అభిమానులకు భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలు చేరుకునే విధంగా దర్శకుడు ఈ చిత్రాన్ని డిజైన్ చేశారు. ఇతర నటీనటుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: ఎ.జె. శెట్టి.

సెలబ్రిటీ నీకన్నా ఎవడురా...

''పైసా లేకున్నా మాయా.. పనేం లేకున్నా నాలాంటోడ్ని బతుక్కేమీ పర్లేదు...'' అంటూ సాగుతుంది 'బాసే హే..' పాట. 'సుడిగాలి' సుధీర్ హీరోగా నటిస్తున్న 'జీ.ఓ.ఎ.టీ' (గోట్) సినిమాలోనిది ఈ పాట. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మొగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్నా ఎవడురా' అనే పాట లిరికల్



● సుధీర్

వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యంలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను దీపక్ బ్లూ ఆలపించారు. జీతూ మాస్టర్ కొరియోగ్రాఫర్. ''హీరో క్యారెక్టరైజేషన్‌ని వివరించే ఇంట్రడక్షన్ సాంగ్ ఇది. టాకీ పార్టు దాదాపు పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటల షూట్ మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయి'' అని నిర్మాత చంద్రశేఖర్ చెప్పారు.

ఆ పెద్దలు వేసిన బాటలో నడుస్తున్నాం

– కొరియోగ్రాఫర్ జానీ



● జానీ, శేఖర్

''ప్రభుదేవాగారు చేసిన 'వెన్నెలవే.. వెన్నెలవే' ('మెరుపు కలలు' సినిమాలోనిది) పాట నాకు చాలా ఇష్టం. ఈ పాటకు జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఈ తరహా పాటను నేనూ చేయాలని కల కనే వాడిని. ఆ అవకాశం ధనుష్‌గారి 'తిరుచిత్రాంబలమ్'తో దక్కింది. అక్కడ (తమిళం) ఎంతోమంది కొరియోగ్రాఫర్స్ ఉన్నా ఈ పాటకు కొరియోగ్రఫీ చేసేందుకు ధనుష్‌గారు నన్నే పిలిపించారు'' అని జానీ మాస్టర్ అన్నారు. ఇటీవల 70వ జాతీయ సినీ అవార్డ్స్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అవార్డ్స్‌లో కొరియోగ్రఫీ విభాగంలో 'తిరుచిత్రాంబలమ్' సినిమాలోని 'మేఘం కరుక్కద' పాటకుగాను జాతీయ అవార్డు గెల్చుకున్నారు జానీ మాస్టర్. ఈ సందర్భంగా ఆయనకు తెలుగు చిత్ర ప్రముఖుల సమక్షంలో సన్మానం జరిగింది. జానీ మాస్టర్ మాట్లాడుతూ– ''మేము ఇలాంటి విజయాలు సాధిస్తున్నామంటే అందుకు ముక్కురాజు మాస్టర్, డ్యానర్స్ అసోసియేషన్ నాయకుల కృషే కారణం. ఎన్నో అవమానాలు ఎదుర్కొని మద్రాస్ నుంచి తెలుగు డ్యాన్సర్స్‌ను ఇక్కడికి తీసుకొచ్చి, అసోసియేషన్ స్థాపించి నిలబెట్టారు ముక్కురాజు మాస్టర్. ఆ పెద్దలు వేసిన బాటలో మేమంతా ముందుకెళ్తున్నాం'' అని తెలిపారు. ''నేను, గణేశ్, జానీ... ఒకేసారి కెరీర్ స్టార్ట్ చేశాం. ఇప్పుడు జానీ మాస్టర్‌కు జాతీయ అవార్డు రావడం చాలా సంతోషాన్నిచ్చింది'' అన్నారు శేఖర్ మాస్టర్.



● ఖుషీ కపూర్

సర్జరీ చేయించుకున్నా!

ప్రముఖ దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె, నటి ఖుషీ కపూర్‌ను కొందరు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఈ ప్రశంసలకు కారణం ఉంది. ఇంతకీ విషయం ఏంటంటే... చిన్నతనంలో తన అమ్మతో కలిసి ఖుషీ కపూర్ ఓ సినిమా వేడుకకు హాజరయ్యారు. అలాగే ఇటీవల తాను నటించిన 'ది ఆర్చీస్' ఫిల్మ్ ప్రీమియర్ ఈవెంట్‌కు ఖుషీ వెళ్లారు. ఈ రెండు వీడియోలను గమనించిన కొందరు నెటిజన్లు ఖుషీ కపూర్ ముఖంలో ఏదో మార్పు ఉందని సోషల్ మీడియాలో కామెంట్స్ చేయడం ప్రారంభించారు. వీటిని గమనించిన ఖుషీ కపూర్ తాను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్నానని, ముక్కు ఆకారం మారిందనీ సోషల్ మీడియాలో స్పందించారు. దీంతో ఖుషీ కపూర్ నిజాయితీని కొందరు నెటిజన్లు అభినందిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ''చాలామంది హీరోయిన్లు ఇలా సర్జరీలు చేయించుకుంటారు. కానీ బయటకు చెప్పరు... ఒప్పుకోరు. అయితే ఖుషీ ధైర్యంగా చెప్పింది. ఆమె నిజాయితీని మెచ్చుకోవాలి'' అని నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు. ఇక ప్రస్తుతం తమిళ హిట్ ఫిల్మ్ 'లవ్ టుడే' హిందీ రీమేక్‌తో ఖుషీ కపూర్ బిజీగా ఉన్నారని, ఈ చిత్రంలో ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్నారని బాలీవుడ్ భోగట్టా.


ప్రేమ అందరిది...



● హర్ష రోషన్, హారిక

హర్ష రోషన్, హారిక జంటగా భాస్కర్ రామ్ దర్శకత్వంలో రూపొందుతున్న ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'వాట్సప్ రోమియో'. 'వీడి ప్రేమ అందరిది' అనేది ఉపశీర్షిక. భిక్షమయ్య నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో భాస్కర్ రామ్ మాట్లాడుతూ– ''పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రాపర్‌గా గైడ్ చేస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారు అనేది ఈ చిత్రం ప్రధానాంశం. రాజమౌళి, ప్రశాంత్ నీల్ వంటి పెద్ద దర్శకుల సినిమాలు, కొన్ని బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలకూ టెక్నికల్ విభాగంలో పని చేశాను. తెలుగులో నా రెండో మూవీ 'వాట్సప్ రోమియో'. తొలి చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఉంది. మరాఠీలో నేను చేసిన 'దిల్.. దోస్తీ.. దునియా దారీ' సినిమా రిలీజ్‌కు సిద్ధం అవుతోంది'' అని అన్నారు. ''ఓ వినూత్న కథతో 'వాట్సప్ రోమియో'ని నిర్మిస్తున్నాం'' అని చెప్పారు భిక్షమయ్య.

మోహన్‌లాల్‌కు అస్వస్థత



ప్రముఖ నటుడు మోహన్‌లాల్ అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం ఆయన కొచ్చిలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. శ్వాస సంబంధిత సమస్య, తీవ్రమైన జ్వరం, కండారల నొప్పితో మోహన్‌లాల్ ఇబ్బందిపడుతున్నారని, దీంతో ఆయన ఐదు రోజులు విశ్రాంతి తీసుకోవాలని, అలాగే జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకూడదని మోహన్‌లాల్ పేరిట ఓ హెల్త్ బులెటిన్ వైరల్ అవుతోంది. ఆ హెల్త్ బులెటిన్‌లో 16వ తేదీ అని ఉంది. ప్రస్తుతం మోహన్‌లాల్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆయన అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న వార్తలు కూడా మాలీవుడ్‌లో తెరపైకి వచ్చాయి. కాగా మోహన్‌లాల్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

మన కుటుంబం



● సుమన్

సుమన్ లీడ్ రోల్‌లో రూపొందిన చిత్రం 'మన కుటుంబం'. మురళీ గౌడ్, అన్నపూర్ణ, కలకొండ నరసింహ ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఆకుల రాఘవ దర్శకత్వంలో కలకొండ హేమలత నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ''గ్రామీణ నేపథ్యంలో సాగే మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందించాం. భాను ప్రసాద్ మంచి పాటలు ఇచ్చారు. త్వరలో మా సినిమాని విడుదల చేయనున్నాం'' అని కలకొండ హేమలత తెలిపారు.

అల్లు అర్జున్ మా అన్నయ్య అంటుంటా! – అంకిత్



రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జోడీగా నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో సుకుమార్ భార్య తబిత సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అంకిత్ కొయ్య మాట్లాడుతూ– ''నా కాలేజ్ టైమ్‌లో అల్లు అర్జున్‌గారితో ఓ కమర్షియల్ యాడ్‌లో నటించే చాన్స్ వచ్చింది. ఆడిషన్ చూసి ఆయనే నన్ను ఎంపిక చేశారు. ఇక 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమా విషయానికి వస్తే... ఈ సినిమాలో నా పాత్ర 'నేను ఈ ఇంట్లో పుట్టలేదు, అల్లు అరవింద్ కొడుకును. అల్లు అర్జున్ మా అన్నయ్య' అనుకునే టైపు. నా పాత్ర మంచి వినోదం పండిస్తుంది. అల్లు అరవింద్‌గారు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ట్రైలర్ చూశారు. అందులో నేను అరవింద్ కొడుకును అని చెబుతా కదా! 'ఏవయ్యా... నా కొడుకు అని చెప్పుకొని తిరుగుతున్నావట' అని సరదాగా ఆయన అన్నారు. ఇక రావు రమేశ్‌గారు సెట్స్‌లో బాగా ప్రోత్సహించారు'' అన్నారు.

సస్పెన్స్.. థ్రిల్



● కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్

కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'. శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా బ్యానర్‌పై పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రేమ, అజయ్, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా టీజర్‌ను పృథ్వీరాజ్ విడుదల చేసి, ''కృష్ణసాయి ఇంటర్నేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా కృష్ణసాయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గతంలో ఆయన డ్రగ్స్ మీద అవగాహన వీడియోలు చేశారు. ఇక ఈ చిత్రంలో నేను మంచి పాత్ర చేశాను'' అన్నారు. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇది. మా చిత్రానికి ఎంఎం శ్రీలేఖ అందించిన మ్యూజిక్ ఓ హైలైట్'' అన్నారు కృష్ణసాయి. ''త్వరలో మా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నాం'' అన్నారు మల్లెల ప్రభాకర్.



డబ్ల్యూటీఏ టూర్‌లో సహజ అరంగేట్రం

మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) టూర్-250 స్థాయి టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి అరంగేట్రం చేసింది. అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో జరుగుతున్న క్లీవ్‌ల్యాండ్ డబ్ల్యూటీఏ-250 టోర్నీ క్వాలిఫయింగ్‌లో సహజ బరిలోకి దిగింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 305వ ర్యాంక్‌లో ఉన్న సహజ తొలి రౌండ్‌లో 2-6, 1-6తో ప్రపంచ 91వ ర్యాంకర్ జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓడిపోయింది.



రన్నరప్ శ్రీరామ్ బాలాజీ జోడీ

ఈ ఏడాది రెండో ఏటీపీ చాలెంజర్ టూర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాలని ఆశించిన భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ శ్రీరామ్ బాలాజీకి నిరాశ ఎదురైంది. డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన సాంటో డొమింగో ఓపెన్ టోర్నీలో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఫెర్నాండో రొంబోలి (బ్రెజిల్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బాలాజీ-రొంబోలి జోడీ 7-6 (7/2), 4-6, 16-18తో హిడాల్గో-వరేలా (మెక్సికో) జంట చేతిలో ఓడిపోయింది. ఈ సీజన్‌లో బాలాజీ కాగ్లియారి ఓపెన్‌లో విజేతగా నిలిచి... పెరుగ్గా, బ్రాన్స్‌వీగ్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.



స్వియాటెక్‌పై సబలెంకా పైచేయి

సిన్సినాటి: సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నీ నుంచి మహిళల టెన్నిస్ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) నిష్క్రమించింది. ఆదివారం జరిగిన సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ సబలెంకా (బెలారస్) 6-3, 6-3తో స్వియాటెక్‌ను బోల్తా కొట్టించి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్వియాటెక్‌తో 12వ సారి తలపడిన సబలెంకా నాలుగోసారి విజయాన్ని అందుకుంది. గంటా 47 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సబలెంకా ఐదు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ఈ సీజన్‌లో ఐదో టోర్నీలో ఫైనల్ చేరిన సబలెంకా తదుపరి ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు చేరుకుంటుంది. జెస్సికా పెగూలా (అమెరికా), పౌలా బదోసా (స్పెయిన్) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో సబలెంకా తలపడతుంది.

విండీస్‌తో భారత్ తొలి పోరు

దుబాయ్: వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొలి పోరులో వెస్టిండీస్‌తో తలపడనుంది. 16 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ షెడ్యూల్‌ను ఆదివారం ఐసీసీ విడుదల చేసింది. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు మలేసియా వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. జనవరి 19న వెస్టిండీస్‌తో తొలి మ్యాచ్ తర్వాత భారత జట్టు 21న మలేసియాతో, 23న శ్రీలంకతో ఆడుతుంది. 2023లో తొలిసారి మహిళల అండర్-19 ప్రపంచకప్ నిర్వహించగా... అందులో షఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. రెండో ఎడిషన్‌లో మొత్తం నాలుగు గ్రూప్‌లలో నాలుగేసి జట్లు పోటీపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, శ్రీలంక, మలేసియాతో కలిసి భారత్ బరిలోకి దిగనుంది.

గ్రూప్‌ల వివరాలు

గ్రూప్ 'ఎ': భారత్, వెస్టిండీస్, శ్రీలంక, మలేసియా.
గ్రూప్ 'బి': ఇంగ్లండ్, పాకిస్తాన్, ఐర్లాండ్, అమెరికా.
గ్రూప్ 'సి': న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవా. గ్రూప్ 'డి': ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్, స్కాట్లాండ్.

ప్రియా మిశ్రా 5-2-14-5

- అదరగొట్టిన భారత 'ఎ' లెగ్ స్పిన్నర్
- చివరి వన్డేలో ఆస్ట్రేలియా 'ఎ'పై టీమిండియా 'ఎ' ఘనవిజయం



క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' క్రికెట్ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత 'ఎ' జట్టు 171 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టును చిత్తు చేసింది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు ఓడి సిరీస్ కోల్పోయిన భారత్... ఆఖరి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత 'ఎ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. రాఘవి బిష్త్ (64 బంతుల్లో 53; 7 ఫోర్లు), తేజల్ హసాబ్నిస్ (66 బంతుల్లో 50; 7 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. నాలుగో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం జోడించారు. కెప్టెన్ మిన్ను మణి (56 బంతుల్లో 34), సంజన (49 బంతుల్లో 40; 4 ఫోర్లు) రాణించారు. ఆసీస్ 'ఎ' బౌలర్లలో మైట్లాన్ బ్రౌన్ (3/39), నికోలా హాన్‌కాక్ (2/35), చార్లీ నాట్ (2/26) ఆకట్టుకున్నారు. 244 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 'ఎ'ను భారత లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా హడలెత్తించింది. ఢిల్లీకి చెందిన ప్రియా తన తొలి బంతికే వికెట్ పడగొట్టింది. ఆ తర్వాత కూడా తన జోరు కొనసాగించిన ప్రియా ఆస్ట్రేలియా బ్యాటర్లను వరుస విరామాల్లో పెవిలియన్‌కు పంపించింది. దాంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 22.1 ఓవర్లలోనే కేవలం 72 పరుగులకు ఆలౌటైంది. ఇప్పటికే టి20 సిరీస్‌ను 0-3తో కోల్పోయిన భారత 'ఎ' జట్టు వన్డే సిరీస్‌ను 1-2తో చేజార్చుకుంది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి ఏకైక అనధికారిక టెస్టు ప్రారంభం కానుంది.

దక్షిణాఫ్రికాదే సిరీస్

రెండో టెస్టులో 40 పరుగుల తేడాతో ఓడిన వెస్టిండీస్



ప్రావిడెన్స్: బ్యాటర్ల కృషికి బౌలర్ల సహకారం తోడవడంతో... వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. విండీస్‌పై సఫారీ జట్టుకు ఇది వరుసగా 10వ టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 263 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 66.2 ఓవర్లలో 222 పరుగులకు ఆలౌటైంది. గుడకేశ్ మోతీ (59 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కవెమ్ హాడ్జ్ (38 బంతుల్లో 29; 6 ఫోర్లు), జోషువా డ సిల్వా (51 బంతుల్లో 27; 1 ఫోర్), కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (55 బంతుల్లో 25; 3 ఫోర్లు), వారికన్ (50 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, కగిసో రబాడ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులు చేయగా.. వెస్టిండీస్ 144 చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 246 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేసి విండీస్ ముందు మంచి లక్ష్యాన్ని నిర్దేశించింది. వియాన్ ముల్డర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'... కేశవ్ మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభం కానుంది.



దీప్తి సిక్సర్... లండన్ విన్నర్

మహిళల హండ్రెడ్ టోర్నీ ఫైనల్లో మెరిసిన భారత ఆల్‌రౌండర్

- 'సిక్స్'తో లండన్ స్పిరిట్ జట్టును గెలిపించిన దీప్తి శర్మ



విన్నింగ్ షాట్ తర్వాత దీప్తి శర్మ సంబరం

లండన్: 'హండ్రెడ్' మహిళల క్రికెట్ టోర్నీకి అద్భుత ముగింపు లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో లండన్ స్పిరిట్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో 2021లో హండ్రెడ్ టోర్నీ (ఇన్నింగ్స్‌కు 100 బంతులు) మొదలైంది. విఖ్యాత లార్డ్స్ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్లో హీతెర్ నైట్ సారథ్యంలోని లండన్ స్పిరిట్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో టామీ బీమోంట్ నాయకత్వంలోని వెల్ష్ ఫైర్ జట్టును ఓడించింది. లండన్ స్పిరిట్ జట్టుకు టైటిల్ దక్కడంలో భారత క్రికెటర్ దీప్తి శర్మ (16 బంతుల్లో 16 నాటౌట్; 1 సిక్స్) కీలకపాత్ర పోషించింది. లండన్ జట్టు విజయానికి చివరి 5 బంతుల్లో 6 పరుగులు అవసరమయ్యాయి. వెల్ష్ ఫైర్ జట్టు బౌలర్, విండీస్ ఆల్‌రౌండర్ హీలీ మాథ్యూస్ చివరి ఐదు బంతులు వేయడానికి వచ్చింది. తొలి బంతికి దీప్తి... రెండో బంతికి చార్లీ డీన్ చెరో సింగిల్ తీశారు. దాంతో లండన్ విజయ సమీకరణం 3 బంతుల్లో 4 పరుగులుగా మారింది. ఈ దశలో హీలీ వేసిన మూడో బంతిని దీప్తి శర్మ సిక్సర్‌గా మలిచి లండన్ విజయాన్ని ఖరారు చేసింది. రెండు బంతులు మిగిలి ఉండగా లండన్ స్పిరిట్ చాంపియన్‌గా అవతరించింది. అంతకుముందు వెల్ష్ ఫైర్ జట్టు 100 బంతుల్లో 8 వికెట్లకు 115 పరుగులు సాధించింది. జెస్ జొనాసెన్ (41 బంతుల్లో 54; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... టామీ బీమోంట్ (16 బంతుల్లో 21; 4 ఫోర్లు), హీలీ మాథ్యూస్ (26 బంతుల్లో 22; 3 ఫోర్లు) రాణించారు. లండన్ స్పిరిట్ బౌలర్లలో ఇవా గ్రే, సారా గ్లెన్ రెండు వికెట్ల చొప్పున తీయగా... దీప్తి శర్మ, తారా నోరిస్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం లండన్ స్పిరిట్ జట్టు 98 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. జార్జియా రెడ్మెన్ (32 బంతుల్లో 34; 3 ఫోర్లు), హీతెర్ నైట్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు), డానియెలా గిబ్సన్ (9 బంతుల్లో 22; 5 ఫోర్లు) దూకుడుగా ఆడారు. వెల్ష్ ఫైర్ జట్టు బౌలర్లలో షబ్నిమ్ మూడు వికెట్లు పడగొట్టింది. గత ఏడాది విజేతగా నిలిచిన సదరన్ బ్రేవ్ జట్టులో భారత జట్టు వైస్ కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన సభ్యురాలిగా ఉండటం విశేషం.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-నార్త్ రైల్వేలో 4,096 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ రైల్వే పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 4,096.
» ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు: క్లస్టర్ లక్నో, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్.
» ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్,హామర్ మ్యాన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
» అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 16.09.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 16.08.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.09.2024.
» మెరిట్ జాబితా వెల్లడి: నవంబర్ 2024.
» వెబ్‌సైట్: http://www.rrcnr.org

డా.వైఎస్సార్ ఏఎఫ్‌ఏయూ, కడపలో బీఆర్క్ ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2024-25విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ/ ప్రైవేట్/మైనారిటీ/అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బీఆర్క్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» కోర్సుల వివరాలు:బీఆర్క్(రెగ్యులర్)డిగ్రీ కోర్సు
» అర్హత: మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. నాటా-2024 పరీక్షలో వ్యాలిడ్ స్కోరు సాధించి ఉండాలి.
» ఎంపిక విధానం: నాటా-2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 12.08.2024.
» ఆన్‌లైన్‌రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 19.08.2024.
» సర్టిఫికేట్ వెరిఫికేషన్ తేది: 13.08.2024 నుంచి 20.08.2024 వరకు
» వెబ్ ఆప్షన్ తేదీలు: 26.08.2024, 27.08.2024.
» మొదట విడత ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది: 29.08.2024.
» తరగతుల ప్రారంభం: 02.09.2024.
» వెబ్‌సైట్: https://apsche.ap.gov.in/arch

ఎయిమ్స్ బిలాస్‌పూర్‌లో 68 టెక్నీషియన్ పోస్టులు

బిలాస్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలో బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్)లో ఒప్పంద ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్, టెక్నీషియన్ (ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 68.
» పోస్టుల వివరాలు: ల్యాబ్ టెక్నీషియన్-36, టెక్నీషియన్(ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ)-32.
» అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో.. బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.35,400.
» వయసు: 18 నుంచి 35 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రాజెక్ట్ మేనేజర్ (హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 19.08.2024.
» వెబ్‌సైట్: www.becil.com

నల్సార్ యూనివర్శిటీలో 33 ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లాలో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 35.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-08, ప్రొఫెసర్-09.
» విభాగాలు: లా, మేనేజ్‌మెంట్, సోషియాలజీ, ఎకనామిక్స్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, నెట్/సెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.09.2024.
» వెబ్‌సైట్: www.nalsar.ac.in



ఇంజనీరింగ్ స్పెషల్

» ఏఐ, జెన్ ఏఐలకు పెరుగుతున్న ప్రాధాన్యం
» ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకూ డిమాండ్
» తాజా సాంకేతికతలు సొంతం చేసుకుంటేనే భవిత
» బీటెక్ తొలి ఏడాది నుంచే ఏఐపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత

ఏఐ స్కిల్స్‌తో కెరీర్ షైనింగ్!

జాతీయ స్థాయిలో.. బీటెక్ ప్రవేశాల ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది! నిట్‌లు, ఐఐటీలతోపాటు రాష్ట్రాల స్థాయిలో ఇంజనీరింగ్ కళాశాలల్లో.. త్వరలోనే తరగతులు ప్రారంభంకానున్నాయి. నేటి ఏఐ యుగంలో బీటెక్‌లో చేరిన లక్ష్యం నెరవేరాలంటే.. అందుకు తగ్గ లేటెస్ట్ టెక్నాలజీని, స్కిల్స్‌ను అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత!! ఇందుకోసం బీటెక్ మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాల్సిన పరిస్థితి! ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్‌లో తాజా ట్రెండ్స్, సంస్థలు కోరుకుంటున్న స్కిల్స్, వాటిని అందిపుచ్చుకోవడానికి మార్గాలపై ప్రత్యేక కథనం..

బీటెక్‌లో ప్రవేశం కోసం ఎన్నో ఎంట్రన్స్‌లు రాసి సీటు సొంతం చేసుకున్న విద్యార్థులు.. కాలేజ్‌లో అడుగు పెట్టాక క్లాస్ రూమ్ తరగతులకే పరిమితం కాకుండా నూతన టెక్నాలజీ ట్రెండ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.నిరంతరం మార్కెట్ ట్రెండ్స్‌ను తెలుసుకుంటూ..తాజా సాంకేతికను అనుసరిస్తూ.. వాటిలో రాణించేందుకు కృషి చేయాలి. అప్పుడే జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది. ఇంజనీరింగ్‌లో చేరిన లక్ష్యం నెరవేరుతుంది.

మారుతున్న ధోరణి

నేడు సంస్థల కార్యకలాపాలు, వాటి దృక్పథంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నూతన సాంకేతికతలను కంపెనీలు వేగంగా అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు మొదలు కార్పొరేట్ సంస్థల వరకూ.. డిజిటలైజేషన్ ఆధారిత కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. వీటిలో నైపుణ్యాలు ఉన్న వారికే ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా జెన్ ఏఐ, ఏఐ, డిజిటలైజేషన్, ఐఓటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఆర్ అండ్ డీ విభాగాలపై కంపెనీలు ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. కాబట్టి వీటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులు బీటెక్ మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాలి.

జెన్ ఏఐ

ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న నూతన టెక్నాలజీ... జెన్ ఏఐ (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్). టెక్స్ట్, ఇమేజెస్, వీడియో, ఆడియో, సాఫ్ట్‌వేర్ కోడ్‌లకు సంబంధించి క్లయింట్/యూజర్ అవసరాలకు అనుగుణంగా వాస్తవ కంటెంట్‌ను రూపొందించే టెక్నాలజీగా జెనరేటివ్ ఏఐను పేర్కొంటున్నారు. మనకు ఇప్పుడు బాగా వినిపిస్తున్న చాట్ జీపీటీ, గూగుల్ బార్డ్ వంటివి జెనరేటివ్ ఏఐ కోవలోకే వస్తాయి. వీటిని ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హెల్త్‌కేర్, తయారీ, ఫిన్‌టెక్, మీడియా, అడ్వర్టయిజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్నారు. 2026 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 100 మిలియన్‌ల మంది జెనరేటివ్ ఏఐను వాడతారని అంచనా. అందుకే ఇంజనీరింగ్ విద్యార్థులు జెన్ ఏఐ నైపుణ్యాల సాధనకు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

ఇప్పుడు అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత కార్యకలాపాలు విస్తృతం అవుతున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో కార్యకలాపాలు సజావుగా సాగాలంటే.. సంబంధిత ప్రోగ్రామ్‌ల రూపకల్పనకు మానవ మేధస్సు చాలా అవసరం. ఫలితంగా రానున్న కాలంలో ఏఐ యువతకు బెస్ట్ కెరీర్ ఆప్షన్‌గా నిలవనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో రాణించేందుకు ప్రోగ్రామింగ్, కోడింగ్ నైపుణ్యాలు, మ్యాథమెటికల్ స్కిల్స్, అల్గారిథమ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్ వంటి వాటిని మెరుగుపరచుకోవాలి.

డేటా సైన్స్, డేటా అనలిటిక్స్

కార్పొరేట్ రంగం మొదలు మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్, బ్యాంకింగ్.. ఇలా అన్ని రంగాల్లోనూ కార్యకలాపాల నిర్వహణలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న విభాగం.. డేటా సైన్స్, డేటా అనలిటిక్స్. సంస్థలు బిగ్ డేటాపై ఆధారపడి వినియోగదారులను పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, అనలిటిక్స్ విభాగాల్లో నైపుణ్యాలను సొంతం చేసుకున్న వారికి జాబ్ మార్కెట్‌లో డేటా ఇంజనీర్స్, డేటా అనలిస్ట్ ఉద్యోగాల్లో డిమాండ్ నెలకొంది.

ఐఓటీ

బీటెక్ విద్యార్థులు దృష్టి సారించాల్సిన మరో సాంకేతిక.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ఇంటర్నెట్ లేదా వైర్‌లెస్ సెన్సార్ల ఆధారంగా ఆయా కార్యకలాపాలను పూర్తి చేసే ఈ సాంకేతికతను ఇప్పుడు అన్ని రంగాల్లోనూ అమల్లోకి వస్తోంది. రిటైల్, హెల్త్‌కేర్, ఆటోమోటివ్స్, ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని సంస్థలు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు విస్తృత ప్రాధాన్యం ఇస్తున్నాయి. తాజాగా ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. సంస్థలో ఒక ఉత్పత్తిని రూపొందించే క్రమంలో అన్ని విభాగాలను అనుసంధానం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇంజనీరింగ్ విద్యార్థులు కోడింగ్, ప్రోగ్రామింగ్, డేటా అనలిటిక్స్, అప్లికేషన్ డిజైన్, హార్డ్ వేర్ నెట్ వర్కింగ్, డాట్ నెట్, ఐపీ నెట్ వర్కింగ్ మొబైల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై పట్టు సాధిస్తే చక్కటి కెరీర్ అవకాశాలు లభిస్తాయి.

సైబర్ సెక్యూరిటీ

ఈ-కామర్స్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్.. ఇలా అన్ని రంగాల్లోనూ ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ కార్యకలాపాలు సాగుతున్న నేపథ్యంలో.. అవి సాఫీగా సాగేలా.. వాటికి ముప్పు వాటిల్లని రీతిలో.. చర్యలు తీసుకునే సైబర్ సెక్యూరిటీకి కంపెనీలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో థ్రెట్ డిటెక్షన్, ఎథికల్ హ్యాకింగ్, డేటా ప్రొటెక్షన్ వంటి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా ఆకర్షణీయమైన కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు.

రెన్యువబుల్ ఎనర్జీ

జాతీయ స్థాయిలో పునరుత్పాదక శక్తి రంగంలో సుస్థిరత పెరిగేలా ప్రభుత్వ విధానాలు అమలు అవుతున్నాయి. రెన్యువబుల్ ఎనర్జీ, సోలార్ పవర్, ఎనర్జీ ఎఫిషియన్సీ విభాగాలు బీటెక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. వీరు ఈ విభాగాల్లో నైపుణ్యాలు సొంతం చేసుకుంటే పునరుత్పాదక ఇంధన రంగంలో అద్భుత అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

ఆర్ అండ్ డీ

భారత్ రీసెర్చ్, డెవలప్‌మెంట్‌పై దృష్టిసారిస్తోంది. ఇది రానున్న రోజుల్లోనూ మరింత వేగం పుంజుకోనుంది. ప్రస్తుతం ఆర్ అండ్ డీపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ తదితర ప్రభుత్వ రంగ ఇన్‌స్టిట్యూట్స్, అదే విధంగా పరిశోధన లేబొరేటరీలు, కార్పొరేట్ రీసెర్చ్ ల్యాబ్స్ వంటివి రీసెర్చ్ కార్యకలాపాల నిర్వహణకు సుమున్నత వేదికలుగా నిలవనున్నాయి. బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ, ఏరోస్పేస్.. ఇలా విభిన్న విభాగాలో రీసెర్చ్ చేసేందుకు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

నైపుణ్య సాధనకు మార్గాలు

ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటి తాజా నైపుణ్యాలు కీలకంగా నిలుస్తున్నాయి. వీటిని పెంచుకునేందుకు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. పలు ఇన్‌స్టిట్యూట్స్ బీటెక్ స్థాయిలోనే ఏఐ-ఎంఎల్ బ్రాంచ్‌తో ప్రత్యేక ప్రోగ్రామ్స్ ప్రవేశపెట్టగా.. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్స్ ఎంటెక్ స్థాయిలో వీటిని అందిస్తున్నాయి. ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో కోర్సులతోపాటు ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌కు సంబంధించి ఐబీఎం, సిస్కో, మైక్రోసాఫ్ట్, వీఎం వేర్, ఇంటెల్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఆటోమేషన్, ఐఓటీపై ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. విద్యార్థులు వీటి ద్వారా నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

ఆన్‌లైన్ కోర్సులు

అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా టెక్ స్కిల్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ విధానంలో మూక్స్ పేరుతో కోర్సులను అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

నిరంతర అధ్యయనం

సాంకేతిక రంగంలో వస్తున్న తాజా మార్పులకు అనుగుణంగా శిక్షణ, నైపుణ్యాలతోపాటు నిరంతరం అధ్యయనం, పరిశీలన కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్ట్‌ను చదవడానికే పరిమితం కాకుండా.. వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసుకునే దృక్పథం చాలా అవసరమని పేర్కొంటున్నారు.

అదే విధంగా.. ప్రాజెక్ట్ వర్క్, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు తాజా సాంకేతికతలకు సంబంధించినవిగా ఉండేలా చూసుకోవాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు సూచిస్తున్నారు. తద్వారా లేటెస్ట్ టెక్నాలజీస్‌పై అకడమిక్ దశలో ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. అదే విధంగా కొత్త టెక్నాలజీకి సంబంధించి ఇండస్ట్రీ వర్గాలు తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరుపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలని, తద్వారా స్కిల్స్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,331	397
80,437	24,541

విదేశీ సూచీలు


సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,632	▲	37
డోజోన్స్	40,660	▲	97
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,311	▼	36
డాక్స్	18,322	▲	139
హాంగ్‌సెంగ్	2,879	▲	2
నికాయ్	38,063	▲	1,336

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.54	84.56
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.90	109.48
€	యూరో	ఎస్‌బీఐ	91.10	93.49
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.82	57.07
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.71	56.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.35	66.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.84	12.67

రియల్టీలో సిప్ చేద్దామా!



వాణిజ్య ప్రాపర్టీపై పెట్టుబడి పెట్టాలంటే సామాన్య ఇన్వెస్టర్లకు అయ్యే పనేనా..! ఎక్కడ చూసినా ధరలు గణనీయంగా పెరిగిపోయిన తరుణంలో.. కొనాలంటే పెద్ద మొత్తమే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అయితే, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మాదిరే క్రమానుగత పెట్టుబడి (సిప్) విధానంలో వాణిజ్య ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేయాలన్న ఆకాంక్షలకు ఆచరణ మార్గమే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్‌లు). వీటిలో ఇన్వెస్ట్ చేయడం ఎలా? వచ్చే ప్రయోజనం ఎంత మేర? తదితర వివరాలను అందించే కథనమే ఇది.
– సాక్షి, బిజినెస్ డెస్క్

Real Estate Investment Trust (REIT)

రూ.140 ఉన్నా పెట్టుబడికి వీలు
- ఇందుకు వీలు కల్పించేవే రీట్‌లు
- వీటి నిర్వహణలో వాణిజ్య ప్రాపర్టీలు
- వచ్చే రాబడి వాటాదారులకు పంపిణీ
- స్థిరమైన ఆదాయానికి మార్గం
- పన్ను పరంగానూ అనుకూలమే

రీట్ అంటే...?



రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్‌లు) పేరులో ఉన్నట్టుగానే.. వివిధ రకాల వాణిజ్య ప్రాపర్టీలపై పెట్టుబడులు పెడుతుంటాయి. మ్యూచువల్ ఫండ్స్ మాదిరే ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమీకరిస్తుంటాయి. వాటిని వాణిజ్య ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేస్తాయి. ఆయా ప్రాపర్టీలను అద్దెకు, లీజుకు ఇస్తుంటాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి వాటాదారులకు క్రమం తప్పకుండా పంచుతుంటాయి. ఆఫీసులు, మాల్స్, ఇండస్ట్రియల్ పార్క్‌లు, వేర్‌హౌస్‌లు, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్ సెంటర్లు తదితర వసతులపై రీట్‌లు ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అదే మ్యూచువల్ ఫండ్స్ అయితే బాండ్లు, గోల్డ్, స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఉదాహరణకు ఓ పది మంది స్నేహితుల బృందం ఉందనుకుందాం. తలో రూ.10 లక్షలు వేసుకుని రూ.కోటితో ఒక వాణిజ్య భవనాన్ని సమకూర్చుకున్నారు. దాన్ని ఓ కార్పొరేట్ సంస్థ కార్యాలయానికి లీజుకు ఇచ్చారు. లీజు రూపంలో వచ్చే మొత్తం నుంచి 90 శాతాన్ని పది మంది డివిడెండ్ కింద పంచుకుంటారు. రీట్‌లో ఇదే మాదిరి జరుగుతుంది. కాకపోతే రీట్‌ల నిర్వహణలో ఇలాంటి వాణిజ్య ఆస్తులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. అమెరికా, జపాన్ తదితర దేశాల్లో రీట్‌లకు ఎంతో ఆదరణ ఉంది. కానీ మన దేశంలో వీటిపై అంత అవగాహన లేదు. అందుకే ఇవి పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలుగా వీటికి తగినంత ప్రచారం కల్పించేందుకు సెబీ తన వంతు కృషి చేస్తోంది. స్టాక్స్, ఫండ్స్ మాదిరే రీట్‌లు కూడా సెబీ పర్యవేక్షణ కిందకే వస్తాయి. సెబీ నిబంధనల ప్రకారం రీట్‌లు 80% పెట్టుబడులను అద్దెను సమ కూర్చే ఆస్తులపైనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మరో 20% మేర పెట్టుబడులను నిర్మాణంలోని ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేయవచ్చు. అలాగే, వచ్చే అద్దె ఆదాయంలో నిర్వహణ వ్యయాలు, పన్నులు పోను మిగిలిన నికర మొత్తం నుంచి 90 శాతాన్ని ఇన్వెస్టర్లకు పంపిణీ చేయాలి.

ప్రయోజనాలు...

అద్దె ఆదాయం



రీట్‌లకు లీజు రూపంలో ఆదాయం వస్తుంటుంది. దీన్ని వాటాదారులకు డివిడెండ్ రూపంలో పంపిణీ చేస్తాయి. సాధారణంగా ప్రతి మూడేళ్లకోసారి 15 శాతం అద్దె పెంచాలన్న నిబంధనతో లీజు ఒప్పందాలు చేసుకుంటుంటాయి. దీంతో వాటాదారులకు వచ్చే డివిడెండ్ ఆదాయం కూడా కాలక్రమేణా పెరుగుతూ వెళుతుంది. కొత్త లీజు సమయంలో అప్పటికి పెరిగిన మార్కెట్ ధరల ప్రకారమే ఒప్పందాలు చేసుకుంటుంటాయి.

వడ్డీ ఆదాయం



రీట్‌లు తమవద్ద నున్న మిగులు నిధులపై వడ్డీ రాబడిని పొందుతుంటాయి. లేదా ప్రాపర్టీ లీజుదారులకు రుణాలు సమకూర్చడం ద్వారా వాటిపై ఆదాయం పొందుతాయి. ఈ రూపంలోనూ వాటాదారులకు ఆదాయం లభిస్తుంది. మన దేశంలో రీట్‌లు ప్రధానంగా టైర్–1 పట్టణాల్లోని ప్రాపర్టీలపైనే ఎక్కువ పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. కనుక వీటి ధరలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది.

పనితీరు భిన్నం



స్టాక్స్, బాండ్లు తదితర సాధనాలకు భిన్నంగా రీట్ స్పందన ఉంటుంది. అంటే స్టాక్స్ లేదా బాండ్ల ధరలు పడిపోతే రీట్‌ల ధరలు కూడా పడిపోవాలనేమీ లేదు. ఆ సమయంలో ఇవి స్థిరంగా ఉండొచ్చు. లేదా లాభాలను ఇవ్వొచ్చు. ఒకవేళ రీట్‌ల ధరలు కూడా తగ్గినా.. ఇతర సాధనాల స్థాయిలో ఉండదు. ఈ విధంగా పెట్టుబడుల్లో కొంత భాగానికి రిస్క్ తగ్గుతుంది.

పెట్టుబడి విలువ వృద్ధి

రీట్‌ల నిర్వహణలోని ప్రాపర్టీల విలువలు కొంత కాలానికి సహజంగా పెరుగుతుంటాయి. తమ నిర్వహణలోని ఆస్తుల విలువలను ఎప్పటికప్పుడు రీట్‌లు మదింపు చేసుకోవాలి. దీంతో పెరిగిన ప్రాపర్టీల విలువ రీట్ యూనిట్ విలువపై ప్రతిఫలిస్తుంది. అలాగే, ఆర్థికంగా లాభదాయకం లేని, లీజు పరంగా అంత డిమాండ్ లేని ప్రాపర్టీలను విక్రయించి, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ప్రాపర్టీలపై ఇవి ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇది కూడా పెట్టుబడి విలువ వృద్ధికి, డివిడెండ్ వాటా పెంపునకు దారితీస్తుంది. అంతేకాదు, కొంత మేర రుణాలు తీసుకుని కొత్త ప్రాపర్టీలపై వెచ్చించేందుకు సైతం వీటికి వెసులుబాటు ఉంటుంది. కనుక కాలక్రమంలో, కంపెనీ నగదు ప్రవాహాలు, నికర విలువ పెరుగుతున్న కొద్దీ.. కొత్త ప్రాపర్టీలను అదనంగా సమకూర్చుకుంటాయి. ఆ విధంగానూ పెట్టుబడుల విలువ వృద్ధి చెందుతుంది. ఆదాయం పెరుగుతుంది.



మెరుగైన లిక్విడిటీ

భౌతిక ప్రాపర్టీ కొనుగోలు చేస్తే విక్రయించడానికి చాలా సమయం తీసుకోవచ్చు. అదే రీట్‌లను పనిదినాల్లో ఏ రోజు అయినా విక్రయించుకుని, మరుసటి రోజే ఆ మొత్తాన్ని బ్యాంక్ ఖాతాలో పొందొచ్చు. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయి ఉంటాయి కనుక లిక్విడిటీ సమస్య ఉండదు.



లిస్టెడ్ రీట్‌లు...



బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ రీట్‌లు స్టాక్ ఎక్స్ఛేంజీలు లిస్ట్ అయి ఉన్నాయి. ఇవన్నీ కూడా త్రైమాసికానికి ఒకసారి డివిడెండ్‌ను పంపిణీ చేస్తున్నాయి.

ఎలా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు?



రీట్‌లో పెట్టుబడులకు ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాలు తప్పనిసరిగా ఉండాలి. స్టాక్స్‌ను కొనుగోలు చేసినట్టుగానే రీట్ యూనిట్‌లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇవి డీమ్యాట్ ఖాతాలో జమ అవుతాయి.

పన్ను బాధ్యత...

రీట్ పెట్టుబడులపై డివిడెండ్ రూపంలో వచ్చే ఆదాయంపై పన్ను కొంత భిన్నంగా ఉంది. బ్రూక్‌ఫీల్డ్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్‌లు రాయితీతో కూడిన పన్ను రేటును ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 115బీఏఏ కింద ఎంపిక చేసుకోలేదు. ఇవన్నీ స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)పైనే ఇన్వెస్ట్ చేశాయి. కనుక ఇవి పంపిణీ చేసే డివిడెండ్‌పై పన్ను లేదు. ఒకవేళ ఎస్‌పీవీలు రాయితీ రేటును ఎంపిక చేసుకుంటే, అప్పుడు అవి పంపిణీ చేసే డివిడెండ్ పన్ను పరిధిలోకి వస్తుంది. ఇన్వెస్టర్ తనకు వర్తించే శ్లాబు ప్రకారం దీనిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డివిడెండ్‌పై పన్ను వర్తించేట్టు అయితే, రీట్‌లు 10 శాతం టీడీఎస్ కింద తగ్గించి ఆదాయపన్ను శాఖకు జమ చేస్తాయి. ఇన్వెస్టర్లు తమ వార్షిక పన్ను రిటర్నుల్లో దీన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. సొంత ప్రాపర్టీలపై రీట్‌లకు వచ్చే ఆదాయం నుంచి వాటాదారులకు డివిడెండ్ పంపిణీ చేసినా, ఎస్‌పీవీలకు ఇచ్చిన రుణాలపై రీట్‌లకు వచ్చే ఆదాయాన్ని వాటాదారులకు పంపిణీ చేసిన సందర్భాల్లోనూ.. ఇన్వెస్టర్ వ్యక్తిగత ఆదాయానికే కలుస్తుంది.

ఇక రీట్‌లలోని పెట్టుబడులకు స్టాక్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మాదిరే పన్ను నిబంధనలు వర్తిస్తాయి. విక్రయించినప్పుడు వచ్చే లాభంపై మూలధన లాభాల పన్ను చెల్లించాలి. ఏడాదిలోపు విక్రయించగా వచ్చిన లాభంపై 20 శాతం పన్ను, ఏడాది ముగిసిన తర్వాత విక్రయించినప్పుడు వచ్చిన లాభం మొదటి రూ. లక్ష తర్వాత మొత్తంపై 12.5 శాతం చెల్లించాలి.

ఇవి గమనించాలి..



- రీట్‌లు స్వల్పకాలానికి కాకుండా దీర్ఘకాలం కోసమే (ఐదేళ్లు అంతకుమించిన కాలం) పరిశీలించడం సూచనీయం. అప్పుడు మూలధన పెట్టుబడి వృద్ధి సాధ్యపడుతుంది. రియల్ ఎస్టేట్ మార్కెట్ సైక్లికల్‌గా ఉంటుంది. స్వల్పకాలంలో రీట్‌ల ధరలు స్టాక్స్ మాదిరే ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొంత మేర హెచ్చుతగ్గులకు గురికావచ్చు.
- మనదేశంలో ఇప్పటి వరకు కేవలం నాలుగు రీట్‌లే లిస్ట్ అయి ఉన్నాయి. ఇందులో నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ మాత్రం రిటైల్ మాల్స్ ఆస్తులపైనే అధిక శాతం ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన రీట్‌లు ఆఫీస్ ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేసేవి. పనితీరు పోల్చి చూసేందుకు పరిమిత అవకాశాలే ఉన్నాయి.
- ఇన్వెస్ట్ చేసే ముందు ఆయా రీట్‌ల పరిధిలోని ప్రాపర్టీలలో ఆక్యుపెన్సీ రేషియో (భర్తీ రేటు) చూడాలి. లీజుకు తీసుకున్న కంపెనీలు అన్నీ ఒకే రంగంలో కాకుండా భిన్న రంగాలకు చెందినవి అయితే రిస్క్ వైవిధ్యం అవుతుంది. రీట్‌ల నిర్వహణలోని ప్రాపర్టీల నాణ్యత, డిమాండ్ చూడాలి.
- ఆర్థిక సంక్షోభ సమయాల్లో, కరోనా వంటి విపత్తుల సమయాల్లో ఆఫీస్ లీజింగ్ మార్కెట్‌పై ప్రభావం పడొచ్చు. అలాంటి సందర్భాల్లో డివిడెండ్ పంపిణీ, మూలధన పెట్టుబడి విలువ ప్రభావితం కావచ్చు.
- మన దగ్గర స్టాక్స్‌తో పోలిస్తే రీట్‌లకు ప్రాచుర్యం తక్కువ. కనుక స్టాక్ ఎక్స్ఛేంజీల్లో వీటి లిక్విడిటీ (ట్రేడింగ్ వ్యాల్యూమ్) తక్కువగా ఉంటుంది.
- తమకు స్థిరమైన ఆదాయం కావాలని కోరుకునే వారు రీట్‌లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అది కూడా తమ మొత్తం పెట్టుబడుల్లో 10 శాతం వరకు కేటాయించుకోవచ్చన్నది నిపుణుల సూచన.

రాబడులు...

వాణిజ్య రియల్ ఎస్టేట్‌పై వార్షిక రాబడులు 8–10 శాతం మధ్య ఉంటాయి. గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్‌పై రాబడులు ఒక్కోసారి 15 శాతం స్థాయిలో ఉంటాయి. కానీ, మన దేశంలో రీట్‌లపై ప్రస్తుత రాబడులు 10 శాతం లోపే ఉన్నాయి. మన ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత విలువను సంతరించుకుంటుందని నిపుణుల అంచనా. దీనికి తోడు ఈ మార్కెట్ పరిణతి చెందిన కొద్దీ రీట్‌లపై వార్షిక రాబడులు 10 శాతం, అంతకంటే ఎగువ స్థాయికి చేరుకుంటాయని నిపుణుల అంచనా. 2022–2024 మధ్య రీట్‌ల నుంచి డివిడెండ్ రాబడి 6–9 శాతం మధ్య ఉన్నట్టు, పెట్టుబడి విలువలో 12–18 శాతం మేర వృద్ధి ఉన్నట్టు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక చెబుతోంది.

రీట్‌ల ప్రస్తుత ధర

రీట్ పేరు	(16-8-24 నాటికి)
నెక్సస్ సెలక్ట్‌ట్రస్ట్	రూ.138
బ్రూక్‌ఫీల్డ్ ఇండియా..	రూ.268
మైండ్‌స్పేస్ బిజినెస్	రూ.340
ఎంబసీ ఆఫీస్ పార్క్స్	రూ.386



ప్రెస్టీజ్ ఎస్టేట్స్ | బ్రోకరేజ్: యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 1,812 టార్గెట్: రూ. 3,021

ఎందుకంటే: మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ రూ. 21,000 కోట్ల విలువైన ప్రీబుకింగ్స్ (అమ్మకాలు) సాధించింది. ఈ బాటలో ప్రస్తుత ఏడాది (2024–25)లోనూ రూ. 26,000–27,000 కోట్ల విలువైన ముందస్తు అమ్మకాలను అంచనా వేస్తోంది. ఇందుకు రూ. 60,000 కోట్ల విలువైన జీడీవీతో విడుదల చేయనున్న ప్రాజెక్టులు సహకరించగలవని భావిస్తోంది. ఇవికాకుండా రూ. 12,000 కోట్ల విలువైన ప్రస్తుత ఇన్వెంటరీ సైతం తోడ్పాటునివ్వగలదని పేర్కొంటోంది. రెసిడెన్షియల్ బిజినెస్ విలువను రూ. 27,300 కోట్లుగా మదింపు చేశాం. రానున్న 2–3ఏళ్లలో కంపెనీ సైతం రూ. 5,000 కోట్ల యాన్యుటీ సాధించేందుకు ప్రణాళికలు వేసింది. 11.7 శాతం సగటు పెట్టుబడి వ్యయాలు (డబ్ల్యూఏసీసీ)తో ఈ విలువను మొత్తంగా రూ. 41,000 కోట్లుగా అంచనా వేశాం. కార్యాలయాలకు 8 శాతం క్యాప్(సీఏపీ) రేటు, రిటైల్‌కు 6.5 శాతం రేటు చొప్పున మదింపు చేశాం. ఆతిథ్య రంగ విభాగాన్ని లిస్ట్ చేసే యోచనలో కంపెనీ ఉంది. 2027 ఈవీ/ఈబీఐటీడీఏ 25 రెట్లు ప్రకారం ఈ విభాగం విలువను రూ. 14,600 కోట్లుగా అంచనా వేశాం. రెసిడెన్షియల్ విభాగంతోపాటు.. యాన్యుటీ పురోగతిలో భారీ వృద్ధి అవకాశాలు, ఆతిథ్య విభాగ లిస్టింగ్ నేపథ్యంలో ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే ప్రెస్టేజ్ ఎస్టేట్స్ బాగా ముందుంటుంది. పటిష్ట రుణ నిర్వహణ, నియంత్రణలోనే ఉన్న 0.36 రెట్లు నికర రుణ నిష్పత్తి సానుకూల అంశాలుగా చెప్పవచ్చు. రెండేళ్ల కాలానికి వృద్ధి ఆధారిత కంపెనీగా ప్రెస్టేజ్ ఎస్టేట్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.



యాక్సిస్ బ్యాంక్ | బ్రోకరేజ్: షేర్‌ఖాన్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,167 టార్గెట్: రూ. 1,470

ఎందుకంటే: ఫ్రాంచైజీలో నిర్మాణాత్మక ఇంప్రూవ్‌మెంట్ కారణంగా ఏర్పడిన అప్‌సైకిల్ దశతో ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ మరింత జోరందుకోనుంది. ఫలితాల్లో వృద్ధి కొనసాగడం, నిలకడైన నికర వడ్డీ మార్జిన్లు, సీఈటీ–1 గ్యాప్ (ఆస్తులతో బ్యాంక్ మూలధన నిష్పత్తి) క్రమంగా తగ్గుతుండటం వంటి అంశాలు బ్యాంక్‌కు బలిమినివ్వనున్నాయి. దీంతో బ్యాంక్ షేరుకి బూస్ట్ లభించే వీలుంది. వివిధ దశలలో అధిక స్థాయి రిస్క్ సర్దుబాటు రిటర్నులు సాధిస్తుండటం, ఇదే సమయంలో రిస్క్ వెయిటెడ్ అసెట్స్ తక్కువ వృద్ధి నమోదు చేస్తుండటం సానుకూల అంశాలుగా పేర్కొనవచ్చు. డిపాజిట్లను ప్రోదిచేసుకోవడంలో నిలకడైన వృద్ధి, గత రెండేళ్లలో డిపాజిట్ల ఔట్‌ఫ్లోస్ 5 శాతానికి తగ్గడం, ఎల్‌సీఆర్‌లో 23.9 శాతానికి కట్టడి చేయడం ప్రధాన అంశాలు కాగా.. నికర వడ్డీ మార్జిన్ల క్షీణత దశ ముగిసిపోయినట్లుగా భావించవచ్చు. ఆస్తుల నాణ్యతలో నిలకడ కొనసాగుతుండటంతో రుణ వ్యయాలు తగ్గనున్నాయి. దీర్ఘకాలిక సగటుకంటే తక్కువకు చేరడంతో లాభదాయకత, రిటర్న్ రేషియోలు మెరుగుపడనున్నాయి. దీంతో భవిష్యత్ అవసరాలపై బ్యాంక్ ఇన్వెస్ట్ చేసేందుకు వీలు చిక్కనుంది. వాతావరణం సానుకూలించినంత కాలం పెట్టుబడుల కొనసాగింపునకు అవకాశముంది. రుణ వృద్ధి మందగించే వీలున్నప్పటికీ డిపాజిట్ల పురోగతితో ముడివేయనుంది. మధ్య, దీర్ఘకాలాలకు బ్యాంకింగ్ పరిశ్రమను మించి 3–4 శాతం అధిక వృద్ధిని సాధించగలమని యాక్సిస్ విశ్వసిస్తోంది. సమీప కాలంలో బిజినెస్ అవసరాలకు అనుగుణంగా ఈక్విటీ మూలధన సమీకరణ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు బ్యాంక్ పేర్కొంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

టర్మ్ ఇన్సూరెన్స్ ఎప్పటి వరకు?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా ఆదాయం 30 శాతం పన్ను శ్లాబు పరిధిలోకి వస్తుంది. కనుక నా పేరు మీద బదులు పన్ను ఆదా కోసం అమ్మ పేరు మీద సిప్ మొదలు పెట్టడం సరైనదేనా? – నిఖిల్ సైని

మీరు అనుకున్న విధంగా చేయొచ్చు. మీ అమ్మకు ఎలాంటి పన్ను వర్తించే ఆదాయం లేకపోయినా లేదా తక్కువ పన్ను శ్లాబు రేటు పరిధిలో ఉన్నా కానీ, ఆమె పేరు మీద ఇన్వెస్ట్ చేయడం తెలివైన నిర్ణయం అవుతుంది. మీ పన్ను భారం తగ్గుతుంది. కాకపోతే ఈ విధానంలో కొన్ని రిస్క్‌లు ఉన్నాయి. మీ అమ్మ పేరు మీద చేసిన పెట్టుబడులపై రాబడులను పన్ను అధికారులు గుర్తించిన సందర్భంలో దానిని మీ ఆదాయం కిందే పరిగణిస్తారు. ఆ ప్రకారం పన్ను వసూలు చేస్తారు. అమ్మ పేరిట చేసిన పెట్టుబడిని మీకు తిరిగి ఇచ్చినా సరే పన్ను అధికారుల కళ్లు కప్పలేరు. మీ తరఫున మీ తల్లిదండ్రుల్లో ఎవరు ఇన్వెస్ట్ చేసినా న్యాయపరమైన అంశాలను కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు. ఎందుకంటే చట్టపరంగా చూస్తే ఆ పెట్టుబడులు వారికే చెందుతాయి. ఒకవేళ ఇలా తల్లి లేదా తండ్రి పేరు మీద మీరు ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. వారు మరణించినట్టయితే వారి పేరు మీదున్న పెట్టుబడుల్లో వాటాను మీ తోడబుట్టిన వారు కూడా క్లెయిమ్ చేసుకోవచ్చు. నామినీగా మీ పేరున్నా సరే.. వారసత్వ చట్టాలు తోబుట్టువులు అందరినీ సమానంగా పరిగణిస్తాయి.

నేను టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని అనుకుంటున్నాను. ఏ వయసు వరకు తీసుకోవడం సరైనది? నా భార్య గృహిణి. ఆమె నాపైనే ఆధారపడి ఉంది. కనుక టర్మ్ ప్లాన్‌ను 85 ఏళ్ల వరకు తీసుకోవాలా లేక 60 ఏళ్ల వరకు తీసుకుంటే సరిపోతుందా? – తేజాస్ శాస్త్రి

కనీసం 60 ఏళ్ల వయసు వచ్చే వరకు టర్మ్ ప్లాన్ (జీవిత బీమా) తీసుకోవాలి. సాధారణంగా రిటైర్మెంట్ వయసు ఇదే. ఆ వయసు వచ్చే నాటికి తదనంతర జీవిత అవసరాలకు సరిపడా నిధి సమకూర్చుకునేట్టు అయితే.. 60 ఏళ్ల తర్వాత టర్మ్ ఇన్సూరెన్స్ అవసరం లేదు. మీ పెట్టుబడులకు నామినీగా మీ జీవిత భాగస్వామి పేరు నమోదు చేయడం మర్చిపోవద్దు. ఇందుకు వీలునామా రాయడం మంచిది. దీనివల్ల 60 ఏళ్లు వచ్చిన తర్వాత దురదృష్ట వశాత్తూ మీరు మరణించిన సందర్భంలో ఆస్తులు జీవత భాగస్వామికి సాఫీగా బదిలీ అయ్యేందుకు వీలునామా వీలు కల్పిస్తుంది. ఒకవేళ 60 ఏళ్లలోపు మరణించినట్టయితే మీపై ఆధారపడిన వారిని జీవిత బీమా పరిహారం ఆర్థికంగా ఆదుకుంటుంది. అలాగే, 85 ఏళ్లు, అంతకుమించిన వయసుకు కూడా టర్మ్ ప్లాన్ తీసుకోవచ్చు. ఇలా దీర్ఘకాలం పాటు ఎంపిక చేసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.



భారత్‌లో ఫాక్స్‌కాన్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్

- వచ్చే ఏడాదిలో మరిన్ని పెట్టుబడులు
- సంస్థ చైర్మన్ యాంగ్‌లీ ప్రకటన



శ్రీపెరంబదూర్: భారత్‌లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్టు తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లీ ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహన విభాగంపై దృష్టితో బ్యాటరీ తయారీ వ్యాపార విస్తరణపై ఫాక్స్‌కాన్ దృష్టి సారించింది. ఈ సంస్థ ఈ–బస్‌ల కోసం తైవాన్‌లో ఇలాంటి ప్లాంట్ ఒకదాన్ని ఇప్పటికే ఏర్పాటు చేయగా, ఈ ఏడాదే ఉత్పత్తి మొదలు కానుంది. ''3ప్లస్3 భవిష్యత్ పరిశ్రమ ఏర్పాటుకు వేచి చూస్తున్నాం. తమిళనాడులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటు విషయంలో సహకారం ఎలా అన్నదానిపై పరిశ్రమల మంత్రితో చర్చిస్తున్నా'' అని యాంగ్‌లీ తెలిపారు. సోలార్, విండ్ టర్బయిన్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను నిల్వ చేసేందుకు బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు వీలు కల్పిస్తాయి. మన దేశం పెద్ద ఎత్తున పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యం ఇస్తుండడం తెలిసిందే. దీంతో ఈ విభాగంలో అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఫాక్స్‌కాన్ ఆసక్తిగా ఉన్నట్టు యాంగ్‌లీ మాటలను బట్టి తెలుస్తోంది. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిశగా ఫాక్స్‌కాన్ ప్రణాళికలు అమలు చేస్తోంది. త్వరలోనే ఈవీల తయారీ మొదలవుతుందని యాంగ్‌లీ తెలిపారు. భారత్‌లో ఇప్పటివరకు తాము 1.4 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశామని, వ్యాపారం 10 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందినట్టు చెప్పారు. రానున్న ఏడాది కాలంలో మరిన్ని పెట్టుబడులు పెడతామని ప్రకటించారు. ప్రస్తుత భారత పర్యటనలో భాగంగా పలు రాష్ట్రాల సీఎంలతో యాంగ్‌లీ సమావేశం కావడం గమనార్హం. ఎన్నో రాష్ట్రాలను సందర్శించిన తర్వాత భారత్ వృద్ధి పథకంలో ఉందని అర్థమవుతోందంటూ.. ఈ ప్రయాణంలో ఫాక్స్‌కాన్ సైతం భాగస్వామి కావాలనుకుంటున్నట్టు యాంగ్‌లీ చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
మార్కెట్.. ప్రపంచ పరిణామాలే దిక్సూచి
ఐదేళ్లలో బీపీసీఎల్ భారీ పెట్టుబడులు

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

19-8-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	501–00
విజయవాడ	496–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10



చిక్కిన 1,500 కిలోల టేకు చేప

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం పల్లిపాలెంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు 1,500 కిలోల టేకు చేప ఆదివారం చిక్కింది. పశ్చిమ గోదావరి జిల్లా వేములదీవికి చెందిన బి.వెంకటేశ్వర్లు బోటుపై వెళ్లిన కాకినాడ మత్స్యకారులు అంతర్వేది సముద్రతీరం నుంచి జేసీబీ సాయంతో ఫిషింగ్ హార్బర్‌కు తీసుకువచ్చారు. కాకినాడ కుంబాభిషేకం రేవులో విక్రయించేందుకు తీసుకెళ్లారు.


– సఖినేటిపల్లి

సీతాకోకసుమం..



మకరందం కోసం పువ్వుపై వాలిన సీతాకోకచిలుక.. ఆ పువ్వులో లీనమై.. మమేకమై 'సీతాకోకసుమం'గా సరికొత్త సౌందర్యాన్ని ఆవిష్కరిస్తూ మది దోచేస్తోంది కదూ..! తిరుపతిలో విరిసిన ఈ సోయగాల మెరుపును 'సాక్షి' కెమెరా ఒడిసిపట్టింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



Narkedamilli's Wedding Invitation

Name: Address:

I. Identify the person in the picture
Ans: Groom Phaneendra

II. Correct the spelling of Bride
PRATUSHA Ans: PRATHYUSHA

III. The Parents of Groom ______
Dr. Chidella Sree Rama Murthy – Janaki Devi

IV. Who are doing Kanyadan?
Narkedamilli Satesh – Rani

V. On which date marriage is going to happen (c)
a. 25-8-24 b. 18-11-24 c. 23-8-24 d. 09-07-24

VI. Time of marriage (b)
a. 12:30 pm b. 2:45 am c. 8:58 am d. 7:00 pm

VII. The place of marriage
Sri Venugopala Auditorium, Mertero, West Godavari

'ప్రశ్నపత్ర'మే పెళ్లి శుభలేఖ

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన ఓ టీచర్ తన పెళ్లి శుభలేఖను ప్రశ్నపత్రంగా తయారు చేసి స్నేహితులకు పంపిణీ చేసి తన ప్రత్యేకతను చాటుకొంది. నార్కెడమిల్లి సతీష్, రాణి దంపతుల కుమార్తె ప్రత్యూషకు 23న వివాహం జరుగనుంది. తన వివాహ పత్రిక వినూత్నంగా ఉండాలని భావించిన ప్రత్యూష.. శుభలేఖను 8 ప్రశ్నలుగా విభజించింది. సింగిల్ ఆన్సర్ క్వశ్చన్, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్, ట్రూ, ఫాల్స్ ఆన్సర్ క్వశ్చన్‌గా శుభలేఖలోనే వరుడి పేరు, వధువు పేరు, కన్యాదానం చేసేవారి పేర్లు, పెళ్లి తేదీ, సమయం, పెళ్లి మండపం, విందుకు సంబంధించి ప్రశ్న, జవాబుతో తీర్చిదిద్దిన శుభలేఖను పలువురు ఆసక్తిగా తిలకించి అభినందించారు. –పెనుగొండ

క్లుప్తంగా...

బెంగళూరులో విద్యార్థినిపై లైంగికదాడి

బొమ్మనహళ్లి: బెంగళూరులో ఓ యువతిపై లైంగికదాడి జరిగింది. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం రాత్రి స్నేహితులతో కలిసి కోరమంగళలోని పబ్‌కు వెళ్లింది. అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో బయలుదేరగా దారి మధ్యలో కారులో సమస్య వచ్చి ఆగిపోయింది. దీంతో రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి బయలుదేరింది. ఆ వ్యక్తి యువతిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి దాడి చేసి, అత్యాచారం చేసి పరారయ్యాడు. కొంతసేపటికి తేరుకున్న ఆమె తన స్నేహితులకు మెసేజ్ పంపడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి ఆమెను ఆస్పత్రికి తరలించారు. లైంగిక దాడి చేసిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అద్భుతం



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ ఫారెన్స్ సడ్జన్ తదితరులు


తిరుపతి రూరల్/రామచంద్రాపురం: ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని లండన్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఫారెన్స్ సడ్జన్ అభినందించారు. తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం వేమూరులో లండన్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం ఆదివారం పర్యటించింది. బర్మింగ్‌హామ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఫారెన్స్ సడ్జన్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా పంటలను సాగు చేసే విధానం, ఘన జీవామృతం తయారీ, విత్తనం కిట్స్, సీడ్ బాల్స్ ప్రత్యక్షంగా తయారు చేసే విధానం, ఏటీయం మోడల్, ప్రకృతి వ్యవసాయ పంటల దిగుబడి వంటి అంశాలపై లండన్ శాస్త్రవేత్తలకు ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు, ఫార్మర్ సైంటిస్టులు వివరించారు. ఏపీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అద్భుతంగా ఉన్నాయని డాక్టర్ ఫారెన్స్ సడ్జన్ అభినందించారు. రానున్న రోజుల్లో ఎక్కువగా ప్రకృతి వ్యవసాయానికే ప్రజలు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. అలాగే రామచంద్రాపురం మండలంలోని సీతారామాపురం, కుప్పంబాదూరు, పుల్లమనాయుడు కండ్రిగ, సీకాలేపల్లి గ్రామాల్లో శాస్త్రవేత్తలు పర్యటించారు.

శిశు విక్రయ కేసులో కొత్త ట్విస్ట్

విశాఖ సిటీ: విశాఖ శిశు విక్రయ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అంతర్రాష్ట్ర ముఠా హస్తం ఉన్నట్లు గుర్తించి.. వారిని పట్టుకునేందుకు ఒడిశా, కడప, అనకాపల్లికి ప్రత్యేక బృందాలను పంపించినట్లు సమాచారం. కంచరపాలెం ప్రాంతానికి చెందిన బాలిక జన్మనిచ్చిన చిన్నారి విక్రయ వ్యవహారం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు ఇప్పటికే 9 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో అంతర్రాష్ట్ర ముఠా హస్తం ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. లోతుగా దర్యాప్తు చేపట్టేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మూడు బృందాలు ఒడిశా, కడప, అనకాపల్లికి ఆదివారం బయలుదేరినట్లు సమాచారం. శిశు విక్రయ వ్యవహారంలో సూత్రధారులను పట్టుకున్న తరువాత పోలీసులు కేసు వివరాలను వెల్లడించే అవకాశముంది.

2027లో విజయవాడలో నేషనల్ గేమ్స్

- ఎంపీ కేశినేని శివనాథ్



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలో 2027లో నేషనల్ గేమ్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం కళాశాల ఆవరణలో ఆదివారం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ మంగళగిరిలోని ఇంటర్‌నేషనల్ స్టేడియంను ఆరునెలల్లో ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.

ఉపాధికి గడ్డుకాలం



టెక్కలి మండలం జీడిపేట సమీపంలో తెరుచుకోకుండా ఉన్న ప్రియాంక గ్రానైట్ క్వారీ



లింగాలవలస సమీపంలో క్వారీ పనులు ఆగిపోయిన జమ్ము గ్రానైట్ కంపెనీ

శ్రీకాకుళం జిల్లాలో మూతపడ్డ గ్రానైట్ పరిశ్రమలు

నూతన పాలసీ ముసుగులో మూసివేసిన సర్కార్

ఆర్థిక కష్టాల్లో యజమానులు.. పనుల్లేక కార్మికుల పస్తులు	జిల్లాలో ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా 45 వేల మంది ఉపాధికి దెబ్బ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వ్యవసాయం, మత్స్యకార రంగాల తర్వాత శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా ఉపాధి దొరికేది గ్రానైట్ పరిశ్రమల్లోనే. ఇప్పుడా పరిశ్రమలు మూతబడ్డాయి. నూతన పాలసీ పేరుతో గ్రానైట్ పరిశ్రమలను ప్రభుత్వమే మూసివేయించింది. రెండు నెలలుగా గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పనులు జరగడం లేదు. ఉపాధి లేక కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి. వారి ఆకలికేకలను జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పట్లో పరిశ్రమలు తెరుచుకునే పరిస్థితి లేదని భావిస్తున్న కార్మికులు.. మళ్లీ వలస బాట పడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 150 క్వారీలు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా మరో 150 పాలిషింగ్ యూనిట్లు, 30 క్రషర్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా సుమారు 25 వేల మంది, పరోక్షంగా 45 వేల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో జిల్లాకు చెందిన వారే కాకుండా ఒడిశా, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు కూడా ఉన్నారు.

కూటమి నేతల పెత్తనం..

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రానైట్ పరిశ్రమలపై కూటమి నేతల పెత్తనం మొదలైంది. మళ్లీ తాము చెప్పేవరకు గ్రానైట్ పరిశ్రమల్లో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకూడదని అధికారవర్గాల ద్వారా ఆదేశించారు. దీనికి నూతన గ్రానైట్ పాలసీ అనే ముసుగు తొడిగారు. పర్మిట్‌లను ఇవ్వకుండా నిలిపేశారు. దీంతో గ్రానైట్ క్వారీలతో పాటు వాటి అనుబంధ యూనిట్లు అన్నీ రెండు నెలల క్రితమే మూతపడ్డాయి. దీంతో వాటిపై ఆధారపడ్డ కార్మికులంతా గగ్గోలు పెడుతున్నారు. ఈ సంక్షోభం ఒక్క కార్మికులపైనే కాదు యాజమాన్యాలపైనా ప్రభావం చూపింది.. ఇక్కడ గ్రానైట్ బ్లాకులు ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వెళ్లేవి. ప్రస్తుతం విక్రయాలు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం ఏర్పడక ముందు తీసిన బ్లాక్‌లు ఆరు బయటే ఉండిపోవటంతో కలర్ మారి మార్కెట్‌లో విలువ తగ్గిపోయేలా ఉంది. ఫలితంగా గ్రానైట్ పరిశ్రమ తీవ్ర నష్టాల్లో కూరుకుపోనుంది. అటు కార్మికుల ఆకలికేకలు, ఇటు యాజమాన్యాల నష్టాలను క్షేత్రస్థాయిలో 'సాక్షి' పరిశీలించింది.

కార్మికుల వేదన వర్ణనాతీతం

గ్రానైట్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్న టెక్కలి మండలంలో కార్మికుల వేదన వర్ణనాతీతంగా ఉంది. బొరిగిపేట సమీపంలోని ఓ క్వారీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తాను టీడీపీ అభిమానినని, కూటమి ప్రభుత్వం వచ్చాక తమకు మంచి జరుగుతుందని భావిస్తే చివరకు కడుపుకొట్టారని చెప్పారు. పరిశ్రమలు తెరిపించండి అని కోరడానికి ఇక్కడి మంత్రి వద్దకు వెళితే.. పరిశ్రమ తెరవకపోతే తినడం మానేస్తావా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడిపేట, మెలియాపుట్టి, దీనబంధుపురం, సవర, జాడుపల్లి, నిమ్మాడ తదితర గ్రామాల్లో నివసించే కార్మికుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఫ్యాక్టరీలు ఆపేసి తమ ఉపాధిపై దెబ్బకొట్టి పస్తులు పెట్టడం ఏంటని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

కాసుల కక్కుర్తి కోసమే..

గ్రానైట్ పరిశ్రమల నుంచి కాసులు ఆశించే ఇలా చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా 2014–19లో గ్రానైట్ కార్యకలాపాలన్నీ మంత్రి సోదరుడు కనుసన్నల్లోనే జరిగేవి. వారి కుటుంబానికి కూడా గ్రానైట్ అనుబంధ పరిశ్రమలు ఉండటంతో వాటి ముసుగులో చక్రం తిప్పేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వారి పప్పులు ఉడకలేదు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావడంతో గ్రానైట్ కంపెనీలపై పెత్తనం కోసం ప్రయత్నిస్తున్నారు. దానికి నూతన పాలసీ అంటూ బూచిగా చూపిస్తున్నారు అని కార్మిక వర్గాలు చెబుతున్నాయి.

ఉపాధి పోయింది



మా ఊరికి దగ్గరలో మేలిసతివాడ వద్ద క్వారీలో జాకీ లేబర్‌గా పనిచేస్తుండేవాడిని. క్వారీలు నడవక ఉపాధి పోయింది. ఈ ప్రభుత్వం వచ్చాక మా లాంటి పేదలకు పెద్ద ఇబ్బందులు వచ్చాయి. గత ప్రభుత్వంలో బాగానే క్వారీలు నడచి జీతాలు వచ్చాయి.

–కొర్రాయి నారాయణ, జీడిపేట, వీకేజీ క్వారీ మేలిసతివాడ

గ్రానైట్ కార్మికులను రోడ్డున పడేశారు



కూటమి ప్రభుత్వం గ్రానైట్ క్వారీల నిర్వాహణపై ఆంక్షలు పెట్టింది. దీని వలన జిల్లాలోని క్వారీలు, వాటికి అనుసంధానంగా ఉన్న పాలిషింగ్ యూనిట్లు, క్రషర్లు ఆగిపోయాయి. దీంతో వేలాది మంది కార్మికులు నడిరోడ్డున పడ్డారు. జిల్లాలో ఇటువంటి పరిస్థితి ఇంతకు ముందెన్నడూ లేదు. దీని వలన జిల్లాలో వలసలు ఆరంభమయ్యాయి. జిల్లాలో వ్యవసాయ కార్మికులు, నిరుద్యోగ యువతకు ఉపాధికి ఆసరాగా ఉన్న గ్రానైట్ రంగాన్ని కుదేలు చేస్తున్నారు.

–షణ్ముఖరావు, గ్రానైట్ కార్మికుల యూనియన్ జిల్లా నాయకుడు

పని లేదు.. బత్తాలు లేవు



ఈ ప్రభుత్వం వచ్చాక క్వారీలన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. దీని వలన పని లేదు. బత్తాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోజు రేపు అని చెబుతున్నారు కానీ క్వారీలు తెరవడం లేదు. పని లేక పస్తులుంటున్నాం.

–ముఖలింగాపురం అప్పారావు, జాకీ లేబర్, ప్రియాంక గ్రానైట్, జీడిపేట

మార్గదర్శి మోసాలకు శిక్ష తప్పదు

- అవినీతి పునాదులపై రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం: అంబటి
- ఆయన ఆర్థిక నేరస్తుడని ముందు నుంచి మేం చెబుతున్నది రుజువైంది



సాక్షి, అమరావతి: రామోజీరావు ఓ ఆర్థిక నేరస్తుడని తాము ముందు నుంచి చెబుతున్నామని, తాజాగా హైకోర్టులో ఆర్బీఐ దాఖలు చేసిన అఫిడవిట్‌తో అది నిరూపితమైందని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మీడియా ముసుగులో రామోజీ యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించి అవినీతి పునాదుల మీద ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించారని ధ్వజమెత్తారు. చట్ట విరుద్ధంగా మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వసూళ్లపై సీఎం చంద్రబాబు ఏనాడూ కన్నెత్తి చూడలేదని విమర్శించారు. తాము ఎన్ని నేరాలు చేసినా ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాలో రామోజీ వారసులు ఉన్నారని చెప్పారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అంబటి మీడియాతో మాట్లాడారు.

■ దశాబ్దాల పాటు రామోజీ అక్రమ డిపాజిట్ల సేకరణ, మార్గదర్శిలో భారీ కుంభకోణాన్ని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వెలికితీశారు. ఆర్బీఐ చట్టం సెక్షన్–45(ఎస్) ప్రకారం ఆ డిపాజిట్ల సేకరణ నేరమని ఉండవల్లి ఫిర్యాదు చేయడంతో మార్గదర్శిపై విచారణ మొదలైంది.

■ మార్గదర్శి ద్వారా రామోజీరావు 2006 నాటికి చట్ట విరుద్ధంగా రూ.2,610 కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించారు. నాడు సీఎంగా ఉన్న వైఎస్సార్ మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వ్యవహారంపై చర్యలకు ఆదేశిస్తే చంద్రబాబుతోసహా రామోజీరావు మద్దతుదారులంతా పత్రికా స్వేచ్ఛపై దాడిగా దుష్ప్రచారం చేశారు.

■ మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వ్యవహారంపై ఆర్బీఐ ప్రకటన చేసిన నేపథ్యంలో బాధ్యులు, ఆ సంస్థలో డైరెక్టర్లపై కోర్టులో విచారణ తప్పదు. శిక్ష కూడా తప్పదు.

■ ఎక్కడ, ఏ ఆఫీసులో చిత్తు కాగితాలు తగలబెట్టినా మా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం టీడీపీ, ఎల్లో మీడియాకు పరిపాటిగా మారింది. ఏ ఆఫీస్‌లో చెత్త కాగితాలు కూడా తగలెట్టొద్దంటూ జీవో ఇవ్వాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాం.

■ పోలవరాన్ని త్వరగా పూర్తి చేయాలన్న తాపత్రయంతో స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్.. అన్నింటి పనులు ఒకేసారి మొదలు పెట్టినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా అంగీకరించినందున వారి తప్పిదాన్ని వారే ఒప్పుకున్నారు.

అమెరికాలో ప్రకాశం జిల్లా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

- సముద్రస్నానానికి వెళ్లి నీటిలో మునక
- 18 నెలల కిందటే కాలిఫోర్నియాకు..



బుచ్చిబాబు (ఫైల్)

ముండ్లమూరు: అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రకాశం జిల్లా ముండ్లమూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దొద్దాల బుచ్చిబాబు (40) సముద్రంలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ముండ్లమూరుకు చెందిన దొద్దాల కోటేశ్వరరావు, కోటేశ్వరమ్మలకు కుమారుడు బుచ్చిబాబు, ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసుకుంటూ ఇద్దరినీ చదివించారు. కుమారుడు బుచ్చిబాబు ఎనిమిదేళ్లు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. కంపెనీ ఆదేశాల మేరకు 18 నెలల కిందట భార్య కిరణ్మయితో కలిసి కాలిఫోర్నియా వెళ్లి అక్కడే నివాసం ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. వీకెండ్ సెలవులు కావడంతో ఆదివారం కుటుంబ సభ్యులతో సరదాగా సముద్ర స్నానానికి వెళ్లారు. అక్కడ ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు కొట్టుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. కుమారుడి మరణవార్త విని తల్లి కోటేశ్వరమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి చేర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకొంటున్నారు.

పని సర్దుబాటుకు కొత్త మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పని సర్దుబాటు ప్రక్రియకు పాఠశాల విద్యాశాఖ తాజాగా ఆదివారం మార్గదర్శకాలిచ్చింది. ఇప్పటికే రెండుసార్లు ఈ ప్రక్రియ చేపట్టాలని మార్గదర్శకాలిచ్చినా ప్రభుత్వ షరతులకు ఉపాధ్యాయులు అంగీకరించలేదు. దీంతో 14న మరోసారి పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించారు. నేతలు తమ డిమాండ్లను ఆయన ముందుంచారు. ఇందులో జీవో నం.117 రద్దు మినహా మిగిలిన వాటికి అంగీకరించారు. దీనిప్రకారమే ఆదివారం ఉత్తర్వులిచ్చారు. బదిలీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో క్యాడర్ సీనియారిటీ పరంగా జూనియర్‌ను మిగులుగా గుర్తిస్తారు. సీనియర్ ఉపాధ్యాయుడి అంగీకారంతో మిగులు ఉపాధ్యాయుల స్థానంలో పని సర్దుబాటుకు సిద్ధంగా ఉంటే వారికి అవకాశమిస్తారు. క్యాడర్ సీనియారిటీని లెక్కించేందుకు ఒకే డీఎస్సీ, మెరిట్–కమ్–రోస్టర్‌లో ఉన్న టీచర్ల సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటారు. బదిలీల్లో సబ్జెక్ట్ టీచర్ లేదా సెకండరీ గ్రేడ్ టీచర్ లేని పాఠశాలలకు మొదటి ప్రాధాన్యం ఇస్తారు. పని సర్దుబాటు ప్రక్రియ 9వ తేదీ నాటికి యూడైస్‌లో నమోదైన డేటా ఆధారంగా నిర్వహిస్తారు.

రాయే.. ఊతమాయే

టిక్..టిక్..టిక్ మంటూ ఆ ప్రాంతంలో వినిపించే శబ్దం.. జీవన సౌందర్య శ్రావ్య సునాదం. కఠిన రాయిని ఒడుపుగా చీల్చితేనే కడుపునిండేది. వాటిని హద్దురాయిగా మలిస్తేనే పళ్లెంలో ముద్ద పడేది. నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్నది పెద్దల సలహా అయితే.. రాళ్లు ముందేసుకుని వాటిలోనే జీవనోపాధిని వెతుక్కోవడం వారికి తెలిసిన విద్య. ఒక్కోసారి గురితప్పి చేతిపై పడే సుత్తి దెబ్బలు.. రాళ్లే మీద పడి కాళ్లు పోయిన సందర్భాలు.. సుత్తి దెబ్బలకు చేతులు అదురుతున్నా.. ఉలి ఒక్కోసారి గాల్లో ఎగిరి దేహానికి గాయమవుతున్నా.. అదరక, బెదరక వారు చేసే జీవన పోరాటం అచ్చెరువొందిస్తుంది. గ్రానైట్ పరిశ్రమల్లో వృథాగా మిగిలే రాయి నుంచి హద్దురాళ్లను తయారు చేస్తూ బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో వందలాది మంది ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



హద్దురాళ్లు పనుల్లో మహిళా కార్మికులు

- వృథా రాళ్లను హద్దు రాళ్లుగా మలుస్తూ బతుకు పయనం
- బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల్లో ఉపాధిగా మారిన హద్దురాళ్ల తయారీ
- సంవత్సరం పొడవునా ఎగుమతులు
- తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుకు లారీల ద్వారా సరఫరా
- వేలాదిమంది కార్మికులకు జీవనోపాధి

బల్లికురవ: బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని ఈర్ల కొండ నుంచి తీసే స్టీల్ గ్రే గ్రానైట్‌కు దేశ విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ తీసే గ్రానైట్ ముడిరాళ్లు పరిశ్రమలకు నిత్యం ఎగుమతి అవుతుంటాయి. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని సుమారు 1600 గ్రానైట్ పరిశ్రమలకు ముడిరాళ్ల ఎగుమతి నిత్యం జరుగుతోంది. ఈ పరిశ్రమల్లో ముడి రాయిని పరుపురాళ్లుగా తయారు చేస్తారు. పరుపు రాయి తీసే దశలో వచ్చే వృథారాయితో హద్దు రాళ్లుగా తయారు చేస్తూ పలువురు జీవనోపాధి పొందుతున్నారు.

1200 మందికి ఉపాధి

బల్లికురవ, వల్లాపల్లి, నాగరాజు పల్లి, మార్టూరు, వేమవరం జంక్షన్, జొంతాళి, రాజుపాలెం, ఏల్చూరు, సంతమాగులూరు, వెల్లల చెరువు, మల్లాయపాలెం, కొణిదెన, నక్కబొక్కలపాడు, కామేపల్లి, రాజుగారి పాలెం వద్ద గ్రానైట్ పరిశ్రమల పొలాలు, స్థలాలకు హద్దు (ఫెన్సింగ్‌తో) రాళ్లు, ఇళ్లు, పరిశ్రమల నిర్మాణంలో ఫౌండేషన్‌లో వాడే సైజు రాళ్లు, వేస్టు చెక్కను తయారు చేస్తూ సుమారు 1200 మంది వరకు పురుషులు, స్త్రీలు, ఉపాధి పొందుతున్నారు. ఒక్కో కార్మికుడు 7 అడుగుల రాయి చీల్చి తీసినందుకు రూ. 80 తీసుకుంటారు. 6 అడుగుల రాయి తీసినందుకు రూ. 70 వంతున తీసుకుంటారు.

లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఎగుమతులు...

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, తమిళనాడు, కర్ణాటకకు ఆర్డర్లపై నిత్యం లారీల ద్వారా హద్దురాళ్లను ఇక్కడ నుంచి లోడింగ్ చేసి పంపుతున్నారు. సమీపంలోని అద్దంకి, దర్శి, శావల్యా పురం, వినుకొండ, పర్చూరు, కొరిశపాడు మండలాలకు ట్రాక్టర్లకు లోడ్ చేసి కాంట్రాక్టర్లు పంపుతుంటారు. జూన్ నుంచి నవంబర్ వరకు వ్యవ సాయ పనుల వల్ల కొంత మేర డిమాండ్ తగ్గుతోందని కాంట్రాక్టర్లు షేక్ అబ్దుల్లా, అల్లావుద్దీన్ 'సాక్షి'కి తెలిపారు. పై రాష్ట్రాల్లో గత 10 సంవత్సరాలుగా హద్దు రాళ్లకు గిరాకీ ఉండటంతో ప్రధాన గ్రామాల్లో, పట్టణాల్లో అక్కడి వ్యాపారులకు ఆర్డర్ల ప్రకారం పంపుతున్నట్లు వివరించారు. వృథా రాయి నుంచి హద్దురాళ్ల తయారు చేస్తూ వేలమంది ఉపాధి పొందుతున్నా.. మైనింగ్ అధికారులు తనిఖీల పేరిట ఇబ్బందులు పెట్టడం మానడం లేదని పలువురు వాపోతున్నారు.



ట్రాక్టర్‌పై తరలిస్తున్న హద్దురాళ్లు

హద్దురాళ్లు చేస్తూ జీవిస్తున్నాం



గ్రానైట్ వృథా రాళ్ల నుంచి హద్దురాళ్లు తీస్తూ 10 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాను. ప్రమాదంలో ఎడమకాలు మోకాలి పైవరకు పూర్తిగా కట్ అయింది. నా భార్య సహాయంతో చెక్కకాలు వేసుకుని పని ప్రదేశానికి వచ్చి ఇద్దరం కలిసి పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాం.

– షేక్ హుస్సేన్, దివ్యాంగుడు, వల్లాపల్లి

అలవాటు పడ్డాం...



వృథారాయి చెక్కల నుంచి హద్దు రాళ్లు తీసే పనికి అలవాటు పడ్డాం. గతంలో కొండల్లో మెటల్ తీసేవాళ్లం. స్టోన్ క్రషర్లు వచ్చాక మేం తయారు చేసే మెటల్‌కు గిరాకీ తగ్గింది. దీంతో 10 సంవత్సరాలుగా హద్దు సైజు రాళ్లు తీస్తూ రోజుకు రూ.700 నుంచి రూ. 800 సంపాదిస్తున్నా.

– షేక్ షరీఫ్, వల్లాపల్లి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో మార్పులకు అనుగుణంగా సంస్కృతి, ఆచారాలను అలవర్చుకోవాలని సీనియర్ సాహితీవేత్త హంలి పేర్కొన్నారు. ఆదివారం కన్నడ భవనంలో జిల్లా, తాలూకా కసాప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబు భండారిగల్ రాసిన సంఘర్షానికి దారి అనే పుస్తకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విప్లవ సాహితీవేత్త రాసిన పుస్తకాలు ప్రజల మన్ననలను పొందాయన్నారు. తాలూకా కసాప అధ్యక్షుడు వెంకటేష్ బేవినబెంచి, దస్తగిరి సాబ్, అయ్యప్ప హుడా, రేఖ, భగత్‌రాజ్, రామణ్ణ, దానప్ప, ఈరణ్ణ, తాయప్ప, రావుత్‌రావ్, విజయేంద్రలున్నారు.

రాఘవేంద్ర ఆరాధనోత్సవాలు షురూ

రాయచూరు రూరల్ : మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల మఠంలో రాఘవేంద్ర స్వాముల 353వ ఆరాధనోత్సవాలు, సప్తరథోత్సవాలను మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామీజీ ప్రారంభించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అధికారులు తెచ్చిన పట్టు వస్త్రాలను గురురాజ్‌కు సమర్పించారు. ఆదివారం సాయంత్రం మఠం ప్రాంగణంలో ధ్వజారోహణం నెరవేర్చారు. అశ్వ, గో, గజరాజులకు పూజలు జరిపారు.

అఘాయిత్యంపై నిరసన



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై కొందరు దుండగులు అఘాయిత్యానికి పాల్పడడాన్ని నిరసిస్తూ రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాల పరిశోధన విద్యార్థులు శనివారం సాయంత్రం కళాశాల వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆందోళననుద్దేశించి విద్యార్థుల తరఫున డాక్టర్ ప్రభా భాల్కి మాట్లాడారు. యువ వైద్యురాలిపై అకృత్యానికి పాల్పడిన నిందితులపై ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీనియర్ వైద్యుల వినూత్న నిరసన

హుబ్లీ: వైద్యుల స్టైపెండ్ పెంపు, రైతుల భద్రత చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యుల సంఘం నేతృత్వంలో జరుగుతున్న జూనియర్ వైద్యుల నిరవధిక సమ్మె నగరంలో కొనసాగింది. చెన్నమ్మ సర్కిల్, కేఎంసీ ఆస్పత్రి ఎదుట వైద్యులు టీ అమ్మడం ద్వారా వినూత్నంగా ఆందోళన చేపట్టారు. వైద్య వృత్తి కన్నా టీ అమ్మడమే సురక్షితం, లాభదాయకం అంటూ విభిన్నంగా ఈ ఆందోళన చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చెన్నమ్మ సర్కిల్‌లో ప్రజలకు టీని అందిస్తున్న తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. కేఎంసీ ఆస్పత్రి ఎదుట కూడా రోగులకు, వారి బంధువులకు టీ పంపిణీ చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సుహాస్ మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 7వ రోజుకు చేరుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తమ వద్దకు వచ్చి సమస్యలను ఆలకించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులకు రూ.3 వేలు అందిస్తుంది. అయితే తమకు స్టైపెండ్ చెల్లించడం లేదు. వైద్యులకు ఎటువంటి రక్షణ లేదు. ఈ విషయంపై ఎన్నో సార్లు పోరాటం చేశాం. ఇటీవల కోల్‌కతాలో పీజీ వైద్యవిద్యార్థినిని హత్య చేయడం ఖండనీయం అన్నారు. వైద్యులకు ఎటువంటి రక్షణ లేక పోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే డాక్టర్లందరికీ తగిన రక్షణ ఇవ్వాలని కోరారు. ఆదర్శ్, రక్షిత్, ప్రదీప్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాయచూరు రూరల్: రాయచూరు తాలూకా జంబలదిన్ని వద్ద అటవీ శాఖ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఇడపనూరు పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి 10 మంది పేకాటరాయుళ్లను, 13 వాహనాలను, రూ.40,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పుట్టమాదయ్య తెలిపారు. ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సండూరు.. కనీస సౌకర్యాలు కరువు



రోడ్డు పక్కనే చేపట్టిన కూరగాయల అమ్మకాలు



అధ్వానంగా ఉన్న పట్టణంలోని ఓ రోడ్డు

- పట్టణంలో రోడ్లు అస్తవ్యస్తం
- అధ్వానంగా ఆర్టీసీ బస్టాండు
- రోడ్డుపైనే కూరగాయల మార్కెట్
- పేరుకే ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సాక్షి,బళ్లారి:పేరు గొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో. అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు, దేశంలో అధిక సంపదను సృష్టిస్తున్న ప్రాంతంగా గుర్తింపు, దేశంలోనే పేరుగాంచిన స్టీల్ ఇండస్ట్రీ అయిన జిందాల్ సంస్థ ఉన్న నియోజకవర్గం, ఇలా చెప్పుకుంటూ పోతే వేల కోట్లు కాదు లక్షల కోట్ల సంపదను సృష్టిస్తున్న సండూరులో కనీస మౌళిక సదుపాయాలు కూడా లేకపోవడంతో స్థానికులు పాలకుల తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. రాజ మహారాజులు పాలించిన ప్రాంతం, పేరుకే సండూరు రాజులు, లాడ్ కుటుంబాలు అని గొప్పలు చెప్పుకుంటారే కాని అక్కడ జనం పడుతున్న ఇబ్బందులు ఆ రెండు కుటుంబాలు నియోజకవర్గాన్ని తమ గుప్పెట్లో ఉంచుకోవాలనుకుంటున్నదే కాని నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి ఆలోచించడం లేదని అక్కడ సామాన్య ప్రజల నుంచి వెలువడుతున్న మాట. ఘోర్పడే, లాడ్ కుటుంబాలు ఈ నియోజకవర్గాన్ని శాసిస్తున్నాయి. ఈ రెండు కుటుంబాలకు చెందిన వారే అక్కడ రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు గడించారు. రెండు కుటుంబాలు సంపదలో పోటీ పడి సంపాదించుకున్నారు. మైనింగ్ వ్యాపారంలో అపర కుబేరులుగా ఎదిగారు.

నియోజకవర్గ ప్రజల బాధలు వర్ణనాతీతం

సండూరు నియోజకవర్గంలో కనీస సౌకర్యాలు లేక జనం పడుతున్న బాధలు వర్ణించలేని విధంగా మారాయి. పేరుకే సండూరులో ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేశారు కాని అక్కడ వైద్యులు పని చేయడం అంతంత మాత్రమే. సదుపాయాలు కూడా లేకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. సండూరులో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద ఎత్తున పన్నుల రూపంలో ఆదాయం జమ అవుతుంటుంది. జిందాల్ కంపెనీ కూడా ఈ నియోజకవర్గంలో ఉండటంతో ఆ సంస్థ నుంచి వందల కోట్ల రూపంలో పన్నులు చేరుతుంటాయి. ఎన్నో స్టీల్ ఇండస్ట్రీస్ కూడా వెలిశాయి. ఇంత పెద్ద ఎత్తున సంపద ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్య విద్యావంతులు, అవిద్యావంతులు కూడా ఇక్కడకు వచ్చి ఏదో రకంగా పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వినాసం ఉంటున్న జనం సండూరు అభివృద్ధిపై తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముందు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల్లో అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కాలం గడిపి ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సౌకర్యాలు కరువైన ఆర్టీసీ బస్టాండు

22 నుంచి అగ్నివీర్ నియామక ర్యాలీ

హుబ్లీ: 2024వ సంవత్సరానికి గాను అగ్నిపథ్ యోజన ద్వారా వివిధ పోస్టులకు రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు సైన్యంలోకి ప్రవేశం పొందేందుకు వ్యాయామ, వైద్య పరీక్షలకు అగ్నివీర్ నియామక ర్యాలీ ఈనెల 22 నుంచి 31 వరకు శివమొగ్గ నగరంలోని నెహ్రూ మైదానంలో జరగనుంది. ర్యాలీకి ఎంపికైన శివమొగ్గ, దావణగెరె, బాగలకోటె, విజయపుర, ధార్వాడ, ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడిపి, గదగ్, హావేరి, చిక్కమగళూరు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు మాత్రమే ప్రవేశ పత్రాలను అభ్యర్థుల ఇ-మెయిల్‌కు పంపించామని మంగళూరు సైన్యం నియామక డైరెక్టర్ తెలిపారు. వివరాలకు 08182220925 అనే ఫోన్ నంబరుకు సంప్రదించాలని ఆ జిల్లా సైనిక సంక్షేమ, పునర్ వసతి శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

గుంతకల్లు టౌన్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకలోని బళ్లారికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ సమయంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, సౌత్‌క్యాబిన్, ట్విన్‌లైన్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లినట్లు అంగీకరించాడు. దీంతో ఇర్ఫాన్‌ను అరెస్ట్ చేసి, రూ.2.50 లక్షల విలువైన ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గేట్ బిగించిన కార్మికులకు సన్మానం

- రూ.50 వేల చొప్పున నగదు పంపిణీ

హొసపేటి: ఇది అరుదైన సంఘటన. ఐదు రోజుల పాటు అహోరాత్రులు శ్రమించి రైతాంగం ఆందోళనను దూరం చేసిన వారికి కృతజ్ఞతా సభను జిల్లా ఇంచార్జి మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం టీబీ డ్యాంలో ఏర్పాటు చేశారు. తుంగభద్ర డ్యాంలో 19వ నంబర్ క్రస్ట్‌గేట్ చైన్ లింక్ కట్ అయిన నేపథ్యంలో స్టాప్‌లాగ్ గేట్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి విజయవంతం చేసిన కార్మికులను అభినందించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, కంప్లి ఎమ్మెల్యే గణేష్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అన్వర్ బాషా, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇమాం నియాజ్ సమక్షంలో తుంగభద్ర డ్యాం వద్ద స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటులో రాత్రింబగళ్లు పని చేసిన 20 మంది కీలక కూలీలకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతిని అందించి సన్మానించారు. స్టాప్‌లాగ్ గేట్‌ను విజయవంతంగా ఏర్పాటు చేసినందుకు మీ అందరికీ వ్యక్తిగతంగా రివార్డు అందచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఆయన గైర్హాజరీలో కూడా ఎమ్మెల్యే గణేష్ తాను వ్యక్తిగతంగా డబ్బులు పంపిణీ హామీని నెరవేర్చారు. ఈ సందర్భంగా జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



కీలకంగా పని చేసిన వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

హుబ్లీ: ధార్వాడలోని సువర్ణ ఎడ్యుకేషన్ ట్రస్ట్, భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ, జిల్లా ఆస్పత్రిల ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ అధ్యక్షులు విశ్వనాథ అమరశెట్టి జన్మదినం నేపథ్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేఎంఎఫ్ అధ్యక్షుడు శంకర్ ముగద మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. దీని వల్ల మరొకరి ప్రాణం కాపాడినట్లు అవుతుందన్నారు. అంతేగాక రక్తదాత మరింత ఆరోగ్యంగా ఉండటానికి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమేష్ హళ్లికేరి, డాక్టర్ సారథి, హిరేమఠ, ఆ ట్రస్ట్ కార్యర్శి సవితా అమరశెట్టి, ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ వైద్యుల రక్తదానం

బళ్లారి రూరల్ : జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా 6వ రోజు బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్(బీఎంసీఆర్‌సీ) ఆసుపత్రి ముందు ఆర్‌డీఏ(రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్), బీఎంసీఆర్‌సీ బ్లడ్‌బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని బీఎంసీఆర్‌సీ డీన్ డాక్టర్ గంగాధరగౌడ ప్రారంభించారు. రక్తదానం చేసిన రెసిడెంట్ డాక్టర్లకు ప్రమాణ పత్రాలను అందజేశారు. డీన్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం. ప్రాణదాతలైన వైద్యులు రక్తదాతలు అయ్యారన్నారు. శిబిరంలో రెసిడెంట్ డాక్టర్లు 90 మంది రక్తదానం చేశారు. ఆర్‌డీఏ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ నూరీ తబుస్సమ్, జనరల్ సెక్రటరీ డాక్టర్ మహ్మద్ అనాస్, సహకార్యదర్శులు డాక్టర్ రుద్రేశ్, డాక్టర్ ప్రియ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

వేడుకగా రక్షా బంధన్



రాఖీ కడుతున్న స్మిత అక్క

రాయచూరు రూరల్: అన్నాచెల్లెళ్ల బాంధవ్యం దైవంతో సమానమని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు స్మిత అక్క పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రక్షా బంధన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు.నగరసభ సభ్యుడు జయన్న, అరుణ హిరేమట్, అమరేష్, శారద, రామణ్ణ, రామస్వామి, సురేఖ, హరీష్ నాడగౌడలున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

రాయచూరు రూరల్: నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత కేటాయించాలని యువ స్వచ్ఛ అభియాన్ నేత రవి బోసురాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 14వ వార్డులో స్వచ్ఛ అభియాన్‌కు ఆయన శ్రీకారం చుట్టి మాట్లాడారు. నగరసభ సభ్యులు హాజీ హుసేన్, సాజిద్ సమీర్, శాలం, ఫిరోజ్, నరసింహులు, వినోద్, తేజప్ప, ప్రశాంత్, వెంకటేష్, మణికంఠలున్నారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు

రాయచూరురూరల్: సమాజంలో పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి పేదరికం అడ్డు కారాదని శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో ఆర్యవైశ్య సమాజపు ప్రతిభావంత విద్యార్థులను సన్మానించి మాట్లాడారు. పట్టణ ప్రాంతాలలో విద్యకు ప్రాధాన్యత కల్పించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సమాజం అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కిశోర్, దత్తాత్రేయ, నరేంద్ర తిమ్మయ్య శెట్టిలున్నారు.

సిద్దు జోలికొస్తే బీజేపీ మసే

హుబ్లీ: సీఎం సిద్దరామయ్య జోలికొస్తే బీజేపీ సర్వనాశనం అవుతుందని నవలగుంద ఎమ్మెల్యే ఎన్‌హెచ్.కోనరెడ్డి మండిపడ్డారు. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై ఆయన ధార్వాడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అత్యధిక మెజార్టీతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయడం కుదరదన్నారు. హెచ్‌ఆర్ బొమ్మై విషయంలో కోర్టులు ఇచ్చిన తీర్పు ఇందుకు నిదర్శనం అన్నారు. అయినా ఇలాంటి దుస్సాహసానికి బీజేపీ పాల్పడటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రాజీనామా ఇవ్వబోరని, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. మైసూరు జనాందోళన సభలో 136 మంది ఎమ్మెల్యేలు సిద్దరామయ్యే సీఎం అని తీర్మానించారన్నారు.

సాగునీటి కోసం పాదయాత్ర

రాయచూరు రూరల్: తుంగభద్ర డ్యాం రక్షణకు తోడు ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందించాలని రైతులు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం తాలూకాలోని హరవి నుంచి డ్యాం వరకు సంచాలకులు శంకరగౌడ, అనిత పాదయాత్ర ప్రారంభించి మాట్లాడారు. 69వ మైల్ వద్ద నీటి నిర్వహణ గేజ్ సామర్థ్యాన్ని గురించి జిల్లాధికారికి వివరించినా ఆయకట్టు చివరి భూములకు నీరందడం లేదన్నారు. 69వ మైలు వద్ద గేజ్ నిర్వహణలో జరిగిన లోపంతో కింది భాగానికి నీరందడం లేదన్నారు. 69వ మైలు పైభాగంలో భారీగా, అక్రమంగా ఉన్న నాన్ ఆయకట్టును తొలగిస్తే ఆయకట్టు చివరి భూములకు నీరు అందుతాయన్నారు. మంత్రి, శాసన సభ్యుల మధ్య రైతులు నష్టపోతున్నారన్నారు.



పాదయాత్ర చేపట్టిన రైతులు

ముగ్గురిపై పాలికె మేయర్ కుటుంబ సభ్యుల దాడి

హుబ్లీ: నిష్కారణంగా విజయపుర పాలికె మేయర్ మెహెజబ్బిన్ హొర్తి, ఆమె భర్త, కుమారులు ముగ్గురిపై దాడి చేసిన ఘటన ఆదివారం విజయపుర నగరంలోని భగవాన్‌గల్లీలో చోటు చేసుకుంది. పావురాళ్ల విషయానికి సంబంధించి ఇక్కడి నివాసి యాస్మిన్, ఆయన కుమారుడితో పాటు మరో మహిళపై పాలికె మేయర్ కుటుంబ సభ్యులు మారణాయుధాలతో దాడి చేశారని బాధితులు గాంధీచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తమకు న్యాయం కల్పించాలని, నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ యాస్మిన్ డిమాండ్ చేశారు.

చిరుత దాడిలో కుక్క బలి

హుబ్లీ: ధార్వాడ జిల్లాలోని కలఘటిగి తాలూకా మలకనకొప్ప గ్రామ రైతులు పొలంలో ఇంటి బయట కట్టి వేసిన కుక్కను చిరుత చంపి తిన్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మహదేవప్ప దేశాయి ఉదయం పొలానికి వెళ్లి చూడగా ఈ దృశ్యం కనిపించింది. ఇంటి చుట్టూ అలాగే పొలంలోను చిరుత పాదాల ముద్రలు కనిపించడంతో గ్రామస్తులో ఆందోళన వ్యక్తం అవుతోంది. కొంత కాలంగా తాలూకాలోని సుతగట్టి, తబకద హొన్నళ్లి, మలకనకొప్ప, గ్రామ శివారులోని గుట్టల్లో చిరుత జాడలు కనిపించడంతో రైతులు పొలానికి వెళ్లడానికి కూడా భయపడుతున్నారు. కాగా ఈ విషయమై సంబంధిత అటవీ అధికారి అరుణా అత్తిగి స్పందిస్తూ తబకద హొన్నళ్లి గ్రామ పరిధిలో చిరుత సంచరించడం కనిపిస్తోంది. తమ సిబ్బంది చిరుతను అడవిలోకి పంపడానికి తీవ్రంగా ప్రయతిస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో మొక్కజొన్న, చెరుకు తదితర పంటలు ఉన్నందు వల్ల చిరుత ఎటు వైపు వెళుతుందో తెలియడం లేదన్నారు. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. చిరుత దాని అడుగు జాడలు కనిపిస్తే తక్షణమే తమ అటవీ శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

సకాలంలో గేటు అమరికతో నీటి ఆదా

- గేటు డిజైన్ తెలిసి ఉండడం కలిసొచ్చింది : కన్నయ్య నాయుడు

హొసపేటి: తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేట్ స్థానంలో ప్రత్యామ్నాయ స్టాప్‌లాగ్ ఏర్పాటు విజయవంతం కావడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. డ్యాం అధికారులు, నిపుణులు, కార్మికులు ఇందులో ముఖ్యపాత్ర వహించారు. తుంగభద్ర ఆయకట్టులో పంటలకు ప్రమాదం తొలగింది. స్టాప్ లాగ్ గేటును సకాలంలో కూర్చోపెట్టడంతో డ్యాంలో ఎంతో నీటిని కాపాడినట్లు ప్రత్యేక నిపుణుడు కన్నయ్య నాయుడు తెలిపారు. ఆలస్యమై ఉంటే 70 టీఎంసీల వరకు నీరు వృథా అయి ఉండేదని చెప్పారు. శనివారం సాయంత్రం డ్యాం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గేట్ల డిజైన్ తీసుకొచ్చి ఉంటే ఇంకా పనులు ప్రారంభం కాలేకపోయేవని, డిజైన్‌పై పూర్తి సమాచారం ఉండటంతో కొన్ని గంటల్లోనే నమూనాను సిద్ధం చేశాం. మూడు కంపెనీల ద్వారా గేట్‌ను తయారు చేయించామని చెపపారు. ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ఇప్పుడే వచ్చిందన్నారు. తాము డిజైన్ కోసం ఇప్పటివరకు వేచి ఉంటే డ్యాంలో 40 టీఎంసీలు మాత్రమే మిగిలేవని అన్నారు. శుక్రవారం రాత్రి మొదటి ఎలిమెంట్‌ను అమర్చడం వల్లనే 70 టీఎంసీలకు వరకు నీటిని కాపాడామన్నారు.



19వ నంబరు క్రస్ట్‌గేట్ స్థానంలో అమర్చిన గేటు

సకాలంలో చికిత్స అందక పసికందు మృతి

హొసపేటి: విజయనగర జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో పీకే హళ్లి జీపీ సభ్యుడు తాయప్ప భార్య అంకాలమ్మ ప్రసవించిన పసికందు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పురిటి నొప్పులతో బాధపడుతున్న అంకాలమ్మ భర్త అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో రాత్రి పీకే హళ్లి నుంచి నగర ఆస్పత్రికి తరలించారు. కానీ ఆమె మార్గమధ్యంలో అంబులెన్స్‌లో ప్రసవించింది. కాన్పు అయిన తర్వాత పసికందుకు వైద్యులు సరైన చికిత్స కోసం కొప్పళలోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని, ఉదయం వరకు వేచి ఉండాలని తెలిపారు. దీంతో ఆమె బంధువులు ఉదయం వరకు వేచి ఉండటంతో పసికందు తీవ్ర అస్వస్థతకు గురైంది. ఉదయం కొప్పళ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శిశువు మృతి చెందింది. హొసపేటి జిల్లా ఆస్పత్రిలో వైద్యులు సరిగా చికిత్స అందించక పోవడంతోనే శిశువు మృతి చెందిందని, జిల్లా వైద్యాధికారులు నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వైద్యులపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టి డిమాండ్ చేశారు.



మృత శిశువుతో కుటుంబ సభ్యులు

పిడుగుపాటుకు రైతు దుర్మరణం



రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: పిడుగుపాటుకు గురై రైతు దుర్మరణం పాలైన ఘటన శనివారం దేవదుర్గ తాలూకా మూడలగుండలో చోటు చేసుకుంది. పొలం పనులు చేసుకుంటుండగా భారీ వర్షం కురువడంతో పాటు పిడుగులు పడ్డాయి. చెట్టు కింద తల దాచుకున్న బసవరాజ్(30) పిడుగుపాటుకు గురై మరణించాడు. తహసీల్దార్ చెన్నమల్లప్ప ఘంటి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జాలహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం

రాయచూరు రూరల్: కన్నడ భవనంలో ఆదివారం క్రాంతి వీర సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా ఆచరించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి జిల్లాధ్యక్షుడు శాంతప్ప పుష్పాంజలి ఘటించారు. యువకులు సన్మార్గం వైపు నడవాలన్నారు. భారతీయ సంస్కృతిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, వడవాటి నరసింహులు, దేవన్న నాయక, శ్రీకాంత్, సురేఖ, వీరనగౌడలున్నారు.

జానపద కళలను ఆదరించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

హొసపేటి: నగరంలోని మల్లిగె హోటల్‌లో కమలా కులకర్ణి అధ్యక్షతన నూతన శ్రీకీర్తి జానపద, సుగమ సంగీత కళా ట్రస్ట్‌ను ప్రముఖ జానపద కళాకారుడు గురురాజ్ హొసకోటె ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, దీనికి పరిరక్షించి, మన సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా బీఎంఎం ఇస్పాత్ కంపెనీ మేనేజర్ గణేష్ హెగ్డే, పద్మశ్రీ అవార్డు గ్రహీత మాతా మంజమ్మ జోగతి, హుడా అధ్యక్షుడు ఇమామ్ నియాజీ, మల్లిగు హోటల్ యజమాని పీడీ గౌతమ్, కన్నడ, సంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు సిద్ధలింగేష్ రంగన్నవర్, గుజ్జల గణేష్, కాసాటి ఉమాపతి, తారిహళ్లి జంబునాథ్, బోదరంపప్ప, ఎస్ఎస్ చంద్రశేఖర్, మధుర చెన్నశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల గుర్తింపునకు పరీక్షలు దోహదం

- ఉచిత వైద్య శిబిరాల లబ్ధి పొందాలని ప్రజలకు పిలుపు
- బీపీఎల్ కార్డుదారులకు అన్ని చికిత్సలు ఉచితం అని వెల్లడి
- ఆర్యవైశ్య సంఘం జిల్లాధ్యక్షుడు డాక్టర్ రమేష్ గోపాల్

సాక్షి,బళ్లారి: మారుతున్న కాలానుగుణంగా, ఆహారపు అలవాట్లు మారిపోవడంతో పాటు శారీరక శ్రమ లేకపోవడంతో ఎంతో మందికి పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ముందుగా గుర్తించేందుకు వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేష్ గోపాల్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నగరంలోని వాసవీ కళ్యాణమంటపంలో ఆర్యవైశ్య అసోసియేషన్ బళ్లారి, బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఉచిత వైద్య,ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు బెంగళూరు నుంచి వైద్య నిపుణులు విచ్చేశారన్నారు. వైద్య పరీక్షలు చేసుకోవడం ద్వారా ముందుగా రోగాలను పసిగట్టేందుకు వీలవుతుందన్నారు. లేకపోతే రోగాలు ముదిరిపోయిన తర్వాత సమస్యకు పరిష్కారం దొరకడం కష్టంగా మారుతుందన్నారు. మోకాళ్ల మార్పిడి కోసం ఉచితంగా పరీక్ష నిర్వహిస్తారని, క్యాన్సర్‌కు కూడా ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.బీపీఎల్‌కార్డు ఉన్న వారందరికీ ఆస్పత్రి నిర్వాహకులే అన్ని విధాలుగా చికిత్స చేసేందుకు తమ సంఘం కృషి చేస్తోందన్నారు. నగరంలోని పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఆరోగ్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దాదాపు 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 23 మందికి వివిధ రకాలైన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా బెంగళూరులోని సప్తగిరి ఆస్పత్రిలో చికిత్సలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నామా నాగరాజు, కార్యదర్శి సొంతా గిరధర్, ప్రముఖ వైద్యులు మల్లికార్జున, పార్థసారథి, శరవణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సంఘం ప్రముఖులు